జ్యోతి

నవలానుబంధం

అజ్ఞాతబంధాలు

సి. ఆనందారామం

"ర...త్న...మ్మా!"

ఒక్కొక్క అక్షరమూ అప్రయత్నంగా వచ్చింది లలిత నోటినుండి.

"రత్నమ్మకాదు. రాగిణి" కిలకిల నవ్వింది, పల్చని జార్జట్ చీరలో స్పష్టంగా కనిపిస్తోన్న అంగసౌష్ఠవంతో. . విలాసంగా నిలబడి మెడలో మెరుస్తోన్న నెక్లెస్‌తో ధగధగలాడుతోన్న రాగిణి.

"రా! కూచో!" లలిత భుజాలమీద చేతులువేసి కూచోబెట్ట బోయింది రాగిణి.

జడప్రాయంగా నిలబడ్డ లలిత ఆ స్పర్శకు జుగుప్సతో జలద రించింది- రాగిణి చేతులు విదలించింది.

భగ్గుమంది రాగిణి- మనసు ఎంత నిశితమైనదో, అంత సుకుమార మైనది. అన్ని విషయాలూ గాఢంగా అనుభవిస్తుంది. ఆ అనుభూతి గాఢమైనకొద్దీ దానిని వెలిగ్రక్కటానికే ప్రయత్నిస్తుంది. రాగిణి మన సులో మంటలు బయటపడాలి!

"నువ్వే నెగ్గావు రాజూ!" అంది రాజువైపు తిరిగి నవ్వుతూ.

అంతవరకూ పాలిపోయిన లలిత ముఖం మీదే చూపులు నిలిపిన రాజు ఎవరో చెయ్యిపట్టుకుని తిప్పినట్లు రాగిణి వైపు తిరిగి "ఇహిహీ!" అని నవ్వాడు.

ఆ నవ్వు విని ఆశ్చర్యపోయింది లలిత. ఆ సందర్భంలో రాజు నవ్వినందుకు కాదు- ఆ నవ్వులో వున్న చవటతనానికి! స్వయంకృషితో **I. A. S.** ఆఫీసరయిన రాజులో తెలివితేటలు మాత్రమే చూసింది లలిత ఇంతవరకు.

ఎంతటి విజ్ఞానవంతులయినా కొన్నికొన్ని సందర్భాల్లో ఏరికోరి చవటతనాన్ని ఆహ్వానిస్తారా? లేక అద్భుతమయిన మేధను వెన్నంటే అజ్ఞానం దాక్కుని ఉంటుందా? అవకాశం రాగానే బయట పడుతుందా?

"అన్నట్లు లలితా! నీకు మా పందెం గురించి తెలియదుకదూ! చెప్తానుండు! నేను నిన్ను చూడాలనుకున్నాను- నిన్ను తీసుకురమ్మని రాజుతో చెప్పాను. నువ్వే వస్తావన్నాడు రాజు- "లలితకు అభిమానం ఎక్కువ- రాదేమో!" అన్నాను- "రెండు మూడు రోజుల్లో రాకపోతే

చూడు! లలిత నన్ను చూడకుండా ఉండలేదు!" అని పందెం వేసాడు ఏం పందెమో తెలుసా? ఒక తియ్యటి ముద్దు- బండబ్బాయి! పందెం గెలుచుకున్నాడు. ఏయ్ రాజూ! "ఆఫ్టరాల్, ముద్దు మాత్రమేకదా" అనుకునేవు! నా ముద్దు ఖరీదు ఎంతో తెలుసా? అయిదు వందల రూపాయలు!"

పకపక నవ్వింది రాగిణి! రాగిణితో కలిసి నవ్వాడు రాజు! అది నవ్వేనా? నవ్వటం కనిపిస్తోంది మరి!

ఎవరో మనను హిప్నటైజ్ చెయ్యక్కర్లేదు. చాలా సందర్భాల్లో మనను మనమే హిప్నటైజ్ చేసుకుంటూ బ్రతికేస్తాము. అదే నిజం బ్రతుకనుకుంటాము!

తన ముద్దుకు విలువ రూపాయలలో చూపిస్తోంది రాగిణి. ఆ విలువను అలాగే గ్రహిస్తున్నాడా రాజు?

'లలిత నన్ను చూడకుండా ఉండలే'దని పందెం వేసాడు రాజు! ఆ పందెం నెగ్గినందుకు రాగిణితో కలిసి నవ్వుతున్నాడు!

ప్రతిరోజూ రాజు లలితను కలుస్తూనే ఉంటాడు. ఆఫీస్ పని పూర్తయ్యాక లలిత ఇంటికి రావటం- ఇంటనో- బయటనో- ఇద్దరూ సాయంత్రాలు సరదాగా గడపటం పరిపాటి.

వారం రోజులుగా రాజు రాకపోవటంతో లలిత మొదట కోప గించుకుంది- తరువాత తల్లడిల్లిపోయింది. రాజు ఆరోగ్యం పాడయి ఉంటుందనే ఆలోచన తప్ప మరొక ఆలోచన రాలేదు లలితకి. రాజు దగ్గరకి బయలుదేరి వస్తూ తెలిసిన దేవతలకందరికీ మొక్కుకుంది రాజు ఆరోగ్యంగా కనిపించాలని.

దేవతలు కరుణించారు- రాజు ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు- కానీ...

దేవతలనేవాళ్ళు నిజంగా ఉండి కోరిన కోరికలన్నీ ప్రసాదిస్తే మాన వులు సుఖపడగలరా? అంతులేని ఆశలతో అలమటించిపోతూ ఒకదాని వెనుక మరొకటిగా కోరికలు పెంచుకునే మనుష్యులలో నిజంగా తమకేం కావాలో తమకు తెలిసిన వాళ్లెందరు?

రాజు నవ్వుతున్నాడు- శత్రువర్గంలో ఉన్న గూఢచారి శత్రువులు తనను గుర్తుపట్టకుండా నవ్వినట్లు నవ్వుతున్నాడు! తనదికాని నవ్వును తనదిగా చేసుకుని నవ్వుతున్నాడు.

లలిత లేచి "వెళ్తాను!" అంది శాంతంగా. ఆ శాంతం రాగిణికి నచ్చలేదు.

"ఉండు లలితా వెళ్ళవుగానీ! ఇదిగో, ఈ పూలు పెట్టుకో! వద్దంటున్నా రాజు ఇన్ని పూలు తెచ్చిపడేసాడు."

దగ్గరగా వచ్చి తలలో పూలు పెట్టబోయింది రాగిణి. విసురుగా తల పక్కకు తిప్పింది లలిత. "వద్దు" అంది.

రాగిణి వెటకారంగా నవ్వుతూ "ఎందుకు అంత కోపం!" అంది.

"కోపం కాదు! ఏ రకం పూలనైనా ఎప్పుడంటే అప్పుడు పెట్టుకునే స్వభావం కాదు నాది!"

లలిత మాటలు రాగిణి కర్థంకాలేదు. అదే రాగిణి అదృష్టం. పైపైకి తోచేవే తప్ప ఆలోచించవలసినవేవీ అర్థంకావు.

రాగిణి ఒక్కసారి లేచి నిలబడి అభ్యాసవశాన వచ్చిన భంగిమలో అంగ సౌష్ఠవాన్ని అందంగా ప్రదర్శిస్తూ "నువ్వెప్పుడూ ఇంతే! అడవి మాలోకానివి!" అంది. "కదూ రాజా!" గారాబంగా దీర్ఘం తీసింది.

"అవునవును! లలితకేం పట్టదు_ అడవి మాలోకం!" అన్నాడు రాజు. కానీ అలా అంటూ లలితను గౌరవంగా చూసాడు. లలితను రాజూ రాగిణీ ఇద్దరూ "అడవి మా లోకం"గానే చూసారు. కానీ ఆ మాటకు రాగిణి అర్థం వేరు, రాజు అర్థం వేరు.

"నేను వెళ్తున్నాను" అంది రాగిణి కొంటె నవ్వుతో ఓరగా రాజుని చూస్తూ.

చటుక్కున రాగిణి చెయ్యి పట్టుకుని "వెళ్ళవుగానిలే, వుండు!" అన్నాడు రాజు.

రాగిణి ఆ చెయ్యి వదిలించుకోకుండా ఆటకాయితనంగా ఊపుతూ "ఎందుకు? ఎప్పటికయినా మీరూమీరూ ఒకటే! నేనే మధ్యలో వచ్చి మధ్యలో పోయేదానిని" అంది ముద్దు ముద్దుగా.

రాగిణి చెయ్యి వదిలేసాడు రాజు. "ఉండు!" అన్నాడు గొణుగుతున్నట్లు.

"లలితను కూడా ఉండమను! నాకొక్కదానికీ వుండాలని లేదు!" పెంకిగా అంది రాగిణి.

లలిత రాజును చూస్తూ కూచుంది. లలిత చూపులు తప్పించుకున్నాడు రాజు.

ఎంతటి బలహీనులైనా హిప్నటిజమ్ ప్రభావంలో ఎల్లకాలం ఉండలేరు. అప్పుడప్పుడు తాము బయట పడక తప్పదు.

శాంతంగా స్థిరంగా ఉండాలని ఎంత ప్రయత్నించినా ఆ ఇంటి

గడప దాటి బోయేముందు కాళ్ళు వణికాయి లలితకి. కొంచెం తూలి తన నెవరయినా పట్టుకునేలోగానే నిలదొక్కుకుని అక్కడనుండి బయట పడింది.

లలిత ముఖం చూసి హడిలిపోయింది లలిత తల్లి జానకి. ఆవిడకు లలితంటే ఎంతో ప్రేమ.

తనకంటె చిన్నదయినా కూతురంటే గౌరవం.

లలిత తండ్రి వెంకట్రావు గుమస్తా. బీదరికం భరించటం కష్టమే. కానీ కేవలం బీదరికం కారణంగానే బ్రతుకులు నాశనం కావు. వీధి దీపాలకింద చదువుకుని వృద్ధిలోకి వచ్చినవా రున్నారు. మేడలూ. మిద్దెలూ. కూలదోసుకుని వీధుల్లో పడినవాళ్ళున్నారు.

వెంకట్రావు స్వార్థపరుడు, పెళ్ళి చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు. కానీ, వాళ్ళను పైకి తీసుకురావలసిన బాధ్యత తనకుందని ఏనాడూ ఆలోచించలేదు. అన్ని వేళలా తనకి సదుపాయాలు జరగాలి. ఇంట్లోవాళ్ళు తిన్నా తినకపోయినా, తనకు కూరలు కావాలి! పెరుగు కావాలి! వీటన్నిటి కంటె భయంకరమైనది స్త్రీ వ్యసనం. ఉచ్ఛనీచాలు లేక రెండుకీ మూడుకీ లభ్యమయ్యే స్త్రీల దగ్గర సుఖాన్ని వెతుక్కుంటాడు. జానకి గొప్పింటి పిల్ల గాకపోయినా సంస్కారంగల కుటుంబంలోంచి వచ్చింది. కొద్దిగా చదువుకున్నది కావటంవల్ల పిల్లల్ని దగ్గిర పెట్టుకు చదివించేది. మొదటినుండి ఆ సంసారం జానకికి ఎదురీతే అయింది. ఆ కుటుంబం వీధిన పడకుండ ఒక దారిన పడటానికి జానకి ఎన్ని పాట్లు పడిందో ఆ భగవంతుడికే తెలియాలి. దొడ్లో కూరగాయలు పెంచింది. అవి కూరలమ్మేవాళ్ళకు అమ్మింది. లేసులల్లి తెలిసినవాళ్ళను పట్టుకుని గొప్ప ఇళ్ళలో అమ్మించింది. ఇలా చేత నయినంత వరకు సంపాదించడానికి ప్రయత్నించేది. లలిత మెట్రిక్ పాసయ్యాక జానకి కాస్త ఊపిరి తీసుకో గలిగింది. కుటుంబ పరిస్థితి అర్థంచేసుకో గలిగిన లలిత తల్లికి అండగా నిలిచింది. తన ఖర్చులకి డబ్బులు చాలవని లలితని చదివించలేనన్నాడు తండ్రి. లలిత కాలేజి మానింది. కాని చదువు మానలేదు. ప్రైవేటుగా చదివి బి. ఏ. పాస యింది. యు. డి. సి. గా జాయినయింది. తమ్ముడు మోహన్‌ని తనే కాలేజిలో చేర్పించి చదివించింది. భయపెట్టి బుద్ధులు చెప్పటమే కాక ప్రేమతో అడిగినది కాదనకుండా ఇచ్చే అక్కంటే మోహన్‌కి కూడ భయభక్తు లున్నాయి.

తనను ఎదిరించి మాటాడే లలితంటే వెంకట్రావుకి మంట. లలిత ముందు తన క్షుద్రత్వం బయట పడుతుందేమోనని అత నేనాడూ భయపడ

లేదు. లలిత తనే సంకోచంతో ముడుచుకుపోయేది.

కుటుంబంకోసం స్థయిర్యంతో నిలబడి ఇంత సాధించిన లలిత ముఖంలో ఏనాడూ చిరునవ్వు మాయమవలేదు. అలాంటి లలిత ముఖం, అంతగా వడిలిపోయి కనిపించే సరికి తల్లడిల్లి పోయింది జానకి.

"ఏం జరిగింది. లలితా!" అంది ఆరాటంగా.

లలిత నవ్వడానికి ప్రయత్నించింది.

"ఏం జరగలేదే!"

జానకి మాట్లాడలేదు. కళ్ళప్పగించి నిలబడింది.

ఆ ముఖం చూస్తే అర్థమయింది లలితకి. తన ముఖంలో తన మనసు ఎంతగా ప్రతిఫలిస్తోందో.

తన మనసు ఎందుకిలా అయిపోతోంది? లోకమంతా శూన్యమయి పోయినట్లు ఈ లోకంలో ఇంక తనది అనేదేమి మిగలనట్లు తన జీవితానికి ఆధారమే నశించినట్లు.

రాజుకూ తనకూ మధ్య ఉన్నది పవిత్ర ప్రేమానుబంధమనుకొంది. ప్రేమ గురించి ఎన్నెన్ని తీయని భావాలున్నాయో, ఎంతటి ఉదాత్త భావాలున్నాయో అవన్నీ తమ అనుబంధానికి ఆపాదించుకొని ఆనందించింది.

అదంతా తన మిథ్యా కల్పన మాత్రమేనా? రాజు తనను ప్రేమించాడా? ప్రేమిస్తే అంత దారుణంగా ఎలా ప్రవర్తించగలడు? తాను ప్రేమిస్తోందా రాజును?

ప్రేమకు అర్థంచెప్పేవాళ్లు, ప్రేమించిన వ్యక్తుల సంతోషమే మన సంతోషమనుకోవటం నిజమైన ప్రేమ అంటారు. దానిని బట్టి రాగిణితో కలిసి ఉన్న రాజు సంతోషమే తన సంతోషమనుకోవాలి. అలా అనుకోగలదా! ప్రేమ అంటే ఏమిటి ? ప్రేమ నిజంగా ఉందా లోకంలో ?

ఈ అశాంతి భరించలేదు, తనను తను మరిచిపోవాలి! వీణ ముందు కూచుంది లలిత.

మనసు ఆర్తితో తన ఆవేదనను విశ్వంలో ప్రతి ధ్వనింప చేస్తోంటే లలిత చేతులు వీణను పలికించాయి. వాతావరణమంతా మధుర విషాద తరంగాలతో నిండిపోయింది.

లలిత వీణ ఆపగానే జానకమ్మ కన్నీళ్ళతో "అబ్బ ఏం రాగం లలితా! తట్టుకోలేకపోతున్నాను. ఇప్పటికే కన్నీళ్ళు పొంగివస్తున్నాయి" అంది.

లలిత కళ్ళల్లోనూ నీళ్ళే? కానీ ఆ కన్నీరు మనసు ముక్కలయిన విషాదానికి చిహ్నం కాదు. మథింపబడిన మనసు పొందే ఉద్వేగానికి చిహ్నం.

లలిత మనసు వీణానాదంతో పెనవేసుకుని ఏ లోకాలలోనో తిరగసాగింది. తాత్కాలికంగా సర్వమూ మరిచిన ఒక విచిత్రమైన మైమరపు పొందింది.

ఎదురింటివారి అమ్మాయివచ్చి ఫోన్ వచ్చిందని చెప్పింది. లేచి వెళ్ళింది లలిత.

"హలో!" మత్తుగా ముద్దముద్దగా పలికింది రాజు కంఠం.

గతుక్కుమంది లలిత - తనకు తెలిసినంతలో రాజుకు తాగే అలవాటు లేదు.

అవతలివైపునుండి నర్వస్‌గా నవ్వు ..

"తాగుబోతును కాలేదులే! ఇవాళ ఏదో మనసు చికాగ్గా ఉండి .. కాస్త ఉల్లాసంకోసం..."

లలిత మాట్లాడలేదు.

"హలో!" అన్నాడు మళ్ళీ రాజు.

"హలో!"

"ఎలా ఉన్నావ్? ఇందాక నీ ముఖం చూసి ఎలా ఉన్నావో అని కంగారు పడుతున్నాను! అందుకే ఫోన్ చేసాను. జీవం లేనట్లుగా పాలిపోయావు..."

రాజు కంఠంలో సానుభూతి ఉంది. కానీ అతడు తన అవసరు అర్ధంచేసుకుని జాలి చూపడం భరించలేక పోతోంది లలిత.

"బాగానే ఉన్నాను"

"అయామ్ సారీ లలితా!"

"................."

"రాగిణి బాగుంటుంది 36" 28" 36" చాలా చమత్కారంగా మాట్లాడుతుంది, భలే థ్రిల్..." వినలేకపోతోంది లలిత.

"బైదిబై, నీకు నామీద కోపం లేదుకదూ!"

"లేదు!"

"గుడ్! మనం స్నేహంగా విడిపోవాలి!"

నవ్వింది లలిత.

"విడిపోయాక స్నేహంకాక మరేమిటి?"

"అంటే?"

అర్థంకాలేదు రాజుకి– రాజుకు అర్థంకాదని తనకింత కసుముందన్నదీ అర్థంకాలేదు.

"గుడ్ బై, లలితా!"

"గుడ్ బై!"

పాలిపోయిన తన ముఖం చూసి జాలిపడగలిగిన మనసుంది రాజుకి. కానీ ఆ మనసుకి రాగిణిని కాదనగలిగే శక్తి లేదు. మనసు చికాకుపడింది. ఆ చికాకు మరిచిపోవడానికి తాగాడు.

తమను తాము మరిచిపోవటంలో ఉండే సుఖమేమిటి? తన్మయత్వంలో, పారవశ్యంలో, మైమరుపులో, మైకంలో, మత్తులో... మనుష్యులు తమను తాము మరిచిపోతారు. అంతమాత్రాన ఈ భావాలన్నీ ఒకటేనా?

తనూ ఒక విధమైన తన్మయత్వంలోనే ఉంది. రాజూ మైకంలోనే ఉన్నాడు. అదీ, ఇదీ, ఒకటేనా?

దుఃఖానికీ, ఆనందానికీ– అశ్రువులు స్రవిస్తాయి. పులకరించినా, జలదరించినా రోమాంచమవుతుంది. బాహ్య చిహ్నాలన్నీ ఒకటే! భేదమంతా అనుభూతులలో, ఆ అనుభూతుల నందుకునే అంతరంగాలలో.

తాగుబోతుకీ మైకం వస్తుంది, కళాతపస్వికీ మైమరపు వస్తుంది. ఆ మైకంలో మనసు అదుపులో ఉండదు. తనను తాను మరిచి బయటపడుతుంది. పైపైకి పోవాలనే ప్రయత్నమే ఉండదు– మాదకత తప్ప.

ఈ మైమరపులో మనసు అదుపులో ఉండదు. తనను తాను తెలుసుకుంటూ బయటపడుతుంది. అందని ఔన్నత్యాలను అందుకోవాలని ఆరాటపడుతుంది. ఇంతే తేడా!

రాజు రాగిణిని స్వీకరించి తనకు గుడ్ బై చెప్పగలిగాడు. రాగిణి! తనను చూసుకుని తాను గర్వపడగలిగిన రాగిణి, పాపం, రాగిణి!

2

కారులోంచి దిగి తన దగ్గరకు వచ్చిన రత్నమ్మను నివ్వెరపోయి చూసింది లలిత. పట్టు పరికిణీ– మెడలో సన్నని గొలుసు– ముఖంలో కొత్తగా వచ్చిన విశ్వాసం రత్నమ్మేనా?

"రత్నా..." అని ఏదో అనబోతుండగానే రత్నమ్మ అడ్డుకుని " 'రత్నా' అనకు 'రాగిణీ' అని పిలు– నేను మారిపోలా? నా పేరూ మారిపోయింది" అంది నవ్వుతూ.

"ఏమిటిదంతా?" అంది ఆశ్చర్యంగా లలిత.

"నా అదృష్టం- శ్యామలాంబగారు నన్ను తమ సేవాసదనంలో చ్చుకున్నారు."

దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది రాగిణి. ఆ నిట్టూర్పులో విషాదం లేదు, ఆవేదన లేదు. ఏదో సంతృప్తి వుంది. ఒక విధమైన రిలీఫ్ వుంది.

రత్నమ్మ విధిలేక పినతండ్రి ఇంట్లో పెరగవలసి వచ్చింది. వాళ్ళదీ అంతంత మాత్రం కుటుంబమే! కన్న పిల్లలకే పెట్టుకోవటానికి కటకటలాడే ఈ రోజుల్లో రత్నమ్మను సాకవలసి రావటం పినతల్లికి కష్టంగానే వుండేది. ఆవిడకూ ఇద్దరు ఆడపిల్లలున్నారు. తన పిల్లలకంటె రత్నమ్మ అందగత్తె కావటంకూడా ఆవిడ మనసులో రత్నమ్మపట్ల అసహనం కలగటానికి మరోకారణం.

ఒకే వీధిలో ఉండే రత్నమ్మను చిన్నప్పటినుండీ లలితకు తెలుసు. రత్నమ్మ పినతల్లి చేతిలో దెబ్బలుతిని ఏడుస్తోంటే ఎన్నోసార్లు లలిత తన దగ్గరున్న తాయిలం పెట్టి ఓదార్చింది. ఇంట చాకిరీతో బడికి తిన్నగా రాలేని రత్నమ్మకు తన నోట్సులిచ్చేది. అప్పటికే చదువులో వెనకపడ్డ రత్నమ్మచేత చదివించాలని చూసేది. రత్నమ్మకు తీరికలేకపోవటమేకాదు- చదువులో కూడా ఆసక్తి అంతంత మాత్రమే! పినతల్లి ఏదో వంకతో రత్నమ్మను తిట్టని రోజంటూ లేదు. రత్నమ్మ కుమిలిపోతోంటే లలిత ధైర్యం చెప్పేది. రత్నమ్మ ఎలాగైనా చదువుకుని తన కాళ్ళమీద తను నిలబడాలని లలిత ఉద్దేశం. కానీ రత్నమ్మకు పుస్తకం పుచ్చుకోగానే ఆవులింతలొచ్చేవి. ఎక్కడో, ఎప్పుడో, ఎలాగో, తాను గొప్పదైపోయినట్లు కలలుగంటూ కూర్చునేది. వెలిసిపోయిన చిరుగుల పరికిణీలు-ఎప్పుడూ దిగులుగా ఉండే ముఖం. రత్నమ్మను చూసినప్పుడల్లా జాలితో కరిగిపోయేది లలిత మనసు.

అలాంటి రత్నమ్మ రాగిణిగా వచ్చేసరికి లలితకు విడ్డూరంగా తోచింది.

"శ్యామలాంబగారెవరు? సేవాసదనమేమిటి?" అంది.

"శ్యామలాంబగారు గొప్ప సంఘ సేవకురాలులే! ఆవిడ చేతికింద చాలా సంస్థలున్నాయి. మా ఇంటికొచ్చి ఆవిడ తన సేవాసదనంలో చేర్చుకుంటానంది. పిన్ని ఒప్పుకుంది. పిన్నికావిడ రెండు వందలుకూడా ఇచ్చింది. ఎందుకూ? దండుగకదూ."

లలిత అప్పటికి స్కూల్ ఫైనల్ చదువుతోంది. కొంచెం కొంచెం లోకం తెలుస్తోంది. రాగిణి మాటలు వింటున్న కొద్దీ మతిపోయినట్టవుతోంది లలితకు-

"ప్రత్యేకం ఇంటికొచ్చి అనాథ శరణాలయంలో చేర్చుకుంటా నన్నారా? ఎదురు డబ్బిచ్చారా?" నమ్మలేనట్టు అడిగింది.

"అనాథ శరణాలయం కాదు, సేవాసదనం. అక్కడ ఎవరినంటే. వాళ్ళను చేర్చుకోరు. అందమైన వాళ్ళనే చేర్చుకుంటారు—"

లలిత కేదో అనుమానం తోచింది.

"అక్కడ నీకు బాగుందా?"

"బ్రహ్మాండంగా ఉంది. ఈ పరికిణీ చూసావా? పట్టు పరికిణీ. కంచిపట్టు. ఈ వోణీ కూడా జార్జెట్ దే! ఎప్పుడు నేనిలా పట్టు పరికిణీ లలో జార్జెట్ వోణీలలో ఉండాలని చెప్పారు శ్యామలాంబగారు. అందుకే మెడ బోసిగా ఉందని ఈ చిన్న గొలుసు వేసారు. కొంచెం రోజుల్లో ఇంకా బోలెడు నగలు చేయిస్తానన్నారు."

రాగిణి కళ్లలో కంఠంలో ఆశ అంతులేని ఆశ. లలితకు భయం వేసింది.

రాగిణి రెండు చేతులూ పట్టుకుని "రాగిణీ! ఆవిడ ఇవన్నీ ఊరికే ఎందుకిస్తుంది? బాగా ఆలోచించుకో!" అంది.

రాగిణి చేతులు విడిపించుకుని "ఊరికే ఎందుకిస్తుంది? ఆవిడకు నాతో...మాతో ఏదో అవసరం ఉంటుంది—" అంది ఎటో చూస్తూ.

లలిత నిర్ఘాంతపోయింది.

"నీకు తెలుసా అయితే?"

"ఆ! తెలుసు! ఇకముందు పిన్నితో తిట్లూ చీవాట్లూ తినక్కరలేదని తెలుసు. తిండికి తడుముకోనక్కర్లేదని తెలుసు—దర్జాగా బ్రతకొచ్చని తెలుసు!"

"ఈ బ్రతుకు దర్జా బ్రతుకు అనుకుంటున్నావా?"

"అవును ఎందుకు కాదు? నన్ను చూసాక మా పిన్ని తన కూతుర్ని కూడా తీసుకోమని శ్యామలాంబగారిని అడిగింది. ఆవిడ ఒప్పుకోలేదు. ఈ రకమైన బ్రతుకు కావాలన్నా అందరికీరాదు. అందంగా ఉండాలి!"

గర్వంగా అంది రాగిణి.

లలిత తెల్లబోతూ "అయితే నీకు ఇష్టమయ్యే అక్కడ చేరావన్న మాట!" అంది.

"ఆ! నేనే కాదు. అందరూ అంతే! ఎందు కిష్టంలేదు? ఏ బలవంతమూ లేదు. అక్కడ చేరాలని ఎందరు తాపత్రయపడతారో తెలుసా? ఏం తక్కువయింది? డబ్బు, గౌరవం పలుకుబడి అన్నీ ఉంటాయి. మామూలుగా మీరంతా ఇంతకంటె ఎక్కువ సుఖపడుతున్నారా?"

రాగిణి అర్థమయిపోయింది లలితకి_మరేమి మాట్లాడలేదు. మాట్లాడినా ప్రయోజనంలేదు.

"ఏదో బజారు వ్యవహారమని చికాకు పడుతున్నావేమో! అదంతా ఏం ఉండదు తెలుసా? శ్యామలాంబగారు చెప్పారు. అంతా గొప్ప గొప్ప వాళ్ళతో వ్యవహారం _ మాకూ_డా చాలా గౌరవం ఉంటుంది_" గర్వంగా అంది రాగిణి.

అప్పటికీ లలిత ఏమి మాట్లాడలేదు.

లలిత అలా ముభావంగా ఉదాసీనంగా ఉండటం రాగిణికేం నచ్చలేదు.

"నువ్వొకసారి మా సేవాసదనానికి రారాదు?" అంది.

"వద్దులే! నేను రాలేను_" కోపంగా అంది లలిత. అప్పటికయినా ఆ సేవాసదనంలో నుండి రాగిణిని బయటకు తీసుకు రాగలిగితే బాగుండునని లలిత తాపత్రయం.

రాగిణి మనసు చివుక్కుమంది. ఏదో అక్కసు కలిగింది.

"ఎందుకు రావూ? నిన్నూ అక్కడ చేరమంటారని భయమా? పరవాలేదులే! అక్కడ ఎవరిని పడితే వాళ్ళని చేర్చుకోరు. నాలా అన్ని విధాలా అందమైన వాళ్ళే కావాలి!" నవ్వుతూ నవ్వుతూ అనేసింగి.

త్రుళ్ళి పడింది లలిత.

తను ఎన్ని విధాలుగానో ఆదరించిన రత్నమ్మ తన దగ్గిర ఎన్నెన్నో సహాయాలు పొందిన రత్నమ్మ, ఈనాడు రాగిణిగా మారి ఇలా మాట్లాడుతోంది.

"నీ అంత గొప్పగా బ్రతకలేక పోయినా, ఏదో, ఎలాగో ఒకలా, బ్రతకడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ అభాగ్యురాలిని మరిచిపోకు."

వెటకారంగా అని వెళ్ళిపోయింది రాగిణి.

తరువాత తరువాత శ్యామలాంబ సేవాసదనంగురించి చాలా విషయాలు తెలిసాయి లలితకి. రాగిణి అన్నట్లు ఆవిడ సేవాసదనంలో అందరూ అందమైన వాళ్ళే.

ఆవిడ వాళ్ళను పెద్దపెద్ద ఆఫీసర్ల దగ్గిర పనులు సాధించుకోవటానికి ఉపయోగించుకుంటుంది. పైనుంచి కిందవరకు అన్ని రకాల మనుషుల దగ్గరా ఆవిడకు లావాదేవీ లున్నాయి. ఈ విషయాలు అందరికీ తెలుసు. ఎవరికీ తెలియనట్లే ఉంటారు.

రాగిణిని ఇంచుమించు మరచి పోయింది లలిత. చాలా రోజుల తరువాత ఆ రోజు చూసింది రాగిణిని.

రాజు పక్కన కూచుని నవ్వుతోన్న రాగిణిని.

బాపినీడు గారు రమ్మంటున్నారని ఎవరో ప్యూన్ సైకిల్ మీద వచ్చి చెప్పాడు లలితకి. అప్పటికి వారం రోజులనుండే ప్రయత్నిస్తోన్నా, బాపినీడుగారి దర్శనం కాలేదు లలితకు. మోహన్ ఇంజనీరింగ్‌లో డిప్లమా తీసుకున్నాడు. డిగ్రీలున్న వాళ్ళకే ఉద్యోగాలు దొరకని రోజుల్లో డిప్లమా మాత్రమే ఉన్న మోహన్‌కి ఉద్యోగం దొరకలేదు. బాపినీడు గారికి అన్ని రంగాలలోను పలుకుబడి ఉందనీ, ఆయన తలుచుకుంటే సహాయం చెయ్యగలరనీ కొందరు స్నేహితులు లలితకు చెప్పారు. తమ్ముడికి కూడా ఉద్యోగం దొరికితే ఇంటి పరిస్థితి కాస్త కుదుట పడుతుంది. ఆ కారణంగానే బాపినీడుగారిని కలుసుకోవాలని ప్రయత్నించింది లలిత. ఉదయం వెళితే సాయంత్రం రమ్మనీ, సాయంత్రం వెళితే మరునాడు రమ్మనీ తిప్పిస్తున్నాడు పి. ఏ. అలాంటిది ఈ రోజున అక్కడినుండే కబురు వచ్చేసరికి ఆశ్చర్యం కలిగింది లలితకి. ఏమో! బాపినీడు మంచి వాడేనేమో! తను అతనికోసం వస్తున్నట్లు ఇంతకుముందు అతనికి తెలియదేమో? ఇప్పుడు తెలుసుకుని, కబురు పంపించాడేమో!

కొంచెం జంకుతూనే వెళ్ళింది. నౌకరు లోపలకు తీసికెళ్ళాడు. అక్కడ బాపినీడు పక్కనే కూచుని పకపక నవ్వుతోన్న రాగిణిని చూసి భ్రాన్తపడిపోయింది.

రాగిణి లలితను చూడగానే తమాషాగా నవ్వింది. గర్వం, అహంకారం, వీటన్నిటినీ మించి ఏదో అసహనం వున్నాయి ఆ నవ్వులో.

"రా లలితా! కూచో! నేనే నీ కోసం కబురు పంపించాను. నాబోటివాళ్ళం ఒక స్టేటస్ మెయిన్‌టైన్ చెయ్యాలిగా! మీ ఇంటికొస్తే బాగుండదు చూడు...!"

ఏం మాట్లాడలేక నిలబడిపోయిన లలితను రాగిణి భుజాలు పట్టుకు కూర్చోబెట్టింది.

"ఏం తింటావు? రసగుల్లా? గులాబ్‌జాం కావాలా?" అని అడిగింది.

"ఏం వద్దు."

"ఎందుకు? స్వీట్స్ తినటంకూడా పవిత్రతకు భంగమా? లేకపోతే డయిటింగా? నాలాంటి వాళ్ళకు ఆ తాపత్రయాలన్నీ! నీ కెందుకు?"

"వెళ్తాను." లేచింది లలిత. రాగిణి మళ్ళీ భుజాలుపట్టి కూర్చోబెట్టింది.

"కూచో! నన్ను చూసి భయపడకు. నేను నీకేమి చెయ్యను. ఆ మాట చెప్పాలనే పిలిచాను."

"నేను నీకు భయపడటంలేదు!"

“గుడ్! ఒక్కసారి అద్దంలో చూసుకో! కొంచెం రోజుల్లోనే ఎంత మారిపోయావ్? ప్చ్! పవిత్రప్రేమ! దానికర్మ ఇంతే! పరవాలేదులే! బెంగపెట్టుకోకు! నేను రాజును పెళ్ళిచేసుకోను. పెళ్ళిచేసుకోమని కాళ్ళా వేళ్ళా పడ్డాడు మహానుభావుడు! ఈ అందమంతా... అందమొకటే కాదులే...” అని కన్నుకొట్టి నవ్వింది రాగిణి. లలిత ముఖం చూస్తూ మళ్ళీ సాగదీస్తూ సంభాషణ సాగించింది.

“ఇదంతా సొంతం చేసుకుందామని ఆశపడ్డాడు. అలాంటివాడు నా కెందుకు? అతని జీతమంతా కలిపి రెండువేలు లేదు. నాకు నెలకి అయిదువేలు తక్కువ ఖర్చుకాదు. అంతకంటె తక్కువలో ఎలా గడుపుకోవాలి? కొంచెం రోజుల్లో ఎలాగూ రాజుని ఒదిలేస్తాను. అప్పుడింక చచ్చినట్లు నీ దగ్గరకే వస్తాడు. ఈ క్షోభ, పాపం, నీకు కొంచెం రోజులే!”

లలితకు అక్కడినుంచి పారిపోవాలని ఉంది. పర్వతంలా సోఫాలో నిండుగా కూచుని, పరమానందంగా తమ సంభాషణ వింటూ చిరునవ్వులు చిలకరిస్తోన్న బాపినీడుని కత్తితో పొడవాలని ఉంది.

“అన్నట్లు రాజుకి నీలం రంగంటే ఇష్టంట, నీలం రంగు చీరను కొని జాగ్రత్త పెట్టుకో! నేను శృంగారంలో చిలిపిగా కొన్ని ధ్వనులు చేస్తాను. అవంటే రాజుకి చాలా ఇష్టం. నువ్వెప్పుడైనా తీరుబడిగా వస్తే అవెలాచేయాలో నేర్పిస్తాను...”

చిరునవ్వుతో చెప్పుకుపోతోంది రాగిణి. లలిత ముఖం చూస్తే బాపినీడుకే జాలి కలిగినట్టుంది, “మీకేం కావాలి?” అన్నాడు రాగిణి ధోరణికి అడ్డుపడుతూ...

“ఏం అక్కర్లేదు!”

“మరెందుకు తిరుగుతున్నారు. నా చుట్టూ...” అతడి మాటల్లో పరిహాస ధోరణికి లలిత పౌరుషపడలేదు.

“నేను ఎంత నీచానికి పాల్పడ్డానో, నాకు తెలియక వచ్చాను. కొన్ని కొన్ని విషయాలు అనుభవంలో కాని అర్థంకావు. అదృష్టవంతురాలిని. ఇప్పటికైనా అర్థం చేసుకున్నాను. మాబోటి వాళ్ళందరూ ఉద్యోగాలకోసమో, మరి దేనికోసమో, మీ ఇంటిచుట్టూ తిరక్కపోతే మీరేం చెయ్యగలరు? మా అలసత్వమే మీకు అధికారాన్ని ఇస్తోంది. ఈ అడ్డుదారులను అడ్డుకోకపోవటమే మాలో అల్పత్వం. వస్తాను.”

ఆ ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టగానే భయంకరమైన అగ్నిజ్వాలల్లోంచి బయటపడి నట్లనిపించింది లలితకి.

వెంకట్రావుకి నిజానికి ఏ జబ్బూ లేదు. కానీ రిటైరయ్యాక వ్యాపకమేమీ లేక తీరిగ్గా కూచునేసరికి అతనికి లోకంలో ఉన్న జబ్బులన్నీ తనకే ఉన్నట్లుగా తోచేది. ఒకరోజు "నాకు కడుపు నొప్పి" అనేవాడు. మరో రోజు "నాకు తల తిరిగిపోతోంది" అని గొడవ పెట్టేవాడు. "గుండెల్లో పోటు. నేనింక బ్రతకను." అని ఏడ్చేసేవాడు. అతని గోల భరించటం ఇంట్లో అందరికీ కష్టంగా తయారయింది.

"పని లేకపోవటమే పెద్ద జబ్బు." అనేవాడు మోహన్.

"అవునవును. వంట్లో శక్తి ఉన్నంతవరకూ గొడ్డులా మీ కందరికీ చాకిరీ చేసాను. ఇప్పుడు నన్ను మీరంతా గొడ్డును చూసినట్లే చూస్తున్నారు" అని ఏడ్చేవాడు.

వెంకట్రావు గొప్ప ఆధ్యాత్మిక భావాలున్నవాడు. అతని ఆధ్యాత్మిక భావాలు అపమార్గంలో నడవడానికి అడ్డురాలేదు. కాని, ఈనాటికి నరకభయాన్ని కలిగిస్తూన్నాయి. మృత్యుభయం. దానిని వెన్నంటి నరకభయం... తాను చూడబోయే నరకం మాటెలా ఉన్నా చుట్టుపక్కల వాళ్ళకి నరకం చూపించగలుగుతున్నాడు.

లలిత, తండ్రి సుఖంకోసం శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తోనే ఉంది. అబద్ధపు రోగమైనా నిజం రోగమైనా, రోగమని గోలపెట్టే తండ్రి అవస్థ చూడలేక ఇంటికే డాక్టర్‌ని పిలిపించింది. డాక్టర్ వచ్చిచూసి ఏ రోగమూ లేదని తెలుసుకుని ఊరికే వెళ్ళలేక బలహీనంగా ఉన్నాడని ఏవో టానిక్స్ రాసి ఇచ్చేవాడు. ఇల్లంతా లలిత సంపాదనమీద ఆధారపడి ఉంది. ఆ కాస్త సంపాదనలో టానిక్స్‌లాంటివి కూడా కొనాలంటే కష్టమే! అయినా లలిత కొనేది. డాక్టర్‌ని ఇంటికి పిలిపించాలంటే విజిటింగ్ ఛార్జెస్ ఇయ్యాలని తెలిసినా చీటికీ మాటికీ డాక్టర్‌ని పిలవమని సతాయించేవాడు. అతడు ఏనాడూ ఎవ్వరినీ ప్రేమించలేదు. ప్రేమవల్ల కలిగే ఆర్ద్రభావాలతో అతనికి పరిచయంలేదు. తనలో తనకు నమ్మకంలేని ఆ వ్యక్తి ఏ ఒక్కరినీ నమ్మలేదు. మందియ్యటం కొంచెం ఆలస్యమయితే "నాకు తెలుసు. మీరంతా నన్ను చంపాలని చూస్తున్నారు" అని వీధిన పడేవాడు. రోగంలో ఉన్నాడుకదా అని పళ్ళు తెప్పించి ఇస్తే "మీరంతా ఏం తిన్నారు? మీరు మంచి మంచి స్వీట్స్ చేసుకు తింటూ నా ముఖాన్న ఈ పళ్ళు పడేస్తున్నారా?" అని కస్సుగా అడిగేవాడు.

లలిత బాధపడుతోనే శాంతంగా చేస్తోన్నా, పెళ్ళయిన నాటినుండీ

భర్త చేతిలో తిరస్కారాలూ అవమానాలూ తప్ప ఆదరణను నోచుకోని జానకమ్మను మాత్రం మండిపోయింది.

"లలితా! చేసిన పాపాలకు శిక్ష అంటూ ఉండద్దా? ఎందుకాయనకు మనం ఇన్ని సేవలు చేయాలి?" అనేది అక్కసుగా... ఈ దశలో సహితం ప్రేమానురాగాలు చూపించలేక అనుమానాలతో కుళ్ళిపోతూ తన స్వార్థమే తను ఆలోచించుకునే వెంకట్రావును క్షమించలేకపోతోంది జానకమ్మ.

తల్లి మనసు అర్థం చేసుకోగలదు లలిత. నచ్చజెప్తున్నట్లు అంది.

"ఇప్పుడాయన అనుభవిస్తున్నది శిక్ష కాదంటావా అమ్మా! అలాంటి మనసు... ఒక్క క్షణమయినా శాంతికీ స్థిమితానికీ నోచుకోక తనను తాను దహించుకునే మనసు... అలాంటి మనసుకంటె పెద్ద శిక్ష ఎవరికి కావాలి?"

"ఏమో! ఇంత చేస్తున్నాం! ఏమైనా ఫలితముందా? ఇంకా ఏదో తనకు అన్యాయం జరుగుతోందనే ఆక్రోశమే కదా! ఇలాంటి వ్యక్తికి ఏంచేసినా బూడిదలో పన్నీరే!"

"మనం చేసినదానికి బదులుగా వాళ్ళు మనకేదో చెయ్యాలని ఆశించి ఏదీ చెయ్యకూడదమ్మా! ఒక పని చెయ్యటంవల్ల మనకానంద ముంటేనే ఆ పని చెయ్యాలి. పోనీ, ఏంచేద్దామో నువ్వే చెప్పు. నాన్నని వీధుల్లోకి వెళ్ళగొడదామా! చిన్నప్పటినుండీ చేసిన అన్యాయాలకు ఫలితంగా కుక్క బ్రతుకు బ్రతకమందామా? అలా చేస్తే నీకు హాయిగా ఉంటుందా?". జానకమ్మ సమాధానం చెప్పలేకపోయింది.

"కొంపదీసి నువ్వు కూడా నాన్నలాగ నువ్వుచేసిన పనులకు ఫలితంగా స్వర్గంలో రంభ, మేనక...కాదు! కాదు! నలకూబరుడు... మన్మథుడు... ఇత్యాది ఆశిస్తున్నావేమిటి?"

పకాలున నవ్వేసింది జానకమ్మ.

"పోవే! గంభీరంగా ఉంటూనే, కొంటెగా మాట్లాడగలవు!"

తల్లి ముఖంలో నవ్వుచూసి చాలా తృప్తిపడింది లలిత.

"మంచి మనసు కలిగి ఉండటంకంటె గొప్ప వరం ఏముందమ్మా! మన మనసులూ మహా మంచివేంకావు. కానీ కనీసం మంచిగా ఉండటానికి తాపత్రయపడుతున్నాయి. నాన్న విషయంలో మన కర్తవ్యం మనం చేసామన్న తృప్తిచాలదా మనకు?"

జానకమ్మ ప్రేమగా లలిత చెక్కిళ్ళు నిమిరింది.

"నీ అమ్మ కడుపు చల్లగా నూరేళ్ళు బ్రతికి నాదగ్గిర ఎప్పుడు ఇలాంటి బంగారు మాటలే మాట్లాడు. అవునమ్మా! బ్రతక్క ఎలాగు

తప్పదు. బ్రతికిన నాలుగు రోజులూ హాయిగా బ్రతికేస్తే పోలా?''

మోహన్‌కి ఉద్యోగం దొరకలేదు. మరెవరిదగ్గిరకో వెళితే పనవుతుందని ఎవరో చెప్పారు. ఆ మాట లలితతో చెపితే మండిపడింది.

''నేను ఎవరిదగ్గిరకు వెళ్ళను. నువ్వూ వెళ్ళకు. ఇలా ఎవరిమటుకు వాళ్ళం నలుగురితోపాటు అనుకుంటూ అక్రమాలు ప్రోత్సహిస్తున్నాం.''

మోహన్‌కు మండి పోయింది.

''నీ శ్రీరంగ నీతులు వినటానికి బాగానే ఉన్నాయి, కానీ నాకు ఉద్యోగం తెచ్చి పెట్టవు. ఏం చెయ్యాలి?''

''నువ్వొక్కడివేనా? ఇంకా నీలా మగ్గిపోతున్న వాళ్ళు లేరూ? మీరంతా కలిసి మీ హక్కులకోసం పోరాడండి!''

లలిత మాటలు మొదట హాస్యంగా కనిపించినా చివరకు అదే మేలనిపించింది మోహన్‌కి. నిరుద్యోగులంతా ఒక సంఘంలా సమావేశమయ్యారు. ఏ రోజు ఎక్కడెక్కడ ఎందరెందరు ఏయే విధాల అన్యాయంగా ఉద్యోగాలు సంపాదించారో బహిరంగపరిచి విద్యావంతులలో ఆందోళన లేవదియ్యసాగారు. కానీ ఇది ఎక్కువ రోజులు సాగలేదు. సంఘంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తోన్న నేరం క్రింద మోహన్‌తో పాటు మరికొందరిని అరెస్ట్ చేసారు.

ఆ వార్త విని జానకమ్మ తల్లడిల్లిపోయింది. లలితకు మతిపోయినట్లయింది. మోహన్‌ని రెచ్చగొట్టింది తనే! ఒక రకంగా తనే ఇందుకు బాధ్యురాలి ననుకొని చాలా బాధపడింది.

ఈ సమయంలో ఆఫీసులో లలితతో పనిచేసే ఒక స్నేహితురాలు ''అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మాధవరావుగారు చాలా మంచివారు. ఆయనను ఒకసారి కలుసుకోరాదు!'' అంది.

అన్యాయంగా అరెస్టయిన తమ్ముణ్ని విడిపించవలసిన బాధ్యత అక్కగానేగాక నైతికంగా కూడా తనమీద ఉందనుకుంది లలిత. సాహసించి మాధవరావుగారి దగ్గిరకు వెళ్ళింది.

మాధవరావు మరీ పెద్దవాడు కాకపోయినా చిన్నవాడు కూడా కాడు. అందమైనవాడని చెప్పడానికి లేదు కాని అతని ముఖంలో గాంభీర్యం అదొక విధంగా ఆకర్షణీయంగా ఉంది.

''కూర్చోండి! ఎందుకొచ్చారు?'' అన్నాడు మర్యాదగా.

''మా తమ్ముడు మోహన్‌ని అరెస్ట్ చేసారు. వాడు...'' లలిత ఏదో చెప్పబోతుండగానే చెయ్యెత్తి అడ్డుకున్నాడు మాధవరావు.

''ఇలాంటి పనులమీద ఎప్పుడు నా దగ్గిరకి రాకండి. ఒకసారి అరెస్టయ్యాక కోర్టులో విచారణ జరగవలసిందే! నేను కల్పించుకుని విడు

దల చెయ్యను."

మాధవరావు ధోరణిలో ఒక "కమేండ్" ఉంది. లలితకు గొంతు పొడారి పోసాగింది.

"కానీ మా తమ్ముడు అన్యాయంగా..."

ఈసారికూడా లలిత మాటలను పూర్తిచెయ్య నియ్యలేదు మాధవరావు.

"అరెస్ట్ చేసినది న్యాయంగానో, అన్యాయంగానో విచారణలో తేలుతుంది. అందరూ అన్యాయమే చెయ్యరు. ఒక వేళ అన్యాయం ఉందనుకున్నా దానిని ఎదుర్కోవాలి 'కాని మనమూ అన్యాయంలోకి జారి పోకూడదు."

లలిత మాట్లాడలేకపోయింది.

"ఇంక మీరు వెళ్ళిరండి" అన్నాడు మాధవరావు. క్షణమాత్రం అతని కళ్ళలో జాలి మెరుపులా మెరిసి మాయమయింది.

లలిత వచ్చిన పని కాలేదు. కానీ ఆమె కృంగిపోలేదు. బాపినీడు దగ్గర భంగపడి వచ్చింది. ఆనాడు మనసంతా చీదరగా చికాకుగా అయిపోయింది. ఈనాడు మాధవరావూ కాదన్నాడు. కానీ, ఈ కాదనటం కూడా ఏదో ధైర్యం చెప్పినట్లుగానే ఉంది. 'అంతటా అన్యాయమే జరగదు' అన్నాడు మాధవరావు. నిజమేనా? నిజమేనని రుజువు చేసాడు జస్టిస్ రెడ్డి.

"మోహన్ మొదలైనవాళ్ళు చేస్తున్న పనులలో సాంఘిక శాంతి భద్రతలకు భంగం కలిగించేవేం లేవు. వాళ్లు సంఘంలో అన్యాయాలు బయట పెడుతున్నారు. అదికూడా ఒక రకంగా సంఘసేవ! స్వతంత్రంగా ఆలోచించే హక్కు ఈ దేశంలో ప్రతి పౌరుడికీ ఉంది" అని జడ్జిమెంట్ ఇచ్చాడు.

మోహన్ విడుదలయ్యాడు. కానీ అతని పరిస్థితి మరింత సంకటంగా తయారయింది. అందరు అతణ్ని దొంగలాగో, హంతకుడిలాగో చూడటం మొదలు పెట్టారు. ఇదివరకు కనీసం ఇంటర్వ్యూకయినా పిలిచేవారు. ఇప్పుడదీ మానుకున్నారు. సహజంగా కొంచెం దుడుకు వాడయిన మోహన్ ఈ పరిస్థితికి తట్టుకోలేకపోయాడు. ఒక రోజున ఇంట్లోంచి మాయమయ్యాడు. ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెలియలేదు. పోలీస్ రిపోర్టు ఇవ్వటానికి భయపడింది లలిత. ఏమో! మళ్ళీ ఎక్కడ చిక్కుకున్నాడో?

జానకమ్మ ఈ దెబ్బకు తట్టుకోలేకపోయింది. మంచ మెక్కేసింది.

"లలితా! నువ్వు చెప్పవే! నిజంగా దేవుడున్నాడా? ఈ సృష్టిలో

కొంచెమైనా న్యాయముందా? నాకెందు కిన్ని పరీక్షలు? నా పిల్లల్ని పెంచుకోవాలనీ, వాళ్ళను పైకి తీసుకరావాలనీ, అష్టకష్టాలూ అనుభవించాను. నువ్విలా అయిపోయావు. వాడలా అయిపోయాడు. ఏం చూసుకొని బతకమంటావే!" అంది ఏడుస్తూ.

"నా కేమయిందమ్మా?"

"ఏమయిందా? లక్షణంగా రాజుని పెళ్ళిచేసుకుని కళకళలాడుతూ ఉండవలసినదానివి ఇలా ఏడవలేక నవ్వుతూ తిరుగుతున్నావు. నీ కసలు బుధ్ధిలేదే! రాజుని ఐ.ఎ.ఎస్. కి కట్టమనకుండా ఉండవలసింది. పోనీ పెళ్ళయ్యాక కట్టమన వలసింది!"

లలిత లోలోపల నవ్వుకుంది.

పాపం అమ్మ! పెళ్ళయిపోతే తరువాత ఏం జరిగినా పరవాలేదనుకుంటోంది! తాను అంత అనుభవించినా సంప్రదాయపు వాసనలు వదలవు.

"ఇంటిల్లిపాదికీ రోగాలే! నాకు వేళకి కాస్త పళ్ళరసం ఇచ్చే దిక్కు కూడా లేదు." అని గొణుక్కున్నాడు వెంకట్రావు, మంచాన పడ్డ భార్యను చూసి.

లలిత అటు తండ్రికీ, తల్లికీ వైద్య సదుపాయాలు చూసుకోవాలి! ఇల్లు నిర్వహించుకోవాలి! ఉద్యోగం చెయ్యాలి.

బస్ కోసం ఎదురుచూస్తూ అరగంటనుండీ బస్ స్టాప్ లో నిలుచునుంది లలిత. కాళ్ళు లాగుతున్నాయి. విసుగొస్తోంది. రోడ్డుమీద పోతున్న కారుని చూసి "నాకు లిఫ్ట్ ఇయ్యకూడదూ?" అనుకుంది. అలా చాలాసార్లు అనుకునేది. కానీ ఒక్కసారీ ఏ కారు ఆగలేదు. ఈసారి విచిత్రంగా ఆకారు ఆగిపోయింది. అంతేకాదు, కారులోంచి ఎవరో తనను చెయ్యి ఊపి పిలుస్తున్నారు. లలిత తెల్లబోయింది. తనను కాదేమో ననుకుని చుట్టూ చూసింది మరెవరైనా కదులుతున్నారేమోనని. అంతలో కారులో వ్యక్తి తల బయటపెట్టి చిరునవ్వుతో "మిమ్మల్నే! రండి!" అంది.

లలిత గుర్తు పట్టింది. మిసెస్ మణిమాల! కళామందిర్ లో లలిత సంగీత కచేరీ చేసింది. అక్కడ ఆవిడతో పరిచయమయింది. ఆనాటి ఆవిడ ధోరణినిబట్టి ఆవిడకు చాలా గర్వమని అభిప్రాయపడింది. అలాంటిది ప్రత్యేకంగా కారాపి పిలుస్తోన్నదంటే...లలిత దగ్గరగా వెళ్ళింది.

"రండి! కూర్చోండి! మీ ఇంటిదగ్గర డ్రాప్ చేయిస్తాను." అంది మణిమాల తలుపు తెరిచి.

లలిత మొహమాట పడుతూ "మీ కెందుకు శ్రమ" అని నాన్చింది.

"శ్రమేముంది? నేను నడపాలా కారుని? డ్రైవర్ ఉన్నాడుగా! రండి." లలిత వచ్చి కూచుంది.

"ముందు మా ఇంటికి వెళ్దాం! కొంచెం కాఫీ తీసుకున్నాక డ్రైవర్ని మీ ఇంటిదగ్గిర దింపి రమ్మంటాను." అంది మణిమాల.

కాదనలేక పోయింది లలిత.

మణిమాల ఇల్లు కూడా మణిమాలలాగే ఆధునికంగా ఆడంబరంగా ఉంది. లలితను కూర్చోమని ఫలహారం, కాఫీ వంటమనిషి చేత ఇప్పించింది మణిమాల. ఇల్లంతా చూపించింది. మణిమాల గదిలో వీణని చూసి లలిత "మీరుకూడా వీణ నేర్చుకున్నారా!" అంది.

మణిమాల నవ్వుతూ "ఆ! పెళ్ళిచూపుల్లో "వీణవచ్చు" అని చెప్పటానికి తగినంత పాండిత్యం సంపాదించాను. నేను వాయించలేకపోయినా వినటం ఇష్టం. మీకు అభ్యంతరం లేకపోతే మరొకసారి తీరిగ్గా వచ్చి మా ఇంట్లో వీణ వాయించగలరా?" అంది.

"అలాగే!" అంది లలిత.

మణిమాల లలితకు బొట్టుపెట్టి లలిత వద్దంటున్నా తాంబూలంతో పాటు డజను అరటిపళ్లు చేతిలో పెట్టి తమ కారులో ఇంటికి పంపించింది

4

రాజును మరచిపోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది లలిత. ఎంత ప్రయత్నించినా కారు చీకటిలా తనను క్రమ్ముకునే ఒక నైరాశ్యభావం నుండి బయటపడలేకపోతోంది. అన్నింటిపట్లా ఏదో విరక్తిభావమే కలుగుతోంది. "నా బ్రతుకంతా రాజు మాత్రమేనా? రాజు తిరస్కరించినంతమాత్రాన ఇక నా కేమీ మిగలనట్లు ఇలా అయిపోవటమేమిటి?" అని ఎంతగా తనకు తను నచ్చజెప్పుకున్నా అప్పటికప్పుడు ఈ లోకంతోనే నిమిత్తంలేనట్లు మనసు కృంగిపోక మానటంలేదు.

"నీకు ఫోన్ వచ్చింది." అని చెప్పింది ఎదురింటి వారమ్మాయి.

ఆ ఫోన్ నెంబరు రాజుకు మాత్రమే తెలుసు. ఎదురింటి వారికి ఇబ్బంది కలిగించటం ఇష్టంలేక, వాళ్ళేమైనా అనుకోవచ్చుననీ ఆ నంబర్ తన స్నేహితుల కెవరికీ ఇయ్యలేదు. రాజుతో కూడా ఏదైనా అత్యవసరమయినప్పుడే ఫోన్ చెయ్యమని చెప్పింది.

తనకు ఫోన్ వచ్చిందనగానే లలిత మనసులో నైరాశ్యం మంత్రించినట్లు మాయమయింది రాజు తనకోసం ఫోన్ చేశాడు. బహుశః తనలాగే రాజుకూడా బాధపడుతూ ఉండిఉంటాడు. ఒక్క క్షణం ఆ నాడు రాగిణితో కలిసి తనను చూసి నవ్విన రాజుమూర్తి గుర్తుకొచ్చి మనసు కలుక్కుమంది. అతిప్రయత్నంమీద ఆ ఆలోచనను వెనక్కినెట్టింది. ఇలాంటి బలహీనతలు మొగవాళ్ళలో సహజమేనేమో! రాజును తను క్షమించగలదు. కాదు! క్షమించకుండా ఉండలేదు. అతనికోసం కాదు. తనకోసం!

రాజు తనకోసం ఫోన్ చేశాడని వినగానే. అతనిని క్షమించాలని నిర్ణయించుకోగానే మళ్ళీ రాజుకు తనకూ మధ్య అనుబంధం ఎప్పటిలా కొనసాగుతుందని అనుకోగానే గుండెలమీద సీసంలా పేరుకున్న బరువేదో తొలగిపోయినట్లయింది. మనసేవో మధురనాదాలను ఆలపించింది. ఏదో సంతృప్తితో సంతోషంతో గాలిలో తేలిపోతున్నట్లు నడుస్తూ ఫోన్ దగ్గరకు వెళ్ళింది. ఫోన్ అందుకున్న చెయ్యి వణికింది. తనను తను అదుపులోకి తెచ్చుకుంటూ "హలో!" అంది ఆప్యాయంగా.

అవతలి వైపునుండి "హలో!" అని వినిపించింది. అది రాజుకంఠం కాదు. ఎవరో స్త్రీకంఠ స్వరం.

"లలితను మాట్లాడుతున్నాను. ఎవరు?"

"నేను లలితా! గుర్తుపట్టలేదా? రాగిణిని." కిలారుమని నవ్వు...

నెత్తిమీద ఎవరో తట్టలతో మంచు గుమ్మరించినట్లు ఒక విధమైన జడత్వం ఆవహించింది లలితని...

"లలితా! చూసావా, నువ్వు మరిచిపోయినా, నేను మరిచిపోలేదు. కొందరు స్నేహితులు కాస్త పైకి రాగానే పాత స్నేహితుల్ని మరిచిపోతారు. నేనలా కాదు. నేనెంత పైకొచ్చినా నిన్నూ నీ స్నేహాన్నీ మరిచిపోలేదు. ఒకనాటి నీ సహాయం, నీ ఆదరణ జన్మలో ఎన్నడు మరిచిపోలేను..."

విదిలించుకోవాలి! కప్పలా మీదపడుతున్న మంచు కొండలనుండి బయటపడాలి! ఓడిపోకూడదు. నిలబడాలి. "థాంక్స్!" కంఠాన్ని అదుపులోపెట్టుకుంటూ దానిలో నవ్వు పలికిస్తూ అంది లలిత.

మళ్ళీ కిలారుమంది రాగిణి. చక్కగా తీయగా నవ్వగలదు రాగిణి. ఆ నవ్వు కృత్రిమత్వం వినిపిస్తోందా? ఏమో! వినిపించినా ఎంత మంది వినగలరు? చాలామంది ఆ తీయదనానికే ముగ్ధులవుతారు.

"లలితా! మీరంతా ఒక జాతివాళ్ళు. మీవన్నీ 'పవిత్ర ప్రేమ'లు! పాపం! రాజుకోసం నువ్వెంత బాధపడుతున్నావో, ఎంత తపించిపోతున్నావో, నేను అనుభవించకపోయినా నీ ముఖంచూసి ఊహించగలిగాను. అక్కడికీ రాజుతో చెప్పాను. "లలితను దూరం చేసుకోవద్దు." అని. ఆముదం తాగిన వాడిలా ముఖంపెట్టాడు! ఈ మొగాళ్ళంతేలే! ఎక్కడిమాట లక్కడ! నా దగ్గర నా ముందు అంతకంటె ఇంకేమంటాడు? కానీ లలితా! అతనికి నీమీద ప్రేమ లేకపోలేదు. నీ కెందుకు? నేను చెప్పి వొప్పిస్తాగా! నువ్వురా! రేపురా! నిన్నూ రాజును సినిమాకు పంపించే బాధ్యత నాది!..."

జుగుప్సతో వణికిపోతోంది లలిత. ఎలా మాట్లాడుతోంది రాగిణి!

ఒకవేళ రాగిణి నిజంగానే తనపట్ల స్నేహభావం కనపరచాలని అనుకుంటుందేమో! రాగిణికి తెలిసినంతలో ఆభావాన్ని వ్యక్తపరచగలిగిన భాష ఇంతమాత్రమే నేమో! ఒక జాతికంతా ఒకభాష ఉండటం మాత్రమే కాదు. ప్రతి ఒక్కరికీ ఒక్క భాష ఉంటుంది. దాని పరిధిలోనే తమ మనసు బయటపెట్టుకోగలరు.

లలిత నవ్వింది. శాంతంగా స్థిమితంగా నవ్వింది. హమ్మయ్య! మంచు కరిగిపోతోంది. చైతన్యం వస్తోంది.

"చాలా థాంక్స్ రాగిణీ! కానీ, నువ్వు నా కోసం ఏమీ శ్రమ పడకు! నే నెక్కడికీ రాను. నా కేమి అక్కర్లేదు!"

"అదేంమాట లలితా? నీకు రాజుమీద ప్రేమపోయిందా?"

లలిత నిజమే చెప్పదలచుకొంది. "ఇప్పటివరకు పోలేదు."

"భలే దానివి. అంటే ముందు ముందు పోతుందా?"

"నేనేం చెప్పగలను? జీవితం మన ముందుఉంది. మన ఇష్టానిష్టాలతో నిమిత్తంలేకుండా రకరకాల అనుభవాలు ఎదురౌతాయి. ఆ అనుభవాలు పాఠాలు నేర్పుతాయి. ఆ పాఠాలనుండి శక్త్యానుసారం జీవితాన్ని అర్థంచేసుకుంటాం. ఏమో! ఏం జరుగుతుందో?"

ఈసారి రాగిణి నవ్వలేదు. కంఠంలో కూడా ఏదో మార్పువచ్చింది.

"రాజుతోకలిసి సినిమాకు వెళ్లటం నీకిష్టం లేదా?"

"ఇష్టమయిన పనులన్నీ అన్నివేళలా చెయ్యలేం. అంతకంటే ప్రధానమయినదేదో అడ్డుపడుతుంది."

"ఏమిటి, ఆ ప్రధానమయినది?"

"మానవత్వమంటే—— కళ్ళు, ముక్కు, నోరు, ఒడ్డుపొడుగు కాక మరేదైనా ఉందనుకుంటే... అదేదో తెలుసుకో గలిగితే... అదే ప్రధానమైనది!"

రాగిణి టక్కున ఫోన్ పెట్టేసింది.

ఈ మనసు! శరీరాన్ని చంపినంత తేలికకాదు మనసును చంపటం! ఎన్నివిధాల ఎలాంటి విషప్రయోగాలు చేసినా, ఏ వైపునుండి ఏ కొద్ది పాటి మానవత్వపు వాసన సోకినా మేలుకుని కూర్చుంటుంది. ఊపిరి పోసుకుంటూ ప్రాణిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. పాపం! రాగిణి!

శ్రమపడటం కష్టమే! కానీ శ్రమించినకొద్దీ శరీరం మరింత దృఢమవుతుంది. మనసూ అంతే! కొన్ని కొన్ని భావనలు తాత్కాలికంగా మనసును బాధించి మెలిపెట్టినా రానురాను ఆ బాధే మనోబలాన్ని పెంపొందిస్తుంది.

రాజు రాగిణికి తన ఫోన్ నంబర్ ఇచ్చాడు. రాగిణి తనతో ఏం

మాట్లాడుతుందో ఊహించలేడా? అయినా రాగిణి అడగగానే నంబర్ ఇయ్య గలిగాడా?

రాగిణి మాటలకంటే ఈభావనే ఎక్కువగా బాధపెట్టింది లలితని. ఈ భావనలో పదేపదే మనసు నలిగి పడుసెక్కటంవల్లనేనేమో... రాజు తన ఇంటికి వచ్చినపుడు మామూలుగా ఆహ్వానించగలిగింది.

"నీ డబ్బు నీ కియ్యాలని ఎప్పటినుండో అనుకుంటున్నాను. కుదరటంలేదు. ఇవాళ తీసుకొచ్చాను."

తన జేబులోంచి అయిదువందలు తీసి బల్లమీద పెట్టాడు రాజు.

ఒక్కసారి నోట్లవంక చూసింది లలిత. వద్దనుకున్నా వాటివెనుక ఉన్న కథ గుర్తుకొచ్చింది.

రాజు కూడా లలితలాంటి మధ్య తరగతి మనిషే! అందుకే చదువు కునే రోజుల్లోనే వాళ్ళిద్దరూ ప్రేమించుకోవటానికి పెళ్ళిచేసుకోవాలని అనుకోవటానికి కాని ఎలాంటి ఆటంకాలూ రాలేదు. బి. ఏ. పాసయి లలితలాగే యు. డి. సి. గా చేరిన రాజును ఐ. ఎ. ఎస్. కి కట్టమని లలిత ప్రోత్సహించింది.

"మనబోటి వాళ్ళకు వస్తాయా అలాంటి ఛాన్స్లు?" నిరాశగా అన్నాడు రాజు.

"ప్రయత్నించు. తప్పేముంది?" అంది లలిత.

రాజు ఐ. ఎ. ఎస్. పరీక్షకి కట్టాడు. పరీక్షలముందు కనీసం రెండు నెలలైనా ఉద్యోగానికి సెలవుపెట్టి ట్యుటోరియల్ కాలేజిలో చేరి చదవాలనుకున్నాడు. జీతం నష్టంమీద కాని సెలవు దొరకదు. కుటుంబ పరిస్థితులు రెండు నెలలు జీతం లేకుండా గడిచేలా లేవు.

మెడలోకి సన్నని గొలుసు చేయించుకోవాలని అతి కష్టంమీద లలిత పోగుచేసుకుంది అయిదువందలు. ఆ డబ్బు అతనిచేతిలో పెట్టింది.

"నా దగ్గరున్నదీ ఇంతే! ఎలాగో సర్దుకో! సెలవుపెట్టెయ్యి. చదువు అశ్రద్ధ చెయ్యకు!" అంది.

కృతజ్ఞతలో కరిగిపోయాడు రాజు. లలిత చేతులు రెండూ తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"లలితా! ఎలా తీర్చుకోగలను నీ ఋణం?"

"ఋణమా? తీర్చుకుంటావా?"

మూతి బిగించింది, లలిత.

ముడుచుకున్న లలిత మూతిమీద చిన్నగా చూపుడువేలితో కొట్టి "సారీ! నేను ఐ. ఎ. ఎస్. ఆఫీసర్నయితే అదంతా నీదేగా!" అన్నాడు.

లలిత కెలాగో అనిపించింది.

"రాజూ! అలాంటి ఆశతో ఈ డబ్బు నీ కియ్యటంలేదు. మనమధ్య ఋణాలేమిటని అన్నాను."

"పోవోయ్! నిన్ను ఆఫీసర్ భార్యని చెయ్యటానికైనా సెలెక్టయి తీరుతాను!"

నవ్వుతూ అన్నాడు రాజు. రాజు చాలా తెలివైనవాడు. లలిత ప్రోత్సహించింది అందుకే. రిజల్ట్సు వచ్చి సెలెక్టయినట్లు తెలిసిన రోజున రాజు మొట్టమొదట లలిత దగ్గరకే వచ్చాడు.

"ఈ డిగ్రీ నాదికాదు లలితా! నీది!" అన్నాడు అనురాగంతో.

"నీ డిగ్రీ ఎవడికాక్కావాలి? నువ్వే నా వాడివి!" అంది లలిత సంతోషంతో. ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా ముందుకు వంగి బల్లమీద రాజు పెట్టిన నోట్లని అందుకుంది లలిత.

రాజు ఆశ్చర్యపోయాడు. అతని ముఖంలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది. ఈ సంఘటన ఇంత సామాన్యంగా జరుగుతుందని అతననుకోలేదు. లలిత వెయ్యబోయే నిష్ఠూరాలు ఎదుర్కోవటానికి ఎంతో సిదపడి వచ్చాడు. అలాంటిది... ఉండబట్టలేక అనేసాడు. "నువ్వీ డబ్బు తీసుకోవనుకున్నాను..."

లలిత ఆశ్చర్యం నటించింది.

"అదేం? ఎందుకు తీసుకోననుకున్నావ్? నేనిచ్చింది అయిదువందలు. నువ్వు తెచ్చింది అయిదువందలు. లెక్క సరిపోయిందిగా!"

"లెక్క కాదు."

లెక్కల కందనిదేమిటో రాజు చెప్పలేకపోయాడు.

మాట్లాడకుండా కూర్చున్న లలితముందు రాజు మనసు మరింత ముడుచుకుపోసాగింది. ఏదో ఒకటి మాట్లాడకుండా ఉండలేకపోయాడు.

"నేను రాగిణిని..."

ఏదో చెప్పబోతున్న రాజును చెయ్యెత్తి వారించింది లలిత.

"నేను సంజాయిషీలు అడగటంలేదు రాజూ! నువ్వు నాకేమీ చెప్పక్కర్లేదు."

"రాగిణిని నువ్వర్థం చేసుకోవటంలేదు. తను చాలా మంచిది."

"కావచ్చు!"

"తనకి నువ్వంటే చాలా యిష్టం?"

"అలాగా?!"

"ఒక్కసారి నీతో ఎలాగైనా మాట్లాడాలని తపించిపోయింది. నీ ఫోన్ నంబర్ ఇచ్చి మాట్లాడమన్నాను."

"మాట్లాడింది!"

"నీ బుద్ధి చూపించుకున్నావు. రాగిణిని అవమానించి నీ కసి తీర్చుకున్నావు!"

"రాగిణిని అవమానించానా?"

"పాపం, నా దగ్గిర ఎంత ఏడ్చిందో తెలుసా? జాలేసింది!"

"ఒకవేళ ఏడిస్తే ఆశ్చర్యపడక్కర్లేదు. రాగిణితో మాట్లాడాక నాకు రాగిణిమీద జాలి కలిగింది."

లలిత మాటలు తన ధోరణిలోనే అర్థం చేసుకున్నాడు రాజు. అతనికి లలితమీద చాలా కోపం వచ్చింది. "రాగిణిని అవమానించే అధికారం నీకేముంది? ఒకప్పుడు నువ్వు ప్రేమించినట్లే ఇప్పుడు రాగిణి కూడా నన్ను ప్రేమిస్తోంది. రాగిణికంటె నువ్వేవిధంగా అధికురాలివి?"

రాజు మాటలకు మ్రాన్పడిపోయింది లలిత. అంతలో పకాలున నవ్వింది.

"రాగిణికంటె నేను అధికురాలినని ఎవరు చెప్పారు రాజా! నీమీది ప్రేమకు సంబంధించినంతవరకు రాగిణికంటె నేనే అల్పురాలిని! ముమ్మాటికీ నిజం!"

ఆ అవమానం అర్థమయింది రాజుకి. రగులుతోన్న ముఖంతో విసురుగా వెళ్ళిపోయాడు.

తన చేతిలో నోట్లవంక చూసుకుంది లలిత. అవే నోట్లు! ఒకప్పుడు అవే! ఇప్పుడు అవే! ఆనాటి వాటి విలువ వేరు, ఈనాటి విలువ వేరు. విలువలు విషయాలమీద ఆధారపడి ఉండవు. సందర్భాలమీద ఆధారపడి ఉంటాయి.

5

మహిళా సమాజాలకుకాని, లేడీస్ క్లబ్బులకికాని వెళ్ళటం లలితకు అలవాటులేదు. ఒక విధంగా మణిమాల బలవంతం మీదే మహిళామండలి వార్షికోత్సవాలలో వీణ వాయించడానికి ఒప్పుకుంది లలిత. మణిమాల లలితను స్వయంగా తన కారులో వెంటబెట్టుకుని తీసుకొచ్చింది. అక్కడ సమావేశమయిన వారిలో చాలామంది ధనిక కుటుంబాలకు చెందిన స్త్రీలే! ఆ కారణంచేత కాలేజీ డిగ్రీల మాట ఎలా ఉన్నా, వారందరు నాగరికతలో ఒకరికొకరు తీసిపోరు. అందుకు నిదర్శనం ఏనోట విన్నా లేటెస్టు ఫేషన్స్ గురించి వినిపించటం! ఎవరిని చూసినా మరొకరి చీరల, నగల, విలువలను అంచనా వేస్తూ కనిపించటం! తమకంటె ప్రకాస్త ఎక్కువగా కనిపించినా ఈర్ష్యతో భగ్గుమనే అంతరంగాలను చిరునవ్వు ముసుగులతో కప్పుకుని, లోపల ఇమడలేక ఉక్కిరిబిక్కిరయ్యే ఈర్ష్యను లేనిపోని

నిందారోపణల కట్టుకథల రూపంతో ఆవిష్కరించటం! తాము ఎంత ధనవంతులో ఇతరులు గ్రహించేలా చెయ్యాలని తాపత్రయ పడటం! గొప్పవారిగా కనిపించినవారిని. ధనంలో గొప్పవారిని పోటీలు పడుతూ ఇచ్ఛకాలాడటం.

మహిళామండలి భవనముందు ఏదో కారు ఆగింది. ఎవరో అన్నారు "శ్యామలాంబగారు వచ్చారు"ని. ఆ మాటతో ఎక్కడ లేని సంచలనమూ కలిగింది సభలో. దేవతా దర్శనాని కన్నట్లు ఒకరి నొకరు తోసుకుంటూ కారుదగ్గరకి పరుగెట్టారు. కాని, కారులోంచి దిగిన ఆ శ్యామలాంబను సగౌరవంగా ఆహ్వానించే అదృష్టం మూడు పట్టుచీరలకు, రెండు షిఫాన్ చీరలకు మాత్రమే దక్కింది. మిగిలిన వారు కుళ్ళుగా మొహాలు ముడుచుకుని చవిటి చిరునవ్వులు చిలకరిస్తున్నారు.

"మణిమాలగారు రాలేదా?" అడిగింది శ్యామలాంబ.

అప్పుడు వెళ్ళింది మణిమాల సగర్వంగా శ్యామలాంబ దగ్గరకి. తీయని చిరునవ్వుతో "మీకోసమే ఎదురుచూస్తున్నాం! రండి!" అని చెయ్యిపట్టుకుని లోపలకు తీసుకొచ్చింది.

ఇంతమంది ఆదరానికి పాత్రురాలైన ఆ శ్యామలాంబను కుతూహలంగా చూసింది లలిత.

దగ్గర దగ్గర యాభై యేళ్ళ పైగానే ఉంటాయి. పెద్దగా కాదు కాని ఆధునికంగానే అలంకరించుకుంది. వయసులో రూపవంతురాలే అయి ఉండాలి! చిరునవ్వు గడుసుగా ఉంది. చూపులు తీక్ష్ణంగా ఉన్నాయి. కంఠస్వరం పరుషంగా లేదుగాని పదునుగా ఉంది.

'శ్యామలాంబ'. ఆ పేరు ఎక్కడో వింది. గుర్తొచ్చింది! రాగిణి, ఇంకా రాగిణిలాంటి వాళ్ళు మరికొందరు ఉండే సేవాసదనం నడిపే వ్యక్తి పేరు అదే! ఆ శ్యామలాంబ ఈ శ్యామలాంబ ఒకరేనా? ఛ! అయి ఉండదు! ఆ శ్యామలాంబ ఇందరి గౌరవాదరాలకు పాత్రురాలు కాగలదా?

మణిమాల శ్యామలాంబతో లలిత దగ్గర కొచ్చింది. "ఈవిడ మిస్ లలిత. మంచి వైణికురాలు!" అని పరిచయం చేసింది.

శ్యామలాంబ చూపులలో నిర్లక్ష్యం చిందిస్తూ చిరునవ్వులో సంస్కారం సూచిస్తూ తల ఊపులో ఆధిక్యం ప్రకటిస్తూ లలిత చేసిన నమస్కారం అందుకుంది.

మహిళా మండలి కార్యదర్శి అతి వినయంగా శ్యామలాంబ దగ్గర కొచ్చి "మా చేతిపనుల ప్రదర్శన చూడరూ?" అని ప్రార్థిస్తున్నట్లుగా మాట్లాడి తన బ్రతుకు ధన్యమవుతున్నట్లు అడుగులేస్తూ శ్యామలాంబను తన

వెంట తీసికెళ్ళింది.

అవకాశం దొరగ్గానే లలిత కుతూహలం అణచుకోలేక మణిమాలని "శ్యామలాంబగారంటే ఎవరు?" అని అడిగేసింది.

"అరె! శ్యామలాంబగారు తెలియదూ? చాలా ప్రముఖురాలు!"

"ప్రముఖురాలంటే ఎలా?"

"ఆవిడకు ఊళ్ళో గొప్ప గొప్ప వాళ్ళతో పరిచయాలున్నాయి. అధికారంలో ఉన్న వాళ్ళలో చాలామందిని తెలుసు. ఎవరికైనా ఏపని నైనా సాధించి పెట్టగలదు. మూడు మేడలూ, నాలుగు కారులూ."

"ఎలా సాధిస్తుంది ఆవిడ ఏపనినైనా?"

"అదా! ఆవిడ ఒక సేవాసదనం నడుపుతోంది. ఆ సేవాసదనంలో ఉండేది అనాథ స్త్రీలు కాదు. సీతకోక చిలుకలు! మన్మథ బాణాలు! వాళ్ళు సాధించి పెడతారు అన్ని పనులూ! ఇతరత్రా కూడా లావా దేవీలు ఉన్నాయనుకో."

లలిత శరీరం చల్లబడిపోయింది. ఆ శ్యామలాంబే, ఈ శ్యామలాంబ! అంతేకాదు! ఇక్కడ అందరికీ ఈ శ్యామలాంబ నడుపుతోన్న సేవాసదనం గురించి తెలుసు! అయినా అహ, కాదు, అందుకనే, ఆవిడనంతగా గౌరవిస్తున్నారు.

శ్యామలాంబ గౌరవార్థం టీపార్టీ ఏర్పాటుచేసారు. పార్టీ అయి పోగానే శ్యామలాంబ లేచి "నాకు పనుంది వెళ్తాను. క్షమించాలి!" అంది.

లలితను బలవంతపెట్టి తమ మహిళామండలి వార్షికోత్సవానికి వీణ వాయించడాని కాహ్వానించిన మణిమాల "రండి! నా కారులో డ్రాప్ చేస్తాను." అని శ్యామలాంబను వెంటపెట్టుకుని వెళ్ళిపోయింది. లలిత వీణ పూర్తిచేసిన అరగంటకి తిరిగొచ్చి "అయామ్ సారీ లలితా! నీ పాట వినలేకపోయాను. మరొక్కసారి ఇంటికి పిలిపించుకుంటాను." అంది నవ్వుతూ.

అంత దర్జాగా మణిమాల "నిన్ను ఇంటికి పిలిపించుకుంటాను." అన్నందుకు లలిత ఆశ్చర్యపోలేదు. అప్పటికే మణిమాల ఎవరో తెలుసు కుంది లలిత. ఆవిడ అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ మాధవరావుగారి భార్య!

తన చుట్టూ ఎందరు మూగినా శ్యామలాంబ ప్రత్యేకించి మణి మాలను అడగటంలో అర్థం లేకపోలేదు! మాధవరావు! ఏదో హుందా తనమూ, గాంభీర్యమూ ఉట్టి పడేనిండైన విగ్రహం! 'లోకంలో అంతటా అన్యాయమే ఉండదు!' అని అదలిస్తోనే అభయమిస్తున్నట్లు మాట్లాడగలి

గిన వ్యక్తి.

తన తమ్ముడు మోహన్ జాడ తెలుసుకోవటానికి సహాయపడగలడా? తన తమ్ముడు ఏ అన్యాయమూ చెయ్యలేదని అర్థంచేసుకో గలిగితే అత ణ్నొక దారికి తేవటానికి ప్రయత్నించగలడా?

మోహన్ విషయంలో తనదే తప్పేమోనని ఆరాటపడే లలిత మనసు మణిమాల ప్రదర్శించే కొద్దిపాటి అహంకారాన్ని అతి తేలిగ్గా సహించగలిగింది.

మహిళామండలి సభ్యులంతా కులాసా కబుర్లలో పడిపోయారు. రకరకాల 'నాగరిక' విషయాలు సంభాషణలలో దొర్లిపోతున్నాయి.

"విన్నారా? తిరుపతి వెంకటేశ్వరస్వామి రథం కిందపడి ఎందరో చచ్చిపోయారట!"

"ఏమైనా అంటే మహత్త్వమంటారు! ఇదంతా ఆ స్వామి మహ త్త్వమే కాబోలు!"

"పూజించే మూర్ఖులున్నంతవరకు అందరూ దేవుళ్ళే! ప్రతీదీ మహ త్త్వమే!"

"నో! నో! నా కిలాంటి మహత్త్యాలలో నమ్మకంలేదు!"

"నా కసలు దేవుడంటేనే నమ్మకంలేదు!"

"బైదిబై మళ్ళీ సుధామయి సీరియల్ వస్తోంది చూసావా?"

"చూసాను. చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది కదూ!"

"ఏమిటండీ, ఒరి పత్రికలు! బ్రిలియంట్‌గా ఉండవు. రచన లంటే రాధారాణివి. ఆవిడ నిజంగా జీనియస్. ఒరిజనాలిటీఉన్న రచన..."

"అవునవును. నాకు రాధారాణి రచనలంటేనే ఎడ్మిరేషన్. సుధా మయీ వగైరా, వగైరా అంతా కాలక్షేపం బఠాణీలు .."

"సినిమాస్టార్ తారాదేవి తన రెండో మొగుడికి విడాకు లిచ్చిం దట తెలుసా?"

"ఏమిటేవిటి? ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని .."

"ఆ ఇద్దరు పిల్లల్లో ఒకడు మొదటి మొగుడి కొడుకుట!"

"ఏ మొగుడి కొడుకయితే నేంతే! ఎవరి కొడుకులో ఎవరు చెప్ప గలరు?"

ఆ అత్యద్భుతమయిన జోక్‌కి అందరూ పరమానందంగా పొంగి పొంగి నవ్వారు.

లలిత లేచి "నేను వెళ్తాను" అంది.

శ్యామలాంబను కారులో దింపటానికి పోటీలుపడ్డ ఆ మహిళా

మణుల్లో ఏ ఒక్కరూ లలితను దింపటానికి ముందుకు రాలేదు. కార్యదర్శి "కూచోండి! టాక్సీని పిలిపిస్తాను" అంది కొద్దిపాటి విసుగుతో.

మణిమాల కెందుకో లలితమీద ఆదరం కలిగింది

"నేను డ్రాప్ చేస్తాను. రండి!" అని లలితను తన కారులో ఎక్కించుకుంది. ఆ కారులో ఇంకా మణిమాల స్నేహితు లిద్దరు కూడా ఉన్నారు.

కారు కదలగానే లలితను పూర్తిగా మరిచిపోయి వాళ్ళు కబుర్లలో పడిపోయారు.

"ఏంయ్ మణీ! ఏమిటోయ్! తిరుపతి వెంకన్నంటే నమ్మకం లేదనే సావ్? నిజంగా నమ్మకం పోయిందా?"

మణిమాల నవ్వింది మణిమాలనవ్వు అందంగానే ఉంటుంది కానీ అందులో ఏదో నిర్లక్ష్యపుధోరణి.

"అదేం కాదు కానీ..."

"మరి, అలా వాదించావ్."

"ఏం చెయ్యను? ఈ రోజుల్లో దేవుడంటే నమ్మకం లేదనటమే కల్చర్! నాకు భక్తంటే నవ్వుతారు! ఏం చెయ్యను? నమ్మకం లేదనే సాను!"

లలిత ఆశ్చర్యంగా విని "ఇంతకూ మీకు నమ్మకంఉందా? లేదా?" అని అడిగేసింది.

మణిమాల మళ్ళీ ఎప్పటిలాగే నవ్వింది.

"ఏమో పోనీలే! ఎందుకయినా మంచిది, తిరుపతికి ఒక ట్రిప్ కొట్టివస్తే సరిపోతుంది."

"నేను వస్తాను. ట్రెయిన్ లో వెళ్దాం!" అంది స్నేహితురాలు.

"ఓ. కె. స్పెషల్ అర్చనలో ఏవో ఉంటాయిగా! అవేవో చేయిస్తే త్వరగా బయటపడతాం! చకచక దర్శనం ముగించుకుని అక్కడ్నుంచి మద్రాస్ కెళ్ళి సరదాగా వారంరోజులు గడిపివద్దాం!"

ఆ సంభాషణంతా వింటూ భ్రమ పడిపోయి కూచుంది లలిత.

తన స్నేహితులను వారివారి ఇళ్ళదగ్గరదింపాక "మిస్. లలితా! డాక్టర్ వినోద్ ని ఒకసారి కలుసుకోవాలి! ఆ తరువాత మీ ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను. అభ్యంతరం లేదుగా!" అంది మణిమాల.

త్వరగా ఇంటికి వెళ్ళాలనిఉన్నా, ఆ మాట అనలేకపోయింది లలిత. డాక్టర్ వినోద్ పేరుపొందిన సర్జన్. సర్జన్ తో మణిమాలకేం అవసరమో!

మణిమాల కారు వినోద్ భవనంముందు ఆగింది. మూడంతస్థుల మేడ.

మణిమాల కారు హారన్ వింటూనే లోపలినుండి ఒక యువకుడు గబగబ కారు దగ్గరకువచ్చాడు. మణిమాల సంభ్రమంగా "వినోద్!" అని పలుకరించడాన్నిబట్టి అతడే డాక్టర్ వినోద్ అనుకుంది లలిత. వినోద్ మణిమాలను చెయ్యిపట్టుకుని లోపలకు తీసికెళ్ళాడు. వాళ్ళిద్దరూ లలిత అక్కడ ఉన్నట్లు ఏమాత్రం లక్ష్య పెట్టకుండా మాట్లాడుకోసాగారు.

వాళ్ళ నవ్వులూ, వేళాకోళాలూ, వెక్కిరింతలూ, లలిత భరించలేక పోయింది. మణిమాల గారాబంపోవటమూ, వినోద్ మణిమాల భుజంమీద చెయ్యివేసి బుజ్జగిస్తున్నట్లు బ్రతిమాలటమూ, చాలా ఎబ్బెట్టుగా తోచింది. మణిమాలనీ, మణిమాల కారును వదిలి పారిపోవాలనిపించింది. ఏంచెయ్య లేక కూలబడింది. దగ్గరదగ్గర ఒకగంట గడిచిన తరువాత వదలలేక వదల లేక వినోద్‌ను వదిలి బయలుదేరింది మణిమాల.

ఆ రోజు మహిళామండలిలో అడుగుపెట్టిన దగ్గరనుండీ ఏదో అద్భుతలోకంలో ఉన్నట్లేఉంది లలితకి. ఏమిటీలోకం? ఇక్కడున్నదంతా నిజంగా ఆనందమేనా? లలితను ఇంటి దగ్గర దింపి "మరోసారి మా ఇంటికి తప్పకుండా రావాలి మీరు. మా వారికి కూడా సంగీతమంటే ఇష్టం" అంది మణిమాల. లలిత తల ఊపింది.

6

"రాగిణీ! బాపినీడుగారు ట్రంకాల్ చేసారు. నువ్వు వెంటనే విమానంలో ఢిల్లీ వెళ్ళాలి!" అంది శ్యామలాంబగారు.

సేవాసదనంలో అందరూ రాగిణిని ఈర్ష్యగా చూశారు. ఇలాంటి 'ఛాన్స్'లు సాధారణంగా రాగిణికే వస్తాయి. ఆ చూపులకు సగర్వంగా నవ్వుకుంది రాగిణి.

వెంటనే ఎందుకో లలిత గుర్తొచ్చింది. ఇంతమంది కళ్ళలో తనను చూసి ఈర్ష్య... కానీ లలిత కళ్ళలో మాత్రం తనను చూసి జాలి! ఎందుకు? చూడాలి. లలిత కళ్ళలోను తనపట్ల ఈర్ష్య చూడాలి! తన సౌభాగ్యం చూసి, తన అదృష్టం చూసి... లలిత విస్తుపోవాలి! 'నేనే పొరపడ్డాను. రాగిణి హాయిగా జీవిస్తోంది!' అనుకోవాలి! 'ఈ ఐశ్వర్యం నాకు కావాలనుకున్నా రాద'ని నిట్టూర్చాలి!

కారులో వెళ్ళి, విమానంలో కూర్చుంది రాగిణి.

"ఈ కారు, ఈ విమానం .. లలిత ఈ జన్మలో అనుభవించ గలదా ఇలాంటనుభవాన్ని?"

ప్రతిక్షణమూ లలిత తనకెందుకు గుర్తొస్తుందో అర్థంకాదు రాగిణికి.

ఢిల్లీ విమానాశ్రయానికి బాపినీడుగారు కారు పంపారు.

బాపినీడుగారు రాగిణిని పరిశీలనగా చూస్తూ "నువ్వు కొంచెం

లావయ్యావు!'' అన్నాడు.

రాగిణి చిన్నబోయింది. తనను తాను చూసుకుంది. తనకేమీ తెలియటంలేదు. బాపినీడుగారు విసుగ్గా ''సరేలే! అవన్నీ తరువాత. ఇవాళ నువ్వు ఒక ఇంపార్టెంట్ గెస్ట్‌ని యెంటర్‌టెయిన్ చెయ్యాలి. జాగ్రత్త! ఆయన స్పెషల్ పోలీస్ ఆఫీసర్!'' అన్నాడు.

రాగిణి కెందుకో భయంవేసింది. అంతకంటే వివరాలు రాగిణికి తెలియవు. తెలియ నివ్వరు! ఆ పోలీస్ ఆఫీసర్ ఎవరు? ఎలాంటి ఆఫీసర్? అతనికీ, బాపినీడుకీ ఉండే లావాదేవీ లేమిటి? ఇవన్నీ రాగిణికి ప్రశ్నలే! సమాధానంకోసం రాగిణి కూడా పెద్దగా ఆలోచించని ప్రశ్నలు.

ఆ పోలీస్ ఆఫీసర్‌ని చూడగానే రాగిణివంట్లో జవసత్వాలొక్క సారిగా నశించిపోయినట్లయింది. అతని ప్రక్కనే ఒక ఆల్షేషియన్ డాగ్. అహర్నిశమూ అది అతని ప్రక్కన ఉండవలసిందే! ఆ కుక్కకు అతనికి పెద్ద తేడా కనిపించలేదు రాగిణికి. యాభైపైనే ఉంటుంది వయసు.

మత్తెక్కిన కళ్ళతో రాగిణిని చూస్తూ ''బాపినీడు గొప్పగా చెప్తే ఏమో అనుకున్నాను. జస్ట్ ఏవరేజ్!'' అన్నాడు.

రాగిణి ముఖం మాడ్చుకోలేదు. అభిమానపడలేదు. చిరునవ్వుతో దగ్గరకు నడిచింది,

ఇప్పుడు చూపించాలి తన ప్రభావాన్ని! 'ఏవరేజ్!' అన్న నోటితో 'ఎక్సలెంట్' అనిపించాలి! అందుకే ప్రత్యేకించి బాపినీడుగారు తనను పిలిపించింది!

రెండు నిమిషాల్లోనే అసలు విషయం అర్థమయిపోయింది రాగిణికి. ఆ ఆఫీసర్‌కి మనసులో పట్టరాని లాలస. శరీరానికి ఆ శక్తిలేదు. శక్తిలేని శరీరం ఊరుకోదు. మనసు ఊరుకోనియ్యదు. పర్వర్షన్స్ భరించాలి!

ప్రేమ! 36''-28''-36'' అంగుళాలలో కొలుచుకునే ప్రేమ! కృత్రిమపు కులుకుల్లో తొణికిసలాడే ప్రేమ! పచ్చి అబద్ధాల ప్రణయ సల్లాపాల్లో పవిత్రమయ్యే ప్రేమ! పాశవిక ప్రవృత్తుల తీరాన్నంటే ప్రేమ! ఆ ప్రేమ జలధిలో ఓలలాడి ఓలలాడి ఆపాదమస్తకమూ భగ్గుమని పించే జుగుప్సలాంటి భావాన్ని బలవంతాన అణచిపెట్టి చిరునవ్వుతో బాపినీడుగారి దగ్గరికొచ్చింది రాగిణి.

''వెల్‌డన్! ఆ ముసలి పీనుగుని బాగానే మురిపించావు.''

దగ్గిర దగ్గిర అరవై ఏళ్ళుంటాయి బాపినీడుకి! ఆఫీసర్ని ముసలి పీనుగంటున్నాడు. తనకు అరవై ఏళ్ళున్నా తాను నవయువకుడిలా ఉంటాడని బాపినీడు నమ్మకం. అతడు డబ్బిచ్చి పిలిపించుకునే స్త్రీలూ, అతని క్రింద డబ్బు తీసుకుని పనిచేసే రాగిణిలాంటి వాళ్ళూ అతనికా

నమ్మకం కలిగించారు. ఇంట్లో అతని భార్య ఏమీ మాట్లాడదు! ముసలి రూపు పడిపోయిన ఆవిడను చూడాలంటే బాపినీడుకి భయం.

రాగిణిని చూస్తూ ఆదరంగా చెయ్యిజాపాడు బాపినీడు. చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడుతూ ఆ చేతుల్లోకి వచ్చింది రాగిణి. అతి ప్రేమగా ముడతలుపడ్డ చెక్కిళ్ళు నిమిరింది,

"నువ్వు లావయిపోతున్నావు. డయటింగ్ చెయ్యాలి!" గుండ్రంగా ఉన్న చేతివంక నిరసనగా చూస్తూ మందలిస్తున్నట్లు అన్నాడు.

చిరునవ్వుతోనే తల ఊపింది రాగిణి.

అద్దంలో తనను తను చూసుకుంటూ చిరునవ్వుతో "నాకు కొంచెం బొజ్జ వచ్చినట్లుంది." అన్నాడు బాపినీడు.

"ఏం రాలేదు! మీరు ఏ అమృతం తాగుతున్నారో? నాకంటె చిన్నపిల్లాడిలా కనిపిస్తున్నారు."

అతణ్ని ముగ్ధురాలై చూస్తూ అంది రాగిణి.

"అహ్హహా!" అంటూ గట్టిగా నవ్వాడు బాపినీడు. విమానందిగి, కారులో తిరిగి సేవాసదనానికి వస్తున్నప్పుడు కొత్తగా తన మెడలోకి వచ్చి చేరిన పచ్చల నెక్లెస్‌ని సంతృప్తిగా తడిమి చూసుకుంది రాగిణి. లోలోపల ఏదో బరువుగా చీదరగా సలుపుతోంది! అదంతా లోపల మగ్గిపోవలసిందే! పైకి కనపడదుగా! పైకి కనపడేది పచ్చల నెక్లెస్!

లలితకు వైణికురాలిగా పేరు ప్రఖ్యాతులొస్తున్నాయి. ఒక ఆఫీసర్స్ క్లబ్‌లో లలిత వీణ కచేరి ఏర్పాటు చేశారు. ఆ సంగతి తెలుసుకున్న రాగిణి తనూ బయలుదేరింది. అతి శ్రద్ధగా అలంకరించుకుంది. ఏ సరసుణ్ని రంజింప చేయటానికీ రాగిణి అంత శ్రద్ధగా అలంకరించుకోలేదు.

"ఈ చీర ఎంత బాగుందో? ఎక్కడ కొన్నావ్?"

"ఈ జరీవర్క్ నువ్వే చేసావా? చేయించావా?

"నెక్లెస్, దుద్దులు, గాజులు, రింగ్, అన్నీ చక్కగా సూట్ అయ్యాయి. ఎక్కడ చేయించావు? చాలా ఖరీదు ఉంటుంది కదూ!"

చుట్టూ జేరిన యువతీ బృందం ఈర్ష్యతో, దాహంతో, తనను ఇలా ప్రశ్నిస్తోంటే సంతృప్తిగా తనను తను చూసుకుంది రాగిణి.

హాల్లో కూచున్నాక కూడా చుట్టుప్రక్కల చాలామంది ఆడవాళ్ళు తన చీరవంకా, నగలవంకా, అలంకరణ వంకా, ఒకటికి రెండుసార్లు పరిశీలనగా చూడడం ఎంతో హాయి నిచ్చింది రాగిణికి.

లలిత వీణ కచేరి మొదలయింది. ఆ హాల్లో రాగిణికి "పరిచయం" ఉన్న ఆఫీసర్లు అయిదారుగురున్నారు. వాళ్ళంతా రాగిణి తమను ఎక్కడ పలకరిస్తుందో నన్నట్లు భయపడుతూ బిగుసుకుపోయి ముఖాలు తిప్పుకో

వటం గమనించి తనలో తను నవ్వుకుంది రాగిణి. ఆవిడ మనసు లలిత వీణానాదంలో లీనమయి పరవశించటంలేదు. కళ్ళు లలితనే పరిశీలనగా చూస్తున్నాయి. వెంకటగిరి జరీచీర కట్టుకుంది. మెడలో సన్నని ఒంటి పేట గొలుసు, బొట్టు, కాటుకను మించి మరే అలంకరణాలేదు. మనిషి అందమా చెప్పటానికి లేదు. ముఖంలో ఏదో విషాదం దోబూచులాడుతోంది.

'పాపం! రాజు నింకా మరిచిపోలేదులా ఉంది'' తనలో తనే నవ్వుకుంది రాగిణి.

లలిత వీణానాదం పూర్తికాగానే ఆవిడను చాలామంది అభినందించారు. రాగిణికి పరిచయమున్న ఒక ఆఫీసర్ కూడా లలితను అభినందిస్తూ మాట్లాడుతున్నాడు.

తనను చూచి భయంతో ముఖం తిప్పుకున్న ఆఫీసర్! రాగిణి కెక్కడో కలుక్కుమంది, శ్యామలాంబా బాపినీడుగార్ల కఠినమైన ఆదేశాల ననుసరించి తమలో ఎవరూ బయట ఎక్కడా తమకు పరిచయస్తులైన ఆఫీసర్లను పరిచయమున్నట్లుగా పలకరించకూడదు. కానీ లలితను పలకరించచ్చు!

రాగిణి చకచక లలిత దగ్గిరకెళ్ళి భుజలమీద చెయ్యివేసి ''హలో! లలితా! బాగున్నావా?'' అంది అందమైన చిరునవ్వుతో.

రాగిణి అనుమానించినట్లు లలిత ముఖం చిట్లించుకోలేదు. రాగిణిని తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు.

''హలో! బాగున్నాను. నువ్వు బాగున్నావా?'' అంది ప్రసన్నంగా.

రాగిణి అక్కడికి రాగానే అంతవరకు లలితతో మాట్లాడుతున్న ఆఫీసర్ కంగారు పడిపోయాడు. తడబడుతూ ''ఈవిడెవరు?'' అన్నాడు.

''చిన్నప్పటి స్నేహితురాలు! ఒకప్పుడు ఇరుగుపొరుగున ఉండే వాళ్ళం!'' అంది లలిత.

రాగిణి వచ్చాక అక్కడ నిలవడం ఆఫీసరుకు కష్టమయిపోయింది.

''నేను వెళ్తున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే, మీ ఇంటి దగ్గిర డ్రాప్ చేస్తాను.'' అన్నాడు లలితతో, రాగిణి వంక చూడకుండా.

''నో! థాంక్స్! ఇక్కడి కార్యకర్తలు వాళ్ళ కారులో నన్ను ఇంటికి పంపిస్తారు!'' వినయంగా అని నమస్కారం చేసింది లలిత.

ఆ ఆఫీసర్ కూడా నమస్కారం చేసివెళ్ళిపోయాడు.

కొంచెం సేపట్లోనే కార్యదర్శివచ్చి ''మేడమ్? మీకోసం కారు వచ్చింది. వస్తారా?'' అన్నాడు లలితతో.

లలిత పక్కనే ఉన్న రాగిణిమీద అక్కడి యువకుల చూపులు తారట్లాడాయి.

"ఆవిడెవరు?"

"శ్యామలాంబగారి సేవాసదనంలో శీతాకోకచిలుక!"

"ఓహ్!"

ఈ గుసగుసలు రాగిణికి వినిపిస్తున్నాయి.

"ఓహ్!" అనడంలో నిరసన కూడా స్పష్టంగానే తెలుస్తోంది.

"వెళ్ళొస్తాను రాగిణీ!" అని లలిత వెళ్ళిపోయింది.

లలితకు ఆ రోజు వాళ్ళిచ్చిన పారితోషికం రెండువందల రూపాయలు మాత్రమే! తన విలువ ఒక్కరాత్రికి అయిదువందలు! కొన్ని సందర్భాల్లో ఇంకా ఎక్కువ! రెండువంద లెక్కువా? అయిదువంద లెక్కువా? అయిదే ఎక్కువ! లలితకంటే తనే ఎక్కువ! అవును! తనే ఎక్కువ! తప్పకుండా ఎక్కువ!

7

మణిమాల లలితను తమ ఇంటికి రమ్మని ఆహ్వానించింది. ఆ ఆహ్వానం సంతోషంగా అంగీకరించింది లలిత. ఆమె అంతరాంతరాల్లో మిణుకు మిణుకుమంటున్న ఆశ! మాధవరావుగారి ద్వారా మోహన్ జాడ తెలుస్తుందేమోనని!

అందంగా ఉన్న డ్రాయింగ్ రూంలో అంతకంటె అందంగా ఉన్న మణిమాల ముచ్చటగా కనిపించింది లలితకి.

"మీరు అదృష్టవంతులు!" అంది మనసారా అభినందిస్తూ.

"ఇదేం అదృష్టం!" చికాగ్గా అంది మణిమాల.

ఆశ్చర్యంగా చూసే లలితను ఎవరో అడవిమనిషిని చూసినట్లు చూసింది.

"నీ కసలేం తెలియదు! మాధవ్ మరీ ఇంత మడికట్టుకునే మనిషి కాకపోతే మేమూ గొప్పగానే ఉండేవాళ్ళం! భాస్కరరావుగారికి చూసావా? రెండు బంగళాలు! ఎయిర్ కండిషన్డ్ - రూంలు! మిసెస్ భాస్కరరావు ప్రత్యేకించి కాశ్మీరులో సమ్మర్ కాటేజ్ కట్టించుకుంది. మిసెస్ శోభాదేవి ఎప్పుడెక్కడికి కదిలినా ప్లెయిన్ లోనే! ఆవిడ చీరలు చూడలేదు నువ్వు. ప్రత్యేకించి, ఆర్డరిచ్చి బొంబాయిలో ఎంబ్రాయిడరీ చేయిస్తుంది! మిసెస్ ఆశాలత ఎప్పుడూ .."

లలితకు అర్థమయిపోయింది! నిరుపేదగా అవస్థలు పడలేక పినతల్లి పెంపకంలో మమతకు నోచుకోలేక రత్నమ్మ రాగిణిగా మారి దేనివెంట పరుగులెత్తుతూ ఆనందం వెతుక్కోవాలనుకుంటుందో, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ భార్య... సంపన్న గృహిణి... విద్యావంతురాలు, సభ్య సమాజంలో మన్నన లందుకోగలిగిన సంస్కారిణి... మణిమాల కూడా

దానివెనుకనే పరుగులెత్తుతోంది! అదే ఆనందం అందుకోవాలని ఆరాట పడుతోంది!

లలిత ఎక్కువసేపు నిరీక్షించవలసిన అవసరం లేకుండానే మాధవ్ వచ్చేసాడు. మణిమాల లలితను పరిచయం చేసింది. మాధవ్ లలితను చూసి వెంటనే "మిమ్మల్ని ఎక్కడో చూసాను! ఆ! రైట్! మీ తమ్ముణ్ని విడిపించమని అడగటానికి వొచ్చారు!" అన్నాడు.

లలిత సంకోచంతో తల వంచుకుంది.

"అబ్బ ఎంత గుర్తు! పోలీస్ ఆఫీసర్!" అంది మణిమాల నవ్వుతూ.

"ఏం జరిగింది? మీ తమ్ముడు విడుదలయ్యాడా?" యధాలాపంగా అడిగాడు మాధవ్! అతని కంఠంలో నిరసనా లేదు, ఆదరమూ లేదు.

"ఆ! కాని .." లలిత మాటలు పూర్తికాకుండానే కారు దిగి లోపలికి వచ్చింది రాగిణి.

రాగిణిని చూసి లలిత ఎంత ఆశ్చర్యపోయిందో, లలితను చూసి రాగిణి కూడా అంత విస్తుపోయింది.

"ఎక్స్యూజ్ మి!" అని ఏ ఒక్కరికీ నోరు మెదిపే అవకాశం కూడా ఇయ్యకుండా రాగిణిని తీసుకుని తన ప్రైవేట్ రూంలోకి వెళ్ళి పోయాడు మాధవ్.

మాధవరావుగారు! నిజాయితీపరుడని మణిమాల పొంగుతోన్న మాధవరావుగారు కూడా ఇంతేనా? ఇంతటి శక్తి ఉందా '36"-28"-36" కి? మణిమాల నిట్టూర్చింది!

రాగిణితో మాధవరావుగారు అలా తన కళ్ళముందు వెళ్ళిపోతే మణిమాలకు బాధగా లేదా? ఏమీ పట్టించుకోదా?

ఫోన్ మ్రోగింది. మణిమాల వెళ్ళి మాట్లాడి వచ్చింది. "ప్లీజ్! లలితా! ఏమీ అనుకోకండి! డాక్టర్ వినోద్ అర్జంటుగా రమ్మన్నాడు! పదినిముషాల్లో వచ్చేస్తాను. ఉంటారుగా! నేను రాగానే డ్రాప్ చేయిస్తాను." నొచ్చుకుంటున్నట్లుగా అని హడావుడిగా వెళ్ళిపోయింది. ఆయన అలాగ! ఈవిడ ఇలాగ! కొన్ని కొన్ని సంసారాల్లో భార్యాభర్త లిద్దరకు ఎవరి స్నేహితులు వాళ్ళకుంటారనీ, ఇద్దరిలో ఏ ఒక్కరూ ఆ స్నేహాల గురించి పట్టించుకోకుండా హాయిగా సంసారాలు చేస్తారనీ వింది. ఇంచుమించు ఇలాంటి సబ్జెక్ట్ మీదే గోపీచంద్ 'ప్రేమోపహతులు' వ్రాసారు! ఈ సంసారం కూడా అలాంటిదేనా?

వీణ వింటాం రమ్మని ఆహ్వానించి భర్త అటు, భార్య ఇటు వెళ్ళి పోయారు. ఏ కళాకారిణికైనా ఇంతకంటె అవమానం ఉండదు. ఏం మనుష్యులు? ఎలా అర్థం చేసుకోవాలి ఈ మానవప్రవృత్తిని? ఎంత అయో

మయంగా కనిపిస్తోంది జీవితం!

ఎవరూ వినకపోతేనేం! తనే వీణ వాయించుకొంటే? మణిమాల వచ్చేవరకూ ఎలాగూ తను వెళ్లటానికి వీలులేదు.

వీణ శ్రుతిచేసుకుని తనను తను మరిచి వాయించుకోసాగింది లలిత.

మణిమాల కారు దిగి లోపలికి వచ్చేవరకూ అలా వాయిస్తోనేఉంది. మణిమాలను చూసి ఆపుచేసింది.

ఆశ్చర్యంగా లలితను చూస్తూ "అరె! ఆ కన్నీళ్లేమిటి?" అంది.

లలిత సిగ్గుపడుతూ కళ్ళు తుడుచుకుని "అప్పుడప్పుడు, వీణలో లీనమయినపుడు, నాకిలా కళ్ళనీళ్ళు తిరుగుతుంటాయి. విశేషమేం లేదు!" అంది.

డ్రాయింగ్ రూంలోంచి బెడ్ రూంలోకి వెళ్ళడానికి కర్టెన్ ఒత్తిగించిన మణిమాల మరోసారి విస్తుపోయింది.

"మాధవ్! నువ్వీ గదిలోకి ఎప్పుడొచ్చావ్! నీ కళ్లలోనూ నీళ్ళు."

మణిమాల మాటలతో ఆ గదిలో కుర్చీలో కూర్చున్న మాధవరావును చూసి బిడియపడింది లలిత. మధ్య తెర అడ్డుగా ఉండటంవల్ల, మనసంతా సంగీతంలో లీనం కావటంవల్ల అతనెప్పుడొచ్చాడో లలిత గమనించనే లేదు.

మాధవరావు తన జేబులోనుండి రుమాలుతీసి కళ్ళు తుడుచుకుని నవ్వాడు. "కష్టాలు ఎదుర్కోగలను! చికాకులను తట్టుకోగలను. కానీ ఏవో అదృశ్యతరంగాలు నా అంతరాంతరాలు స్పృశించి నన్ను నాముందు నిలపటానికి ప్రయత్నిస్తోంటే కదిలిపోయాను. ఈ రకమైన కన్నీళ్ళలో ఒక రకమైన సౌఖ్యంఉంది. అది వదులుకోలేక పోయాను"

మాధవరావు మాటలు విని ఆశ్చర్యపోయింది లలిత. రాగిణిని చూడగానే వెంటబెట్టుకుని వెళ్ళిపోయిన వ్యక్తి నోట ఇటువంటి మాటలు!

ఇంటికి వెస్తూ దారిపొడుగునా ఈ విషయమే ఆలోచించింది! 'మనుష్యులంతా ఇంతే! కథల్లో మాత్రమే మూసపోసిన వ్యక్తిత్వాలతో కనిపిస్తారు,' అనుకొంది.

8

మణిమాల కారు తమ ఇంటిముందు ఆగటం చూసి లలిత చాలా చికాకుపడింది! జీవితంలో తనకు అందుబాటులో ఉన్న అన్నింటితోనూ ఆడుకోవటం మణిమాల స్వభావం కాబోలు! తనను కూడా అలా ఒక పావులా వాడుకోవాలనుకుంటోందా?

కానీ కారులోంచి మాధవరావు దిగాడు. లలిత తబ్బిబ్బుపడి పోయింది. మాధవరావు తన ఇంటికి వచ్చాడు!

"మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటంలేదు కదా!"

చిరునవ్వుతో అడిగాడు మాధవరావు. లలిత కంగారుగా "ఏం లేదు! రండి! రండి!" అంటూ ఆహ్వానించింది. ఒక్కసారి ఆ ఇంటి వాతావరణం పరిశీలించాడు మాధవరావు. వెంకట్రావు ముందుగదిలో మూలుగుతూ పడుకుని గొణుగుతున్నాడు! జానకి లోపలి గదిలో కళ్ళు మూసుకుని పడుకుని ఉంది. ఉన్నదాన్లో ఉన్నంతగా నాలుగు కుర్చీలువేసి ఒక డ్రాయింగ్ రూం ఏర్పాటుచేసింది లలిత. అక్కడే మాధవరావును కూర్చోబెట్టింది.

"మీరు మా ఇంటికి వచ్చినప్పుడు మీ వీణ వినలేకపోయాను. ఎప్పుడూ పని పని. ఇవాళ నేనే మీ వీణ వినటానికి మీ ఇంటికివచ్చాను."

తనకు అలవాటయిన గంభీర స్వరంతో అన్నాడు మాధవరావు. ఆ స్వరం తనను ఆజ్ఞాపిస్తున్నట్లుగా తోచి మాట్లాడలేదు లలిత.

"ఇవాళ నాకు చాలా అలసటగా ఉంది. కొంచెం రిలీఫ్ కావాలని పించింది. వెంటనే మీ ఇంటికి వచ్చేసాను. నేను కోరగానే మీరు వీణ వినిపించగలరా? అనుకోకపోలేదు. కానీ, కళాకారులు కఠినంగా ఉండరనే ధైర్యంతో వచ్చేసాను."

లలిత కాదనలేకపోయింది. గాంభీర్యంతోపాటు అతనిలో కనిపించే ఒక రకమైన నిష్కపటధోరణి లలితలో గౌరవభావాన్ని కలిగించింది. వీణ ముందు కూర్చుని వీణ శ్రుతి చేసింది. వీణ వింటూ కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నాడు మాధవరావు.

అతనికి సంగీతమంటే ఎంత ఇష్టమో అర్థమయింది లలితకి.

లలిత వీణ పూర్తిచేసేసరికి వెంకట్రావు బయటి గదిలోనుండి లోపలికి తొంగితొంగి చూస్తున్నాడు. ఆ దృశ్యం కంటపడే సరికి మనసు భగ్గుమంది లలితకి! ఏ విషయమైనా తమ దృక్పథంలోంచి మాత్రమే చూడగలరు మనుష్యులు! మాధవరావు ఏ మనుకుంటాడో ననుకునే సరికి జుగుప్సతో శరీరం జలదరించినట్లయింది! వెంకట్రావు అలా తొంగితొంగి చూడటం మాధవరావు గమనించనే గమనించాడు!

"ఆయన ఎవరు?" అని అడిగేసాడు.

"మా నాన్నగారు!" గొంతు కేదో అడ్డుపడుతున్నట్లుగా సమాధాన మిచ్చింది...

"మీ తమ్ముడేం చేస్తున్నాడు?"

"ఏం చేస్తున్నాడో తెలీదు. ఎక్కడున్నాడో, అసలే తెలీదు."

"అదేమిటి?"

"వాడు జైలునుండి విడుదలయ్యాక ఉద్యోగం దొరకటం మరీ కష్టమయింది. ఆ చికాకు భరించలేక ఇంట్లోంచి వెళ్లిపోయాడు, ఆ తర్వాత

వాడి సంగతి ఏమీ తెలియలేదు.''

''అరె! అతని ఫోటో ఏదైనా ఉంటే ఇవ్వండి. ఎక్కడున్నాడో తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాను!''

లలిత పొంగిపోయింది. సరిగ్గా ఈ సహాయం కోరటానికే లలిత మణిమాల స్నేహాన్ని ఆశ్రయించింది. మాధవరావును చూడగానే ఈ మాత్రం కూడా అడగలేకపోతోంది. కానీ, మాధవరావు ఫోటో కావాలంటున్నాడు.

''మోహన్ లేటెస్ట్ ఫోటో ఏదీ లేదు. చిన్నప్పటివే ఉన్నాయి!''

''అలా అయితే కొంచెం కష్టమే! పోనీ, అదే ఇవ్వండి.'' లలిత స్కౌట్ వేషంలో ఉన్న మోహన్ ఫోటో—హైస్కూల్ రోజుల్లోది తెచ్చిచ్చింది.

''ప్రయత్నిస్తాను. భయపడకండి! ఈ రోజుల్లో చాలామంది యువకులిలాగే గమ్యం తెలియకుండా పరిగెడుతున్నారు!''

లలిత ఇచ్చిన కాఫీ తాగి వెళ్ళిపోయాడు మాధవరావు.

మాధవరావు వచ్చేసరికి మణిమాల ఇంట్లోనే ఉంది. ఆవిడ అంతకు అరగంటకు ముందే వినోద్ దగ్గరనుండి వచ్చింది. తను వినోద్ దగ్గర కెళ్తున్నట్లు చీటీ రాసిపెట్టే పోయింది. ఎప్పుడూ అలాగే వెళ్తుంది. సాధారణంగా అలాంటి సందర్భాల్లో మణిమాల ఇంటి కొచ్చేసరికి, మాధవరావు అశాంతిగా పచార్లు చేస్తూనో, నుదుటికి చెయ్యి అడ్డంగా పెట్టుకుని కనుబొమలు చిట్లించుకుని పడక్కుర్చీలో పడుకుని ఆలోచిస్తూనో, కనిపించేవాడు. అలాంటిది ఆరోజు మాధవరావు ఎక్కడినుండో రావటం—అంతేకాక అతని ముఖంలో కనిపిస్తోన్న వికాసం మణిమాలకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

''ఎక్కణ్నుంచి మాధవ్?''

''లలిత ఇంటిదగ్గిరనుండి! ఆవిడ వీణ విని వస్తున్నాను!''

మరింత ఆశ్చర్యపోయింది మణిమాల! ఎవరో సన్నిహితుల ఇళ్ళకి కాని వెళ్ళడు మాధవరావు. అతనికి సంగీతమంటే ఇష్టమని తెలుసుకాని...

చిరునవ్వు నవ్వుతూ ''ఓ!...'' అంది.

నవ్వుతోన్న మణిమాల ముఖంలోకి ఒక్కక్షణం చూసి ''ఓ, న, మా, లు, తెలియకుండా ''ఓ!'' అనుకుంటే ప్రయోజనం లేదు.'' అన్నాడు. మణిమాల పకపక నవ్వింది.

'' 'ఓ' తెలిసిందిగా! ఇక నామాలు, నామరూపాలు, క్రమంగా తెలుస్తాయి.'' అంది.

''అంత తేలికకాదు మణీ! అన్ని భాషల ఓ న మా లూ ఒక్కలా

ఉండవు. ఎవరి భాష వాళ్ళది!''

ఉదాసీనంగా అన్న మాధవరావు మాటల్లో వ్యంగ్యం అర్థమయినా సమాధానం చెప్పలేకపోయింది మణిమాల!

మిసెస్ భాస్కరరావు ద్వారా పరిచయమయ్యాడు డాక్టర్ వినోద్ మణిమాలకి. మిసెస్ భాస్కరరావు వర్ణించగలిగినది డాక్టర్ వినోద్ ఐశ్వర్యాన్నే! మణిమాల చూడగలిగినది అతని ఐశ్వర్యాన్నే! అంతకుమించిన ప్రత్యేకత ఏమీలేదు అతని వ్యక్తిత్వంలో. డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతు లార్జించాడు. ఎన్నో బ్రాంచ్‌లున్నాయి. ఎందరో అసిస్టెంట్స్ పనిచేస్తున్నారు. మొదటి భార్య చచ్చిపోయింది. నడి వయసులో ఉన్నాడు. మణిమాలను చూడగానే ఆవిడ ఆకర్షణకు లోబడ్డాడు వినోద్. మొదట్లో మణిమాల పెద్దగా పట్టించుకునేది కాదు. కానీ, నలుగురిలో ఘనంగా కన్పించాలన్న కోరికా, ఆ కోరికలన్నీ తీర్చలేని మాధవరావు ఆర్థిక స్థితీ కారణంగా అతనికి సన్నిహితురాలయింది. వినోద్‌తోటి స్నేహం విషయం తెలిస్తే తనకు మాధవ్‌కు యుద్ధం తప్పదనుకుంది. పరిస్థితి అంతవరకూవస్తే మాధవ్‌ను వదిలి వినోద్ దగ్గరకు వెళ్ళిపోవటానికే నిర్ణయించుకుంది. ఆ భరోసా వినోద్ ఇచ్చాడు.

కాని ఈ విషయం తెలిసే మాధవరావు ఏమీ మాట్లాడలేదు. ఆ గాంభీర్యం మణిమాలను మరింత భయపెట్టింది. వారిద్దరు విడిపోలేదు. కానీ ఒక ఇనుపతెర వాళ్ళ మధ్య పడిపోయింది.

అప్పటినుండీ మణిమాల వినోద్ కోరిక మన్నించి అతనితో కలిసి తిరక్క తప్పలేదు. వాళ్ళగురించి గుసగుసలు వ్యాపించాయి.

''ఎన్నాళ్ళీ ముసుగులో గుద్దులాట? వచ్చెయ్యి!'' అనేవాడు వినోద్.

మణిమాలకు ఈ వ్యవహారం నచ్చలేదు. అది వినోద్‌మీద ప్రేమ కాదు. ఒకప్పుడు మణిమాల మాధవ్‌ను ప్రేమించే పెళ్ళి చేసుకుంది. ఈనాడు అతణ్ని వంచించాలని మణిమాలకు లేదు. వినోద్ దగ్గరకు ఎప్పుడు వెళ్ళినా అతనికి చెప్పే వెళ్తుంది. అది మాధవ్ మనసుకు ఎలాంటి రంపపు కోతో తెలియక కాదు. మాధవ్ కోపం పట్టలేక వెళ్ళిపొమ్మంటే ఈ కపట నాటకంనుండి బయటపడి వెళ్ళిపోవాలని...

''నా అంతట నేను మాధవ్‌ను వదిలి రాలేను! కానీ, అతడు వెళ్ళిపొమ్మన్న మరుక్షణం నీ దగ్గిరకి వచ్చేస్తాను.'' అంది వినోద్‌తో.

ఈ మాటలంటున్నప్పుడు మణిమాల కంఠం ఎందుకు గద్గదమయిందో, ఆవిడ కంఠంలో అనురాగానికి బదులు ధ్వనించిన కసిలాంటిది ఎవరిమీదో అర్థంకాలేదు వినోద్‌కి! అయితే ఇలాంటి అర్థంలేని విషయాలన్నీ

అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ బుర్ర పాడుచేసుకునే తత్వంకాదు అతనిది! అతనికి కావలసినది మణిమాల! మణిమాల సౌందర్యం!

9

మాధవరావు స్నేహితుడి కొక పూలతోట ఉంది. ఆ తోటలోకి పిక్నిక్ కి వెళ్లటం మాధవరావు కెంతో ఇష్టం. పెళ్ళయిన కొత్తల్లో మణిమాలను తీసుకుని రెండు మూడుసార్లు ఆ తోటకి వెళ్ళాడు. కానీ, రాను రాను మణిమాల పిక్నిక్ అనేసరికల్లా ఆడా, మొగా తన స్నేహితులందరినీ పోగుచేసుకురావడంతో మాధవరావు విసుక్కుని తను వెళ్ళడం మానేసాడు. మణిమాల కారణమడిగితే "అంతమంది మధ్య నాకేం బాగుండదు! పోనీలే! నీకదే సరదా అయితే నువ్వెళ్ళు" అన్నాడు.

"మనం ఇద్దరం వెళ్దాం!" అని మణిమాల అంటుందేమోనని అతని ఆశ. అతని ఆశ అదని మణిమాలకు తెలుసు. అయినా మణిమాల ఆ మాట అనలేదు. మాధవరావు ఆ ప్రస్తావన మళ్ళీ తేలేదు.

మాధవరావుకు భోజనం వడ్డిస్తూ "రేపు మీకు డ్యూటీ లేదు గదూ!" అంది మణిమాల.

"లేదు!" అన్నాడు మాధవరావు పైకి తేలకపోయినా లోలోపల కొంచెం ఆశ్చర్యపోతూ ఇటీవల తమ మధ్య ఇలాంటి సంభాషణ రావటం లేదు.

"అయితే, రేపు, మీరు, నేను, లలితా పూలతోటకి కెళ్దాం!" అంది మణిమాల.

సాధారణంగా తన మనసులో భావాలు బయటపడనీయని మాధవరావు ముఖం ఒక్కసారిగా వికసించింది.

"సరే!" అన్నాడు వెంటనే.

మణిమాల నవ్వును పెదిమల మధ్య బిగించి వదిలి "మీరు ఇంత త్వరగా ఒప్పుకుంటారనుకోలేదు!" అంది.

"నువ్వు వాళ్ళనీ వీళ్ళనీ పోగుచెయ్యకపోతే, ఇలాంటివి నాకెప్పుడూ ఇష్టమే!"

"ఇప్పుడు మాత్రం లలిత లేదూ?"

మాధవరావు అన్నం తింటున్నవాడు ఆగి, మణిమాల ముఖంలోకి పరిశీలనగా చూసాడు.

గంభీరంగా కూచుంది మణిమాల.

"లలిత విషయం వేరు."

అప్రయత్నంగా ఒక్క నిట్టూర్పు విడిచింది మణిమాల. వింతగా చూసే మాధవరావు చూపులను తప్పించుకుంటూ "నేనూ అలాగే అను

కున్నాను. అయితే లలితకు కబురుచేస్తాను. రేపు వెళ్దాం."

అని గబగబ అక్కడినుండి వెళ్ళిపోయింది. మాధవరావు భోజనం పూర్తికాలేదు. మణిమాల వెళ్ళిపోగానే అతనికి అన్నం దగ్గరనుంచి లేచి పోవాలనిపించింది. కాని లేవలేదు. కొన్ని క్షణాలు అలాగే కూచుని తనే లేచివెళ్ళి పెరుగు తెచ్చుకుని వడ్డించుకున్నాడు.

మణిమాల కబురు అందుకున్న లలిత వెంటనే ఒప్పుకుంది. మాధవ రావుకు సంగీతంలోఉన్న ఆసక్తి లలిత కర్ధమయింది. తను కోరకుండానే మోహన్ ఆచూకీ తెలుసుకుంటానని వాగ్దానంచేసిన మాధవరావు దంపతుల స్నేహం లలిత వదులుకో దలచలేదు.

మణిమాల ఎంతో ఉత్సాహంగా కారియర్సు సర్దింది. ఫ్లాస్కుల్లో కాఫీ పోసింది. లలిత రాగానే కూచోబెట్టి లలిత వద్దంటున్నా ఫలహారాలు రుచి చూపించింది. ఆ పూలతోట ఎంత బాగుంటుందో లలితకు వర్ణించి చెప్పింది. తీరా డ్రైవర్ కారు సిద్ధం చెయ్యగానే "అబ్బా! నాకు కడుపు నొప్పి!" అంటూ మంచంలో పడుకుంది.

లలిత కంగారు పడింది.

"డాక్టర్ని పిలిపించండి. ఎప్పుడైనా ఇలా వస్తుందా?" అంది ఆదుర్దాగా.

మాధవ్ ఏం మాట్లాడకుండా మణిమాలను చూస్తూ సోఫాలో కూర్చున్నాడు.

"ఏం కాదు! నిన్న పచ్చిమిరపకాయ బజ్జీలు ఇష్టమని ఎక్కువగా తిన్నాను. దాని ఎఫెక్ట్. నువ్వూ మాధవ్ వెళ్ళండి. నేను రెస్ట్ తీసుకుంటాను."

లలితకు మతిపోయినట్లయి "అదెలా .." అని మాధవరావు ముఖం చూసి ఎటూ చెప్పలేక నిలబడిపోయింది...

"ఎలా లేదు. ఏం లేదు. మాధవ్‌కి ఆ పూలతోటలో గడపటం చాలా ఇష్టం! బహుశః ఆ తోట నువ్వూ ఇష్టపడతావు. వెళ్ళిరండి..." అని లలిత ఏం మాట్లాడటానికీ అవకాశమియ్యకుండా పనిమనిషిని పిలిపించి సర్దినవన్నీ కారులో పెట్టించింది.

లలిత నిస్సహాయంగా మాధవరావు వంక చూసింది. అతనేం ఆలోచిస్తున్నాడో లలిత కంతుపట్టలేదు. అలాగే కూచున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో దిగింది రాగిణి.

అప్పటివరకూ శిలలా కూచున్న మాధవరావు రాగిణిని చూడగానే "రండి! నా ఆఫీస్‌రూంలోకి వెళ్దాం!" అని లేచాడు.

కారులో పనిమనిషి సర్దుతోన్న సామానులు చూపించి రాగిణి

ప్రయాణ సన్నాహంలో ఉన్న లలితా మాధవరావులను చూసింది. తనను చూడగానే జీవం లేనట్లు పాలిపోయిన లలిత ముఖాన్ని చదువుకుంది వెంటనే అక్కడినుంచి కదలలేకపోయింది.

పాలిపోయిన లలిత ముఖంలోకి చూసి ప్రసన్నంగా నవ్వింది.

"పాపం! మాధవరావుగారితో ఎక్కడికో వెళ్దామని ప్రోగ్రాం వేసుకున్నట్టుగా ఉన్నావు. నా మూలంగా అంతా పాడయింది. అయామ్ వెరీసారీ లలితా! నాకు తెలియకుండానే ఎప్పటికప్పుడు నీకు అడ్డుపడుతున్నాను. నిన్నిలా కష్టపెట్టటం నాకు కష్టంగానే ఉంది. నేనేం చెయ్యను చెప్పు! నిజం చెపుతున్నాను. నేను నీకోసం ఏమైనా చెయ్యగలిగితే సంతోషంగా చేస్తాను. నువ్విలా బాధపడుతోంటే చూడలేను!"

కంఠంలో ఎక్కడలేని ఆప్యాయతా ధ్వనింపచేస్తూ అంది రాగిణి.

లలిత సమాధానం చెప్పలేదు. వంచిన తల ఎత్తకుండా అలాగే కూచుంది.

మాధవరావు ఒక్కసారి రాగిణిని లలితను చూసాడు. వెంటనే లేచి "మిస్ రాగిణీ! ఇప్పుడు నాకు మీతో మాట్లాడే తీరిక లేదు. తర్వాత రండి! కమాన్ లలితా!" అంటూ లలిత చెయ్యి పట్టుకుని కార్లో కూచోబెట్టి పక్కన కూచుని డ్రైవర్‌తో "పోనీయ్!" అన్నాడు.

యజమాని మూడ్స్ బాగా అర్థంచేసుకున్న డ్రైవర్ వెంటనే కారు స్టార్ట్ చేశాడు.

అనుకోని ఈ సంఘటనకు కొయ్యబొమ్మలా నిలిచిపోయింది రాగిణి మాత్రమే కాదు. మణిమాల కూడా! ఒక్కటే తేడా! రాగిణి కళ్ళు నిప్పులుపోసాయి. మణిమాల కళ్ళలో నీళ్ళు ఉబికాయి.

తన చేతిలో చల్లగా మంచులా ఉన్న లలిత చెయ్యి వదిలేసాడు మాధవ్. అంతవరకు తనచెయ్యి మాధవ్ చేతిలో ఉందనే స్పృహకూడా లేని లలిత సిగ్గుపడి మాధవ్‌కు ఎడంగా జరిగి వంటినిండా పైట కప్పుకుంది

"థేంక్స్!" అంది.

"దేనికి, థేంక్స్!" అల్లరిగా అడిగాడు. బిత్తరపోయి చూసిన లలితను చూసి పకపక నవ్వాడు.

మాధవరావు సాధారణంగా నవ్వడు. అతనలా నవ్వటం మొదటిసారిగా విన్న లలితకు ఆ నవ్వులో ఏదో సంగీతం వినిపించినట్లయింది. రాగతాళాలకు అతీతమయిన సహృదయం ధ్వనించే సంగీతమా ఇది?

అంతలోనే గంభీరంగా మారిపోయిన మాధవరావు "రాగిణి మీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు!"

"ఎలా తెలుసు?"

"నా స్నేహితురాలు!"

కొంచెంసేపు మాధవరావు మాట్లాడలేదు. తరువాత అన్నాడు.

"ఒక స్నేహితుడిగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అలాంటి స్నేహాలు మీకు మంచివికావు."

"మీబోటి వారికేనా అలాంటి స్నేహాలు మంచివి?" వెటకారంగా అనేసి నాలిక కరుచుకుంది లలిత. భయంగా మాధవరావును చూసింది.

మళ్ళీ నవ్వాడు మాధవరావు.

ఆ నవ్వు వింటున్న కొద్దీ తనలో ఏదో కొత్త శక్తివచ్చి చేరుకుం టున్నట్లు అనిపించసాగింది లలితకి.

"క్షమించండి!" అంది.

"మీ మాటలు ఒక రకంగా నిజమే! మాబోటివారికే అలాంటి స్నేహాలు మంచివి. నేరస్తులని ట్రాప్ చెయ్యటానికి వాళ్ళని ఉపయో గించుకుంటాం మేము!" స్నేహ స్వరంతో అన్నాడు మాధవరావు. లలి తలో కుతూహలం పెరిగింది.

"రాగిణిని కూడా అలాగే ఉపయోగించుకుంటున్నారా?"

"లేకపోతే, ఆవిడతో నాకేం అవసరం? ఆఫీసర్ రాజు గవర్న మెంట్ డబ్బును దుర్వినియోగం చేస్తున్నాడని తెలిసింది. అతడు ప్రాస్టి ట్యూట్స్‌తో హోటల్స్‌లో గడుపుతాడని కూడా రిపోర్ట్స్‌వచ్చాయి. అతణ్ని ట్రాప్ చెయ్యటానికే రాగిణిని ఉపయోగించుకుంటున్నాం."

గుండె ఝల్లుమంది లలితకి.

మారిన లలిత ముఖ కవళికలు గమనిస్తూ "అదేమిటి అలా అయి పోయారు? అన్నట్లు రాగిణి మీ స్నేహితురాలన్నారు కదూ! భయపడ కండి! ఆవిడకేమీ జరగదు!" అన్నాడు.

లలిత క్షణాలలో సర్దుకుంది. తన పక్కనఉన్న వ్యక్తి పోలీస్ ఆఫీసర్. ముఖంచూస్తూ మనసు చదవగల ప్రజ్ఞాశాలి. తను హెచ్చరికగా ఉండాలి. ఉన్నట్లుండి "డ్రైవర్! లలితమ్మగారి ఇంటికి పోనీయ్!" అన్నాడు మాధవ్.

లలిత చాలా సంతోషించింది. మణిమాలలేకుండా ఇలా మాధవ రావుతో కలిసి పిక్నిక్‌కి వెళ్ళాలనిలేదు లలితకి.

"మీ ఇంటికి వెళ్దాం! మీకు అభ్యంతరంలేకపోతే, ఒక్కసారి వీణ వాయించండి. వినేసి ఇంటికి కెళ్ళిపోతాను. నాకు చాలా పను లున్నాయి." అన్నాడు మాధవ్ లలితతో.

"తప్పకుండా రండి. మీరు నా వీణ వింటాననటంకంటె నాకు కావలసిన దేముంది?" సంతోషంగా అంది లలిత.

10

పకపక నవ్వాడు రాజు. షాక్ తిన్నట్లుగా చూస్తోన్న లలిత ముఖం చూసి మరింత విరగబడి నవ్వాడు. పొంగి పొంగి కెరటాల్లా వస్తోన్న నవ్వును ఆపుకోవటానికి విశ్వప్రయత్నం చెయ్యవలసి వచ్చింది.

"లాభంలేదు లలితా! ఏం లాభంలేదు!" నవ్వు నాపుకునే ప్రయత్నంలో నవ్వుమధ్య అస్పష్టంగా అన్నాడు.

లలితకు అతని మాటలు అర్థం కావటంలేదు.

"ఏమనుకుంటున్నావ్ నువ్వు? నువ్వు చెప్పిన మాటలు విని రాగిణిని వదిలేసి... నిన్ను పెళ్ళి చేసుకుని .." మళ్ళీ నవ్వాడు రాజు.

అర్థమయిపోయింది లలితకు! తనను తానెంత నికృష్ట స్థితిలోకి దిగజార్చుకుందో, ఒక్కసారిగా అర్థమయిపోయింది. "రాగిణిని నేను వదిలెయ్యటానికి నువ్వింత శ్రమపడక్కర్లేదు లలితా! రాగిణిని నేను పెళ్ళి చేసుకుంటావా? ఎవరు చెప్పారు నీకు? నేను .. ఐ. ఎ. ఎస్. ఆఫీసర్ని రాగిణిని పెళ్ళి చేసుకుంటానని అనుకున్నావా? మినిస్టర్లు తమ కూతుళ్ళ నిస్తామని వస్తున్నారు. కలెక్టర్లు సంబంధాలు కలుపుకోవాలని కబుర్లు పంపుతున్నారు. నేను ఎవరిని పడితే వాళ్ళని పెళ్ళి చేసుకుంటానా?"

పకపక నవ్వుతున్నాడు రాజు.

హఠాత్తుగా లేచి బయటకు నడిచింది లలిత.

మాధవరావు రాజును ట్రాప్ చెయ్యటానికి రాగిణిని ఉపయోగించుకుంటున్నాడని తెలిసిన క్షణంనుంచీ లలిత స్థిమితంగా ఉండలేకపోయింది. ఒక్కక్షణం "అంతే కావాలి శాస్తి. అనుభవించనీ!" అనిపించక పోలేదు. కానీ అలాంటి ఆలోచన వచ్చినందుకు తనమీద తనకే చికాకు కలిగింది.

రాజు తనను నిర్లక్ష్యం చేసినంత మాత్రాన రాజు నాశనం కోరుకో గలదా? ఇలాంటి రహస్యం తెలిసిన తరువాత .. రాజును రక్షించగలిగే శక్తి తన చేతుల్లో ఉండీ చూస్తూ ఊరుకోగలదా?

రాజును కలుసుకుని తనకు తెలిసిన రహస్యం రాజుకి చెప్పేసింది!

రాజు విని పకాలున నవ్వాడు. 'ఈ రకంగా నన్ను రాగిణికి దూరం చేద్దామనుకుంటున్నావా?' అని పరిహాసం చేసాడు!

ఇదీ ఒకందుకు మంచికే జరిగింది. ఇప్పుడు తన మనసు చాలా తేలిగ్గా ఉంది! తన ఎదురుగా పకపక నవ్వే ఆ రాజు తను ప్రేమించిన రాజు కాదు. తనకెన్నడూ పరిచయంలేని తన ఊహలకందని ఎవరో అతి సామాన్య వ్యక్తి.

రాజు తెలివి తక్కువ వాడు కాదు, అందుకే లలిత మాటలు

నమ్మలేకపోయాడు. తను చేసిన నేరమేమీ లేదు. గవర్నమెంట్ డబ్బు తను వాడుకున్నదీ లేదు. ఆ రోజు రాగిణితో తనను చూడగానే లలిత ముఖం ఎలా అయిపోయింది? అఫ్ కోర్స్! లలిత తనను ప్రేమించింది! చాలా మంచిది! సందేహం లేదు! అయితే మాత్రం! తనలాంటి ఐ. ఎ. ఎస్. ఆఫీసర్ కి లలితలాంటి భార్య ఏం బాగుంటుంది? ఎలాంటి ఆఫర్స్ వస్తున్నాయి? ఎందుకైనా మంచిది! రాగిణిని కదిలించి చూడాలి!

రాగిణి రాగానే రాగిణి ముఖకవళికలు పరిశీలనగా చూస్తూ అనేసాడు "ఇది విన్నావా? నిన్ను పోలీస్ డిపార్ట్ మెంట్ నన్ను ట్రాప్ చెయ్యటానికి పంపిస్తోందట!"

నిర్ఘాంతపోయింది రాగిణి. "ఎవరు చెప్పారు" అంది.

"లలిత!"

"అయితే ఇంకేం? నేను వెళ్ళిపోతాను. నువ్వూ లలితా మళ్ళీ స్నేహితులయిపోవచ్చు!"

వెళ్ళిపోవటానికన్నట్లు బయలుదేరింది రాగిణి. అడ్డగించాడు రాజు.

"అంత తేలిగ్గా నిన్ను వెళ్ళనివ్వను! నేను తిరస్కరించినందుకు లలిత ఎంత బాధపడుతోందో, తిరిగి నన్ను పొందాలని ఎలా తపసు చేస్తోందో. నాకు తెలియదనుకున్నావా? పాపం, లలిత..."

కిలకిల నవ్వింది రాగిణి. ఆ నవ్వు వింటూ సర్వమూ మరచిపోయాడు రాజు. 36''-28''-36'' లో మునిగిపోయాడు.

ఒక నెలరోజులు రాజు రాగిణి విషయంలోనూ అన్ని విషయాల్లోనూ చాలా జాగ్రత్తగా ఉన్నాడు. ఏమీ జరగలేదు. 'అసూయ ముందు పుట్టి ఆడది తర్వాత పుట్టింది' అని నవ్వుకున్నాడు.

రాజులాంటి బ్రహ్మచారి కళ్ళ కెదురుగా కనిపిస్తోంటే పెద్దలూరు కోరు. చాలా గొప్ప గొప్ప సంబంధాలొస్తున్నాయి రాజుకి. ఎవరిని చేసుకోవాలో నిర్ణయించుకోలేక పోతున్నాడు. ఈ సందట్లోపడి రాగిణి విషయం ఇంచుమించు మరిచిపోయాడు.

ఆరోజు రాగిణితో కలిసి రాజు ఖరీదైన హోటల్లో ఉండగా మాధవరావు ఆ హోటల్ మీద రెడ్ చేశాడు. రాజును అరెస్ట్ చేసారు.

గవర్నమెంట్ డబ్బు హరించుకుపోయింది. ఈ అక్రమానికి ఎవరో ఒకరు బాధ్యులు కావాలి! రాజుని చూపించారు! రాజు డబ్బు నిలువ చేసుకున్నట్టుగా ఆధారాలేమీ లేవు. సొంత ఆస్తి కూడా లేదు. కానీ 'కాల్ గరల్స్'తో తిరుగుతున్నాడు! డబ్బంతా ఈ విధంగా ఖర్చుపెట్టి ఉంటాడా? వేరే ఎక్కడైనా రహస్యంగా దాచాడా?

రాజును సస్పెండ్ చేసారు. విషయం విచారణలోకి వచ్చింది.

11

మణిమాల కావాలని లలితతో స్నేహం పెంచుకోసాగింది. దానికి లలిత కూడా సంతోషించింది. మణిమాలా మాధవరావులతో కలిసి భోజనం చెయ్యటం, ఆ దంపతులు వింటూ ఉండగా వీణ వాయించటం, అప్పు డప్పుడు వాళ్ళిద్దరితో కలిసి పిక్నిక్లకి కూడా వెళ్ళటం సాధారణమయి పోయింది లలితకి.

మాధవరావు మోహన్ అనే పేరుగల ఇద్దరు ముగ్గురు వ్యక్తుల ఆచూకీలు తెలుసుకుని ఫోటోలు తెప్పించారు. కానీ అవేవీ లలిత తమ్ముడు మోహన్ వికావు. మాధవరావు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. మోహన్ క్లాస్ మేట్స్ ఎవరెవరో తెలుసుకుని వాళ్ళందరి దగ్గిరా మోహన్ గురిం చిన వివరాలు సేకరించాడు. మోహన్ కలిసి పనిచేసిన సంఘసభ్యులతో కూడా మాట్లాడాడు. మోహన్ స్నేహితులలో ఒకరి దగ్గిర మోహన్ ఉన్న గ్రూప్ ఫోటో ఒకటి సంపాదించగలిగాడు. దాని ఆధారంతో మోహన్ ఆచూకీ తెలుసుకోవటానికి పూనుకున్నాడు.

"ఫోటో దొరికింది గనుక కొంచెం రోజుల్లోనే మీ తమ్ముడ్ని మీ దగ్గిరకు తీసుకురాగలను." అన్నాడు మాధవరావు.

లలిత ఈ వార్త వెంటనే తల్లికి చెప్పింది. మంచంలో పడి కొడు కును గురించిన బెంగతో తల్లడిల్లిపోతున్న జానకమ్మ కళ్ళలోకి జీవం వచ్చింది. "ఎప్పుడే! ఎప్పుడొస్తున్నాడువాడు?" అంది ఆశగా.

"త్వరలోనే వచ్చేస్తాడమ్మా!" మాధవరావు మీది నమ్మకంతో తల్లికి ధైర్యం చెప్పింది లలిత.

మణిమాల కబురందుకొని ఎప్పటిలా ఉత్సాహంగా వచ్చిన లలిత మణిమాల ముఖం చూసి బిత్తరపోయింది.

ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు వడిలిపోయిఉంది మణిమాల ముఖం.

"అలా ఉన్నారేం?" అంది లలిత.

"నేనొక్కటి చెప్తాను. ఇవాళ నామాట కాదనకు! మాధవ్ నిన్ను తనతో తీసికెళ్తాడు. వెళ్ళు."

మణిమాల ఒకటి రెండు సార్లు లలితను, మాధవరావును మాత్రమే బయటికి పంపాలని ప్రయత్నించింది. లలితా మాధవరావు లిద్దరు ఆ ప్రయ త్నాన్ని తీవ్రంగా ప్రతిఘటించటంతో విరమించుకుంది. మణిమాల ప్రాధేయపడుతున్నట్లుగా అలా మాట్లాడేసరికి ఏం తోచక అక్కడే ఉన్న మాధవరావును చూసింది లలిత.

"ప్లీజ్! రండి!" అన్నాడు మాధవరావు. అతడా మాటలన్న ధోరణి లలిత కేదో భయం కలిగించింది.

"ఏమిటిదంతా..." అంది.

"రండి!" అంటూనే కారులో కూచున్నాడు మాధవరావు.

దడదడ లాడే గుండెలతో కారులో కూర్చుంది లలిత. కారు డ్రైవ్ చేస్తూ తిన్నగా రోడ్డువంకే చూస్తూ కూచున్నాడు మాధవరావు.

జైలుముందు కారాగేసరికి లలితకు మతిపోయినట్లయింది.

మాధవరావు దిగి కారు డోర్ తెరిచి "దిగండి!" అన్నాక కాని తనక్కడే దిగాలని నమ్మకం కలగలేదు లలితకి.

ఎన్నెన్నో మాట్లాడాలని ఉంది. ఏదేదో అడగాలనిఉంది. కానీ గొంతు పొడారి పోతోంది లలితకి. యాంత్రికంగా మాధవరావు వెంట నడిచింది. అతడు కూర్చోమన్న కుర్చీలో కూచుంది. కొంచెం సేపట్లోనే ఖైదీ యూనిఫాంలో ఉన్న యువకుణ్ని పోలీసులు లలిత ముందుకు తీసుకొచ్చారు.

"మోహన్!" ఒక్క గావుకేక పెట్టింది లలిత.

మోహన్ లలిత ముఖంలోకి చూసి తల దించుకున్నాడు. గిర్రున తిరిగి బయటికెళ్ళి పోతున్న అతణ్ని పోలీసులనుసరించారు.

లలిత కళ్ళనుండి కన్నీరు కాలువలు కట్టింది. వణికిపోతున్న లలిత భుజం చుట్టూ చెయ్యివేసి తన రుమాలుతో కన్నీళ్లు తుడిచాడు మాధవరావు. తనేంచేస్తోందో, ఏం జరుగుతోందో, ఏమీ తెలియటంలేదు లలితకి. లలితను నడిపించుకుంటూ తీసుకొచ్చి కారులో కూచోబెట్టాడు మాధవ్. లలితకు కన్నీళ్ళాగటంలేదు.

"మీ ఇంటిదగ్గిర దింపనా!" అన్నాడు మాధవరావు. తల్లి ముఖం గుర్తుకొచ్చి వణికిపోయింది లలిత.

"వద్దు! వద్దు! తమ్ముడొస్తాడని గంపెడాశతో ఉంది అమ్మ. ఇప్పుడిప్పుడే కాస్త లేచి తిరుగుతోంది. అమ్మముఖం ఎలా చూడగలనో అర్థం కావటంలేదు. నాన్న అలాగ! తమ్ముడిలాగ! నన్నెక్కడికయినా కొంచెం సేపు తీసికెళ్ళండి. కొద్దిగా స్థిమితపడనీయండి!"

లలిత ఎన్నడు ఇంత బేలగా మాట్లాడలేదు. జాలితో మనసు తరుక్కుపోయింది మాధవరావుకి.

"సినిమాకు వెళ్దామా?" అన్నాడు.

"ఎక్కడికైనా సరే!"

నిలబడలేక పోతున్న లలిత భుజం చుట్టు చెయ్యివేసి నడిపించుకొంటూ సినిమాహాల్లో కొచ్చి లలితను కూచోబెట్టి తను పక్కన కూచున్నాడు మాధవరావు.

ఆరోజే రాగిణి కూడా తన సేవాసదనం స్నేహితులతో కలిసి సినిమా

కొచ్చింది. లలితా మాధవరావులను చూడగానే రాగిణి కేదో ఈర్ష్య కలుక్కుమంది.

తనకు ఈర్ష్య ఏమిటి? ఎందుకు? ఎవరిమీద? రాగిణిని మాధవరావు చూసాడు. రాగిణితో పాటు రాగిణి స్నేహితులను చూసాడు. రాగిణి నవ్వబోయింది. ఆవిడ ఒక మనిషే కానట్లు తల తిప్పుకున్నాడు మాధవరావు. రాగిణి మనసు భగ్గుమంది.

రాగిణి కట్టుకున్నది మైసూర్ జార్జెట్ చీర! దగ్గర దగ్గర అయిదు వందలుంటుంది. ఎర్రటి ఎరుపులో ఉన్న ఆ చీరకి మాచ్ అయ్యేలా నెక్లెస్, దుద్దులు, గాజులు, ఉంగరం, అన్నీ ఉన్నాయి. అన్నీ ఖరీదైనవే! అందమైన ఆ చీరలో శరీరకాంతి మరింత అందంగా కనిపిస్తోంది. చుట్టు పక్కల పురుషుల చూపులు రాగిణిమీద నుంచి కదలటంలేదు.

తనను చూసుకుని లలితను చూసింది రాగిణి. ఏం చీరో సరిగ్గా తెలియటంలేదు. పాతబడి ఉంది. కొద్దిగా నలిగినట్లుగా కూడా ఉంది. ఏ అలంకరణా లేదు సరికదా, ముఖమంతా వడిలిపోయి ఉంది. జుట్టు రేగి ఉంది. అయితే ఆ వడిలిన ముఖంలో ఏదో ఆకర్షణ రాగిణి గుర్తించకుండా ఉండలేకపోయింది.

మాధవరావు కూల్ డ్రింక్ తెప్పించి తనే లలిత కందించాడు. ఎందుకనో సీసా పట్టుకున్న లలిత చేతులపై తన చెయ్యి వేసాడు.

ఉండుండి లలితతో ఏదో మాట్లాడుతున్నాడు. లలితను నవ్వించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఒక్కసారి అపురూపంగా లలిత కనీ కనపడనట్లు నవ్వింది. ఏం మెరుపులు, ఆ నవ్వులో!

రాగిణి సినిమా చూడలేదు. లలితా మాధవరావులనే చూస్తూ కూచుంది.

సినిమా పూర్తి కాగానే రాగిణి నిగ్రహించుకోలేక "హలో! లలితా!" అని దగ్గరకు రాబోయింది. లలిత ఏదీ వినిపించుకోగలిగే స్థితిలో లేదు. వినిపించుకున్న మాధవరావు రాగిణి ఎక్కడ సమీపిస్తుందోనన్నట్లు గబగబ లలితను నడిపించి కారులో కూచోబెట్టాడు.

'ఆపాదమస్తకమూ భగభగలాడింది రాగిణికి. లలిత షాక్ నుండి కొంచెం కోలుకున్నట్లు కనిపించాక మాట్లాడటం మొదలుపెట్టాడు.

"మీరు నన్ను క్షమించాలి లలితా!"

"దేనికి?"

"మోహన్ అరెస్టవడానికి కారణం నేనే!"

లలిత దిగ్గున తలెత్తి ఆశ్చర్యంగా చూసింది.

"మోహన్ గురించి తెలుసుకోవటానికి మీరు నా సహాయం కోరక

పోయినా బాగుండేది. ఆ ఫోటో ఆధారంగా ప్రయత్నించేసరికి అనుకోని వివరాలు తెలిసాయి. మోహన్ గేంగ్‌తో కలిసి దొంగతనాలు చేస్తున్నాడు. అందరినీ అరెస్ట్ చేసాం!'' లలిత మాట్లాడలేదు.

మాధవరావు చెయ్యిజాపి లలిత చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మంచులా చల్లగా ఉంది. ''నన్ను క్షమించు లలితా!''

మొదటిసారిగా ఏకవచనంలో చనువుగా సంబోధించాడు మాధవరావు. అంతటి విషాదంలోనూ అది గుర్తించింది లలిత మనసు.

''మీరు నన్ను క్షమించమని అడగక్కర్లేదు. మీరేం తప్పు చేసారని?'' శాంతంగా అంది.

ఆ సమాధానానికి మాధవరావు ఆశ్చర్యపోయాడు. లలితను లోలోపల మెచ్చుకున్నాడు. ఒక్క నిట్టూర్పు విడిచాడు!

12

పని కట్టుకుని తన దగ్గరకువచ్చిన రాగిణిని చూసి చికాగ్గా ముఖం చిట్లించుకున్నాడు మాధవరావు.

''నమస్తే!'' తనకు అలవాటయిన ధోరణిలో వయ్యారంగా విలాసాలుపోతూ నమస్కారం చెయ్యబోయింది రాగిణి

తీక్షణంగా ఒక్కసారి రాగిణిని పైనుండి క్రిందకు చూసాడు మాధవరావు ఆ చూపులతో తనకు తెలియకుండానే విలాసాలు మరిచిపోయి తిన్నగా నిలబడిపోయింది రాగిణి తనకే అర్థంకాని భయంతో దడలాడుతున్న గుండెలను సర్దుకుని మామూలు ధోరణిలో నవ్వటానికి రెండు నిముషాలుపట్టింది రాగిణికి.

శ్యామలాంబగారి సేవాసదనంలో చేరినప్పటినుండీ రాగిణికి అనేకమంది 'ప్రసిద్ధపురుషుల'తో 'పరిచయాలు' ఏర్పడ్డాయి. వాళ్ళలో ఏ ఒక్కరిని గురించీ ప్రత్యేకంగా ఏ నాడు రాగిణి ఆలోచించలేదు.

కొన్నికొన్ని సందర్భాలలో రాజకీయుభైదీలను సైక్రియాటిస్ట్‌ల సహాయంతో సొంత ఆలోచన అనేది రాకుండా తయారుచేసి ఉపయోగించుకొంటారట!

సేవాసదనంలోఉన్న స్త్రీల పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంటుంది. సైక్రియాటిస్ట్‌లు ప్రత్యేకించి రాకపోయినా వాళ్ళు మసలే వాతావరణంలో, శ్యామలాంబగారు సృష్టించే పరిస్థితుల్లో వాళ్లకు చీరలు, నగలు, డబ్బు, తప్ప మరేదీ ముఖ్యంకాదు. అలంకరణలు విలాసాల్లో వాళ్ళు ఒకరితో ఒకరు పోటీలుపడేలా శ్యామలాంబగారు తన మాటలతో రెచ్చగొడుతుంది. ఆ ప్రవాహంలోపడి కొట్టుకుపోతూ ఎంతగా విలాసాలు గుమ్మరించగలిగితే అంత ప్రజ్ఞావంతుల మనుకోగలిగితే దశలోకి వచ్చే

సారు వాళ్ళు. రాగిణి ఎప్పుడూ ఆలోచించేది ఒకే ఒక వ్యక్తిని గురించి ఆ వ్యక్తి లలిత.

లలిత అంటే రాగిణికి ఎంతో అభిమానం. చిన్న తనంలో అనేక విధాల తనను ఆదుకున్న లలితను రాగిణి మరిచిపోలేదు. భగవంతుడి దయ వల్ల ఆ నికృష్టదశలోనుండి తను బయటపడింది! ఇప్పుడు లలితకే తను సహాయం చెయ్యగలిగే దశలో ఉంది. తను తలుచుకుంటే లలిత తమ్ముడికి ఉద్యోగం ఇప్పించగలదు. లలిత కూడా ఇంకా మంచి ఉద్యోగంలోకి వచ్చేలా చెయ్యగలదు. ఆర్థికంగా కూడా లలితకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉంది. కానీ లలితకు తన సహాయం అక్కర్లేదు. లలిత ధర్మ పన్నాలు చెపుతూ తనను అసహ్యించుకున్నా, తన సామాన్యమైన ధోరణిగా రాగిణి అర్థం చేసుకోగలిగేది! కాని లలితకళ్ళలో తనమీద జాలి! ఎందుకా జాలి? తనకంటే లలిత ఏం బావుకుంటోందని ఆ జాలి! ఆ నాడు రాజు ముందు లలిత ముఖం ఎలా అయిపోయింది? ఆ సౌభాగ్యానికేనా, తనను చూసి జాలిపడటం?

కానీ, మాధవరావు? తనను చూసి కూడా నిర్లక్ష్యం చేసి లలితతో వెళ్ళిపోయాడు! సినిమాహాల్లో లలితను పసిపాపను బుజ్జగించినట్లు అనున యిస్తూ తనను చూసి ముఖం చిట్లించుకున్నాడు.

లలిత మాధవరావును ప్రేమిస్తోందా? మాధవరావుకు పెళ్ళయి పోయింది. పెళ్ళయిన మాధవరావును ప్రేమించే లలిత నైతికంగామాత్రం తనకంటే ఏం ఎక్కువ?

తనను నిర్లక్ష్యం చేసి లలితతో వెళ్ళిపోయిన మాధవరావు లలితను నిర్లక్ష్యం చేసి తనతో రావాలి! అప్పుడు లలిత... అఫ్‌కోర్స్ లలితంటే తనకేం కోపంలేదు! లలితకేసహాయం చెయ్యాలన్నా తను సిద్ధమే!

అవును! లలిత తనను చూసి జాలిపడకూడదు! తనే జాలిపడి సహాయం చెయ్యాలి! ఏం చెయ్యమన్నా చేస్తుంది!

ఎదుటి వ్యక్తి నిలువునా పులకించేలా చిలిపిగా నవ్వింది రాగిణి తెల్లబోయిచూసాడు మాధవరావు. ఆ చూపులతో ధైర్యం తెచ్చుకున్న రాగిణి తనే ఒక కుర్చీ దగ్గరకిలాక్కుని కూర్చుంది.

''ఏం పనిమీద వచ్చారు?''

మారిపోయిన మాధవరావు ముఖమూ, అతని కంఠమూ, రాగిణిలో ఎన్నడూ ఎరగని బెదురును కలిగిస్తున్నాయి.

''పని లేకుండా రాకూడదా?''

గారాబాలుపోతూ అంది రాగిణి. రాగిణి ముఖంలోకి చూసి పకా లున నవ్వాడు మాధవరావు.

మాధవరావులాంటి వ్యక్తులను అంతవరకూ కలుసుకోలేదు రాగిణి అతని సమక్షంలో మనసెందుకో గడగడవణికిపోతోంది. తన ధోరణి తను సాగించటానికి చాలా శ్రమ పడవలసివస్తోంది.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"ఆయుధాలను ఎదుటి వ్యక్తులమీద ప్రయోగించటానికే ఉపయోగించుకుంటారు. ఆత్మహత్య చేసుకోవటానికి కాదు! మీ కింతమాత్రం కూడా తెలియదేమా అని నవ్వొచ్చింది!"

రాగిణి తెలివి తక్కువది కాదు! మాధవరావు మాటలకు ఆవిడ ముఖం తెల్లగా పాలిపోయింది క్షణాలలో కూడ దీసుకుని తనూ మాధవరావును చూసి విరగబడి నవ్వింది.

'ఎందుకు నవ్వుతున్నార'ని మాధవరావు అడగలేదు. అడగక పోయినా రాగిణి చెప్పింది. కావాలని తెచ్చుకుని కృత్రిమంగా నవ్వుతూ.

"మీ అమాయకత్వం చూస్తోంటే నాకు నవ్వొస్తోంది. తెలియక పోతే సరి, పామును కూడా పూలమాలలా మెళ్ళో వేసుకోవచ్చు."

అప్పటికీ రాగిణి మాటల్లో పెద్ద కుతూహలం ప్రకటించలేదు మాధవరావు.

యధాలాపంగా "నీకేమైనా తెలిస్తే చెప్పరాదూ!" అన్నాడు.

"మిమ్మల్ని లలితతో సినిమాహాల్లో చూసాను నేను!"

కవ్విస్తున్నట్లున్న ఆ ధోరణికి నిటారుగా కూర్చున్నాడు మాధవరావు.

"అయితే?"

"ఏం లేదు! లలితతో నిశ్చింతగా సినిమాకు వెళ్ళగలిగిన, మీరు నన్ను చూసి నిష్కారణంగా ఉలికిపడుతుంటే నవ్వురాదూ?"

"ఎంత సాహసం! లలితతో నిన్ను పోల్చుకుంటున్నావా?"

ఈ మాటలు చాలా లోతుగా తగిలాయి రాగిణికి. తన బెదురు, సంకోచమూ వయ్యారాలూ, విలాసాలూ అన్నీ మరిచిపోయింది. నాగినిలాగ తలపైకెత్తి "ఏదీ లలిత నాకంటె దేనిలో ఎక్కువ?" అంది.

"ఎన్నిరకాల రంగులు పులుముకున్నా, ఎన్ని విధాలుగా నగిషీలు చెక్కుకున్నా. కాగితం పువ్వు సహజసుగంధాలు విరజిమ్మే గులాబికి సాటిరాదు!"

"ఓహో! అయితే ఆ "సహజసుగంధాలు" మీదాకా ఎంతవరకూ వచ్చాయి? ఆవిడ రాజుకి ప్రియురాలని మీకు తెలుసునా? మీరు ఆవిడని నమ్మి నన్ను గురించిచెప్పిన రహస్యం రాజుకి చెప్పేసి రాజుని కాపాడటానికి ప్రయత్నించిందని తెలుసునా? నేను నా చాకచక్యంతో రాజుని నమ్మించి కార్యం సాధించానని తెలుసునా?"

నిర్ఘాంతపోయాడు మాధవరావు ఆ ముఖం చూస్తూ కసిగా నవ్వుకుంది రాగిణి.

"వెళ్తాను. దయ ఉంచండి! ఈ కాగితం పువ్వుతో... ఈ మర బొమ్మతో... ఈ ఆయుధంతో ఏదైనా పని పడినప్పుడు కబురు చెయ్యండి."

వెళ్ళిపోతున్న రాగిణి కళ్ళలో నీళ్ళు విచిత్రంగా కదిలించాయి మాధవరావుని... రాగిణి విలాసాలూ, చిరునవ్వులూ, వయ్యారాలూ చూసి చీదరించుకున్నాడు. నవ్వుకో గలిగాడు. కానీ ఆ రెండు కన్నీటి బొట్లు చూసేసరికి మనసు కరిగిపోయింది.

రాగిణి మాటలు నిజమేనా? కావచ్చు! ఆనాడు తాను చెప్పిన విషయం వినగానే లలిత ముఖంలో వచ్చిన మార్పు... ఆ మార్పుకి కారణం. రాగిణి స్నేహితురాలు కావటం, అనుకున్నాడు!

మనసంతా చాలా చికాగ్గా అయిపోయింది. అంత చికాకుపడవలసిన అవసరమే వొచ్చింది? రహస్యం బయటపడటం పొరపాటే అయినా, దానివల్ల ఏ ప్రమాదమూ జరగలేదు. ఆరోజు, మాటల సందర్భం అలా రాబట్టి ఆ మాత్రం నోరు జారాడు. ఇకముందు లలిత విషయంలో మరింత జాగ్రత్తగా ఉండచ్చు. కాకపోతే తను ఎంతో ఉన్నతురాలని భావించిన లలిత ఇలా ప్రవర్తించటం కష్టంగా ఉండచ్చు. అందుకు లలితమీద అసహ్యం కలగాలి! మనసెందుకిలా మధనపడాలి? లలిత రాజుకు ప్రియురాలని తెలియటమే యీ అశాంతికి ఓ కారణమా? గుండె గుభిల్లుమంది మాధవరావుకి! తన ఆలోచనను తనే అసహ్యించుకున్నాడు

అద్దంముందు కూచుని అలంకరించుకొంటూన్న మణిమాల అద్దంలో మాధవరావు ప్రతిబింబాన్ని చూసి నవ్వింది. ఆ నవ్వు చాలా కొత్తగా గమ్మత్తుగా కనిపించింది మాధవరావుకి. అందులో ఆనందమెంత ఉందో విషాదమంత ఉంది. దుఃఖాన్ని అణచుకుని ఆ దుఃఖంలోనే ఏదో ఆనందం అనుభవిస్తున్నట్లుగా ఉంది.

"నీకొక గుడ్ న్యూస్!" అంది మణిమాల అలా నవ్వుతూనే.

"చెప్పు..."

"లలిత నిన్ను ప్రేమిస్తోంది!"

బొమ్మలా నిలబడిపోయాడు మాధవరావు ఒక్క క్షణం! కోపంగా "మణీ! మతి ఉండి మాట్లాడుతున్నావా? నన్ను నువ్వు అనుమానిస్తున్నావని భ్రమపడమంటావా?" అన్నాడు.

"లేదు మాధవ్! అలాంటి భ్రమలేమీ పడక్కర్లేదు. నేను చెప్తున్నది నీ విషయం కాదు! లలిత విషయం! లలిత ప్రేమిస్తోంది నిన్ను!"

"అలాగా! ఎలా గ్రహించావు? వీణ వాయించిందనా? మనతో కలిసి నువ్వు బలవంతం చేస్తే పిక్నిక్‌కి వచ్చిందనా?" వెటకారంగా అడిగాడు మాధవ్.

"అవేవీ కాదు మాధవ్! ఇలాంటి వాటికంటె చాలా బలమైన ఆధారంతోనే గ్రహించాను. డాక్టర్ వినోద్ దగ్గరకు నన్ను వెళ్ళద్దని బ్రతిమాలింది. నీకింత అశాంతి కలిగించటం న్యాయంకాదని పోట్లాడింది. ఎలాగైనా మనిద్దరం సుఖంగా ఉండటంకంటె తనకు కావలసింది లేదంది. కోపంతో, ఉద్రేకంతో, నేను కొట్టిన చెంపదెబ్బని కూడా భరించి 'మీ కర్ధంకావటం లేదు. ఇలాంటి వినోద్‌లు లక్షమంది జతగూడినా మాధవరావుగారితో సరికారు!' అంది! ఇప్పుడు చెప్పు! లలిత నిన్ను ప్రేమించటంలేదూ?"

నవ్వుతోన్న మణిమాల చూపులనుండి తన చూపులు తప్పించుకున్నాడు మాధవరావు.

13

లలితను చూచి చవటనవ్వు నవ్వాడు రాజు. అతని నవ్వులో అంత చవటతనం చూడటం లలిత కది రెండవసారి. మొదటిసారి రాగిణితో కలిసి తన నెదుర్కొన్నప్పుడు నవ్వాడు అలా. ఆనాడు ఆ చవటతనంతో పాటు ఏదో దర్పమూ, అహంకారమూ కూడా ఉన్నాయి. ఈ నాడు ఎంతో దైన్యం ఉంది.

ఎన్నో రోజుల తర్వాత పని కట్టుకుని లలిత ఇంటి కొచ్చాడు రాజు. మనిషి చిక్కిపోయాడు. ముఖం కాస్త కళతప్పింది. అతణ్ని చూస్తోంటే ఏ వికారమూ కలగలేదు లలితకి! "కూచో రాజూ!" అంది మామూలుగా.

లలిత ఇంత మామూలుగా మాట్లాడేసరికి తబ్బిబ్బయ్యాడు రాజు. లలిత తన పైన కోపగించుకుని తిడితేనే అతనికి బాగుండేది.

"నిన్ను చూట్టానికి నాకు ముఖం చెల్లడంలేదు లలితా!" నిజంగానే వంచిన తల ఎత్తలేక అన్నాడు రాజు.

"ఫరవాలేదు! అంత కాని పని నువ్వేంచేసావు? జీవితంలో ఇంకా ఇంకా పైకి పోవాలనుకోవటం సహజమే!"

తలఎత్తి లలిత ముఖంలోకి చూసాడు రాజు. ఆ ముఖంలో ఏకోశానా కోపపు ఛాయలులేవు ఆ మాటల్లో నిష్ఠూరమూ లేదు. అతిశాంతంగా, అతి మామూలుగా ఉంది. రాజు నీరయిపోయాడు. ఇక తనేం మాట్లాడీ లాభంలేదని అర్ధమవుతోనే ఉంది. అయినా లలిత మంచిది.

"నన్ను క్షమించు లలితా!"

"నువ్వు తప్పు చేసావని నే ననుకోవటం లేదు రాజా దేనికి

క్షమించను?"

"నువ్వు నాకు సాయం చెయ్యాలని వచ్చావు కానీ, నేను..."

"నేను నీకు సాయం చెయ్యలేకపోయినా, నువ్వు నాకు చాలా సాయం చేసావు."

"నేను నీకు సాయం చేసానా?"

"అవును రాజూ! నువ్వు చిక్కుకుపోయిన ఊబిలోంచి నిన్ను కాపాడలేకపోయాను. కానీ, నేను చిక్కుకున్న ఊబిలోంచి నువ్వు నన్ను కాపాడావు!"

రాజు తెలివి తక్కువవాడు కాదు. లలిత ముఖం చూసి నప్పటి నుండీ ఆశలు నిలుపుకోలేకపోతున్న రాజు మనసు ఈ మాటలతో పూర్తిగా నిరాశతో నిండిపోయింది. అయినా తన ప్రయత్నం మానుకో దలచుకోలేదు. ప్రస్తుతం అతనికున్న ఆధారం లలిత మాత్రమే! ఆ మాటే అన్నాడు మరో రకంగా. "నాకీ లోకంలో ఎవరూ నీకంటె ఎక్కువ కాదు లలితా! ఆ విషయం చాలా ఆలస్యంగా అర్థం చేసుకున్నాను."

లలిత నవ్వింది. "ఫరవాలేదు రాజూ! రోజురోజుకీ మనం మారుతూ ఉంటాం! మనతోపాటు మన అభిప్రాయలూ మారుతూ ఉంటాయి. ఈ రోజు ఈ అభిప్రాయానికివచ్చావు. రేపు ఏ అభిప్రాయానికొస్తావో?"

"లేదు! లేదు! లలితా! ఇంక ఈ జన్మలో ఈ అభిప్రాయం మారదు. నువ్వు 'ఊ' అంటే ఈ క్షణంలో నిన్ను పెళ్ళిచేసుకుంటాను."

"నీ అభిప్రాయాలు మారకపోవచ్చు రాజూ! నా అభిప్రాయాలు మారచ్చుగా! నేనూ నీలాంటి మనిషినే!"

ఇలాంటి సమాధాన మేదో వినవలసివస్తుందనే భయపడుతున్న రాజు చటుక్కున లలిత రెండుచేతులూ పట్టుకున్నాడు.

"ప్లీజ్! లలితా! నన్ను అర్థంచేసుకో! నిన్ను నిజంగా ప్రేమించాను కానీ...కానీ." రాజుకి మాటలు దొరకటంలేదు. అతని ముఖంలో దైన్యమూ, మాటలలో ఆరాటమూ, లలితకు జాలిని కలిగిస్తున్నాయి, ఒక విధమైన కంపరాన్నీ కలిగిస్తున్నాయి.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే రాజు అభ్యర్థనని అంగీకరించటమే మేలు! రాజుని పెళ్ళిచేసుకోకంటే, తన కిప్పుడు పెళ్ళి చెయ్యటానికి తలిదండ్రులు సిద్ధంగాలేరు. పెళ్ళికాకుండా ఒంటరిగా ....

ఆలోచనల మధ్య మరొకరూపం లలిత మనసుమీద దాడిచేసింది. కాని దానికి స్పష్టమైన ఆకృతి లేకుండానే తరిమేసింది లలిత.

"ఏం రాజూ! ఇప్పుడెలాగూ పెద్దపెద్ద ఆఫీసర్లు తమ కూతుళ్ళ నిస్తామని రారు కనుక నన్ను చేసుకుంటానంటున్నావా?"

ఈ మాటలతో రాజు ఊపిరితీసుకున్నాడు. స్థిమితంగా కూచున్నాడు.

"అదేమిటి లలితా! ఇప్పుడు నేను ఐ. ఎ. ఎస్. ఆఫీసర్ని కానా?"

"అవున సస్పెన్షన్‌లోఉన్న ఆఫీసర్‌వి!"

"నేరం లేదని రుజువయితే సస్పెన్షన్ కేన్సిలవుతుంది!"

"కావాలిగా!"

"అవుతుంది, నువ్వు ప్రయత్నిస్తే."

"నేనా? అతి సామాన్యురాలిని. నావల్ల ఏమవుతుంది?"

"నువ్వు మాధవరావుగారికి చెప్తే, మాధవరావుగారు ఏమైనా చెయ్యగలరు."

లలితకు తల గిర్రున తిరిగిపోయింది. ఇదా సంగతి! ఇందుకా, రాజు తన దగ్గరకు వచ్చింది?

"నీకు కావలసింది అదే అయితే, నువ్వు రావలసింది నా దగ్గరకు కాదు రాజూ! ఇలాంటి పనులకి నేను పనికిరాను!"

"ప్లీజ్ లలితా! నా కోసం... కాదు! మనకోసం..."

లలితకు మండిపోసాగింది.

"ఎవరికోసమైనా నావల్ల ఏమవుతుంది రాజూ! ఇలాంటి పనులు సాధించటానికి కావలసిన 36"-28"-36" లక్షణాలు నాకు లేవు."

"అది కాదు లలితా! మాధవరావుగారికి నీమీద ప్రేమ! నీ మాట కాదనరు!"

"మాధవరావుగారికి నామీద ప్రేమా? నాకే తెలియని ఈ విషయం నీకెలా తెలుసు రాజూ!"

"సారీ లలితా! నేను ఏ ఒక్క దురుద్దేశంతో అనలేదు. ఎంతో ఆత్మీయులతో కాని పోలీస్ ఆఫీసర్లు ఇలాంటి రహస్యాలు చెప్పరు. అందుకని." లలితముఖం నల్లబడిపోయింది. మనసు విపరీతంగా బాధపడింది.

"ఆత్మీయురాలి ననుకొని ఆయన నాకా రహస్యం చెప్పలేదు. నేను ఆత్మగౌరవం గలిగిన దాన్నని భ్రమపడ్డారు. నా అభిమానం నిలబెట్టడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంలో ఒక అపార్థాన్ని తొలగించటానికి ఈ విషయం చెప్పారు. బలహీనురాలినై ఆయన నాకిచ్చిన విలువను నిలుపుకో లేకపోయాను. ఆయన స్వభావం నాకు తెలుసు. నా నిజ స్వరూపం తెలిస్తే నన్ను ఎంతైనా అసహ్యించుకుంటారు!"

ముడుచుకున్న లలిత ముఖాన్నీ, కళ్ళలో తిరుగుతున్న నీళ్ళనీ చూస్తోంటే రాజుకి చేదు మింగుతున్నట్లుగా ఉంది. తెలియకుండానే ఏదో అక్కసు కలిగింది.

"ఆ మాధవరావుకి మణిమాలమీద చాలా ప్రేమ. ఆవిడ ఎలాంటి

దైనా ఆవిడను వొదిలిపెట్టడు. ప్రేమమాట ఎలాఉన్నా పరువు ప్రతిష్ట లను వదులుకోడు. మాధవరావు నిన్ను పెళ్ళిచేసుకోడు!''

ఉలికిపడి విచిత్రంగా రాజు ముఖంలోకి చూసింది లలిత! ఏమిటిది? రాజు కింకా తనమీద...ఆలోచించదలచుకోలేదు లలిత.

“రాజూ వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపో'' కఠినంగా అంది లలిత. ఒక చవటనవ్వు నవ్వి అక్కడనుంచి వచ్చెయ్యటం తప్ప గత్యంతరం లేక పోయింది రాజుకి.

ఎలాగైనా తను నిర్దోషినని రుజువు చేసుకోవాలి! ఎలా? ఆలోచించి ఆలోచించి, మాధవరావుగారి దగ్గరకే బయలుదేరాడు రాజు.

రాజుని చూసి ముఖం చిట్లించుకున్నాడు మాధవరావు. కూర్చోమని కూడా అనలేదు. మాధవరావు తనే కూచున్నాడు.

“లలిత మీ దగ్గరకు వెళ్ళమంది. అందుకే ధైర్యంగా వచ్చాను.'' అన్నాడు.

ఉలికి పడ్డాడు మాధవరావు.

“లలిత...లలిత పంపించిందా, మిమ్మల్ని నా దగ్గరకి?''

మాధవరావు ఆశ్చర్యానికి పరమానందం అనుభవించాడు రాజు. తన చేస్తున్న అన్యాయమేమిలేదు అన్నీ నిజాలే చెప్తున్నాడు. నిజాలు కావా?

“అవును. లలిత వెళ్ళమంది. 'మాధవరావుగారు న్యాయస్వరూపులు. న్యాయాన్ని తప్పకుండా కాపాడతారు!' అంది.''

మాధవరావు ముఖం కొద్దిగా మెత్తబడింది.

“ఈ న్యాయా న్యాయాలు ఎవరు నిర్ణయించగలరు? అన్యాయమని రుజువయ్యేవరకు అంతా న్యాయమే!''

“నేను సిన్సియర్ గా చెపుతున్నాను సార్! నేను ఏతప్పూ చెయ్యలేదు. ఇప్పుడాలోచిస్తే ఇదంతా ముందునుంచీ పెద్ద ట్రేప్ అనిపిస్తోంది.''

మాధవరావు కుతూహలంగా ముందుకు వంగాడు.

“బాపినీడుగారికీ, రాగిణికీ ఉన్న కాంటేక్ట్స్ బట్టి ఇందులో బాపినీడుగారి జోక్యం ఉందనిపిస్తోంది. ఆయనకు అన్ని విషయాలూ తెలిసి ఉండచ్చు.''

అదిరిపడ్డాడు మాధవరావు.

“బాపినీడు గారెవరో, తెలిసే మాట్లాడుతున్నారా మీరు?''

“తెలిసే మాట్లాడుతున్నాను సార్! మీరూ ఆలోచించండి!అలాంటి వాళ్ళే ఇలాంటివి అవలీలగా సాధించగలరు!''

“ఒకవేళ మీరన్నమాట నిజమే అయినా, ఆయన్ని టేకిల్ చెయ్యటం సామాన్య విషయంకాదు.''

"మీరే అలా అంటే ఇక న్యాయానికి నిలువ నీడ ఎక్కడ సార్?"

"న్యాయం గురించి మాట్లాడుతున్నారు? రాగిణితో మీకేమిటి స్నేహం?"

రాజు తలవంచుకున్నాడు. గొణుగుతున్నట్లు అన్నాడు.

"ఆఫ్ కోర్స్ అయామ్ వీక్ సర్! రాగిణి ఏదో నా ఆఫీసర్ హోదా చూసి వస్తోందనుకుని చాపల్యానికి లొంగిపోయాను. అంతే సర్! అంతకు మించి ఏమీ లేదు."

"సరే వెళ్ళండి చూద్దాం!"

ఆ మాత్రమే మహాభాగ్య మనుకుని వెళ్ళిపోయాడు రాజు 'థేంక్యూ లలితా!' అనుకున్నాడు మనసులో.

లలిత వ్యక్తిత్వం, ఆమెలోని నిజాయితీ మాధవరావుపై ఎంతో ప్రభావం చూపాయి రాజు వ్యవహారంలో ఆమె పరిస్థితిపై జాలికలిగింది.

'నీకోసం తప్పకుండా రాజుకి సాయం చేస్తాను లలితా!' అనుకున్నాడు మనసులో.

14

ఏది తమకందదో దానిమీదే ఆశలు పెంచుకోవటం మానవ స్వభావం కాబోలు! రాగిణి ఎంత ప్రయత్నించినా మాధవరావును మరిచిపోలేక పోతోంది! మాధవరావులో రాగిణి ఏం చూసింది? అన్నదానికి సమాధానం లేదు. అసలెవరిలోనైనా ఏమైనా చూడటానికి రాగిణి ఎన్నడూ ప్రయత్నించలేదు. తనను తిరస్కరించిన మాధవరావులో ఏదైనా విశిష్టత రాగిణి మనసుమీద ఆమెకు తెలియకుండానే ముద్ర వేసిందేమో! ఈ రకంగా తిరస్కరింపబడటం కూడా రాగిణికి మొదటి అనుభవం. బాధాకరమైన వింత అనుభవం సాధారణంగా శ్యామలాంబగారు బాపినీడుగారి దగ్గరకు పంపించటం. బాపినీడుగారు మరొకరి దగ్గరకు పంపించటం శాయశక్తులా ఆ వ్యక్తిని ఎవరనే ఆలోచన కూడా లేకుండా అలరించటం బాపినీడుగారిచ్చిన బహుమతులందుకుని సంతోషంగా తిరిగిరావటం. ఇదే అలవాటు రాగిణికి. తనంత తానుగా ఏనాడూ ఎవరికీ దగ్గరకావాలని ప్రయత్నించలేదు. అలా ప్రయత్నించిన నాడు ఆ వ్యక్తి తనను తిరస్కరిస్తాడనేది ఊహకందనిది!

రాగిణి మాధవరావు గురించి ఊహిస్తున్న సమయంలోనే మాధవరావు దగ్గరనుండి రాగిణిని రమ్మని కబురు వచ్చింది. ఆ కబురు వచ్చినందుకే ఆశ్చర్యపోతున్న శ్యామలాంబ రాగిణి ఉత్సాహంగా బయలుదేరటం చూసి మరింత ఆశ్చర్యపోయింది. సాధారణంగా ఆ సమాజంలో పిల్లలు డబ్బు పేరు చెపితే తప్ప ఉత్సాహం చూపించరు. పోలీస్ ఆఫీసర్ల పేరు వింటేనే

భయపడతారు. విధిలేనప్పుడు తప్ప వాళ్ళ దగ్గరకి వెళ్ళటానికి ఒప్పుకోరు. బయలుదేరబోతున్న రాగిణి దగ్గరకు వచ్చి "మాధవరావుగారు నిన్నెందుకు పిలిపించారో తెలుసా?" అంది శ్యామలాంబ.

రాగిణి తనకు అలవాటైన ధోరణిలో చిలిపిగా నవ్వి "ఎవరైనా నన్నెందుకు పిలిపిస్తారు?" అంది.

శ్యామలాంబ ముఖం చిట్లించి "మాధవరావుగారు అలాంటి వ్యక్తి కాదని విన్నాను. జాగ్రత్తగా ఉండు." అంది హెచ్చరిస్తున్నట్లు.

రాగిణి ముఖం చిన్నబోయింది.

మాధవరావు తన ప్రైవేట్ రూంలోకి రాగిణిని చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"మీకు బాపినీడుగారు ఎంత కాలంగా తెలుసు?" రాగిణి పూర్తిగా కూర్చోకుండానే అడిగాడు మాధవరావు

ఆ ప్రశ్న వింటూనే "అమ్మో!" అనుకుంది రాగిణి. అలాంటి ప్రశ్నలకు సమాధానా లియ్యకూడదని రాగిణికి తెలుసు. వాళ్ళ శిక్షణలో అదొక భాగం. పకపక నవ్వింది రాగిణి.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"నేను లలిత ననుకున్నారా? మోహించిన వాళ్ళతో రహస్యాలన్నీ చెప్పెయ్యటానికి!"

రాగిణి ముఖంలోకి చూసి చిన్నగా నవ్వాడు మాధవరావు.

ఆ నవ్వు రాగిణిని ఇరిటేట్ చేసింది. అప్పుడప్పుడూ లలిత కూడా ఇలాగే నవ్వుతుంది.

"అయితే, నాకు చెప్పరు కాని, రహస్యా లున్నాయన్న మాట!" హాస్యంగా అన్నాడు మాధవ్ "ఓ బోలెడన్ని రహస్యాలు! కమ్మని... తీయని రహస్యాలు! ఎవరికీ చెప్పకూడని రహస్యాలు!" అంది నవ్వుతూ.

'తెలివైనది' అనుకున్నాడు మాధవరావు. ఈ 'తెలివి'లోను ఎన్నెన్ని రకాలు?

"పోనీ, మనం వ్యాపార సరళిలోనే మాట్లాడుకుందాం! నా ప్రశ్నలకు సమాధానం చెప్పినందుకు మీకెంత చెల్లించుకోవాలి?"

కలుక్కుమంది రాగిణికి. ఈ మాధవరావు తనలో కలిగిస్తూన్న భావాలన్నీ తనకు కొత్తవే!

"నా వ్యాపారం రహస్యాలమ్ముకునే వ్యాపారం కాదు" అంది.

నీళ్ళు నిండిన కళ్ళతో ప్రతిఫలించే ఏదో వ్యథను విస్తుపోయి చూసాడు మాధవరావు. మొదటిసారిగా రాగిణిమీద జాలి కలిగింది.

"గుడ్! నాకు కావలసింది సాధించలేకపోయినా మీరంటే

గౌరవం కలుగుతోంది. పోలీస్ ఆఫీసర్‌గా ఇలాంటి నిబ్బరాన్ని మెచ్చుకోకుండా ఉండలేను...”

ఇంక వెళ్ళి రావచ్చు అనే ధోరణిలో మాట్లాడాడు.

రాగిణికేదో నీరసం ఆవహించినట్లయింది. ప్రయత్నించినా కూర్చున్న చోటినుండి లేవలేకపోయింది.

“మీరు నాకోసం కబురు చేసారనగానే ఎంతో ఆశపడ్డాను...” మాధవరావు కనుబొమలు ఒక్కసారి ఆశ్చర్యంగా పైకిలేచి అంతలో క్రిందకు వాలిపోయాయి. ఏమీ అడగలేదు.

“నాలో అందం ఒక్కటే కాదు. నేను మొగవాడికి చాలా చాలా ఇవ్వగలను.”

పూర్తిగా దిగజారిన రాగిణి పైకి నిలబడే ప్రయత్నంలో గర్వంగా అంది.

“అవును! ఎన్నెన్నో ఇవ్వగలరు. ఆనందం తప్ప ..”

“ఏమంటున్నారు? ఒక్కసారి నాతో ఆనందించిన వాళ్ళని అడిగితే...”

“అడగక్కర్లేదు, నాకు తెలుసు. వాళ్ళకు, మీకు కూడా ఆనంద మంటే ఏమిటో తెలియదు. అంచేత ఆనందం ఇచ్చానని మీరు, పుచ్చుకున్నామని వాళ్ళూ భ్రమపడుతున్నారు!”

రెండు కళ్ళు పెద్దవిచేసి చూసింది రాగిణి. “అయితే మీరు చెప్పండి! ఆనందమంటే ఏమిటో ..”

“అలా మాటల్లో చెప్పేదికాదు కనుకనే చాలామందికి తెలియదని అనగలిగాను. నిజమైన అనుభూతులేవీ ఏవేవో సూత్రాలకు లొంగి ఉండవు. యాంత్రికంగా లెక్కవేసి చెప్పే స్థాయిలో అసలుండవు. మీరు ఎన్నో నేర్చుకోగలరు! ఎంతో ప్రదర్శించగలరు! కానీ మనసుని తాకే ప్రేమ ఎక్కడ సంపాదించగలరు? అది అక్కడా ఇక్కడా దొరికేది కాదు. ప్రయత్నించి పుట్టించుకునేది కాదు. నా ఉద్దేశంలో సృష్టికి మూలమైన ఆనందానికి ఆధారం ప్రేమ మాత్రమే. అదొక్కటి చాలు! కష్టపడి నేర్చుకున్న అన్ని చాతుర్యాలనూ మించిన కళలతో జీవింప చెయ్యటానికి...”

తనను తను మరిచి మాట్లాడుతోన్న మాధవరావు కళ్ళ వెలుగుల మీదనుండి దృష్టి మళ్ళించుకోలేకపోయింది రాగిణి “నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.” అనేసింది.

పకాలున నవ్వాడు మాధవరావు.

“మీకు ప్రేమంటే ఏమిటో తెలియదనటానికి ఇంతకంటె పెద్ద నిదర్శనం అక్కర్లేదు!”

భరించలేకపోయింది రాగిణి.

"నాకు ప్రేమంటే ఎందుకు తెలియదు? తెలుసు! ప్రేమంటే మీ మణిమాల డాక్టర్ వినోద్ మీద చూపుతున్నది!!"

పట్టరాని కోపంతో వణికిపోయాడు మాధవరావు. లేచి వచ్చి రాగిణి రెండు చెంపలూ టపటప వాయించాడు.

రాగిణి కళ్ళలోంచి కన్నీరు జలపాతంలా ఉబికింది.

"అయాం సారీ!" అన్నాడు చేతిని నుదుటిమీద పెట్టుకొని.

"ఎందుకు సారీ చెప్పటం? మణిమాల మీ భార్య. ఆవిడని మేం ఏమీ అనకూడదు. అంటే మీరు భరించలేరు. కానీ మమ్మల్ని మాత్రం మీరు ఎన్నైనా అనగలరు. అతి సునాయాసంగా అనగలరు. చిరునవ్వుతో అనగలరు!"

ఏడుస్తూనే వెళ్ళిపోయింది రాగిణి.

చాలా సేపటివరకూ రాగిణి మాటల తాకిడినుంచి తప్పించుకోలేక పోయాడు మాధవరావు.

సేవాసదనం బ్రోతల్ లాంటిది కాదు. అక్కడివాళ్ళు ఎప్పుడైనా వెళ్ళిపోవచ్చు. కానీ వెళ్ళరు. అంత "హైక్లాస్" జీవితాని కలవాటు పడినవాళ్ళు బయటికొచ్చి మామూలుగా బ్రతకలేరు.

"నేను పెళ్ళిచేసుకుంటాను."అంది రాగిణి శ్యామలాంబతో. నివ్వెర పోయిన శ్యామలాంబ తన భావాలను లోపల అణచుకుంది.

రాగిణిలో ఏదో మార్పు వచ్చిందని అర్థమయింది శ్యామలాంబకి. 'ఈ విషయం బాపినీడుతో ఆలోచించాలి' అనుకుంది.

"అలాగే! చేసుకో! నీ కోరికలకు వేటికి అభ్యంతరపెట్టాను?" అంది. అని రాగిణి ముఖంలోకి పరిశీలనగా చూసింది. రాగిణి ముఖంలో విశ్వాసం కనిపించలేదు. ఒక్క నిట్టూర్పు వదిలింది. అంతే!

శ్యామలాంబ ద్వారా విషయం విన్న బాపినీడు ఆలోచనలో పడ్డాడు.

"రాగిణిని బయటకు పోనియ్యటం మంచిదేనా?"

"మంచిదికాదు. కానీ బలవంతపెట్టటం అంతకంటే మంచిదికాదు."

"మన రహస్యాలు రాగిణికి తెలుసనుకుంటున్నావా?"

"వివరంగా తెలియవు. కానీ రాజు వ్యవహారంలో మనం తనను ఎలా ఉపయోగించుకున్నామో తెలుసు. అదీగాక తనను అక్కడికీ, ఇక్కడికీ పంపిస్తున్నది మనమేనని స్రమాణంగా బయటపడినా చాలు!"

"అదంతా రుజువు కావటం కష్టంలే!"

"అనుమానం మాత్రం ఎందుకు కలిగించాలి?"

బాపినీడు ఆలోచనలో పడ్డాడు.

"రాగిణితో చెప్పు. రాగిణిని నేనే పెళ్ళిచేసుకుంటాను"

శ్యామలాంబ ఆశ్చర్యపోయింది. "మీరా" అంది.

"ఏం? ఇద్దరు పెళ్ళాల్ని పోషించలేనా?"

"కానీ, రాగిణి పెళ్ళయ్యాక ఇలాంటి పనులకు ఒప్పుకోకపోవచ్చు."

"సరేలే! అది కాకపోతే, దాన్ని తలదన్నిన వాళ్ళు మరొకళ్ళు. అందుకేం కాదు."

శ్యామలాంబ ద్వారా విషయం విన్న రాగిణి శ్యామలాంబకంటె ఎక్కువ ఆశ్చర్యపోయింది. మనసు పనిచెయ్యలేదు. సంతోషం కలగలేదు. కాదనటానికి నోరురాలేదు.

బాపినీడుగారితో సేవాసదనంలోనే రాగిణికి పెళ్ళయిపోయింది.

అందరూ "ఎంత అదృష్టవంతురాలివి" అని ఒకటికి పదిసార్లంటే 'కాబోలు!' అనుకుంది.

తనను చూసి మిగిలినవాళ్ళు ఈర్ష్యపడుతోంటే ఆ ఈర్ష్య చూసి గర్వపడింది.

బాపినీడు తనకోసం ప్రత్యేకించి ఏర్పాటుచేసిన బంగళాలోకి బాపినీడు భార్యగా ప్రవేశించింది.

ఎదురుగా ఫోన్ కనిపించింది.

వెంటనే మాధవరావు నంబర్ డయల్ చేసింది.

"హలో! మిసెస్ బాపినీడు స్పీకింగ్!"

"... ... ..."

"నాకు ఏం అక్కర్లేదు. ఎలా ఉన్నారో తెలుసుకుందామని. ఒక్కసారి మా ఇంటికి రండి. ఆనందనగర్ కాలనీలో 17వ నంబర్ ఇల్లు. ఇంటిముందు బాపినీడుగారి నేమ్ ప్లేట్ ఉంటుంది."

ఫోన్ పెట్టేసిన రాగిణిని ఆశ్చర్యంగా చూసాడు బాపినీడు. గర్వంగా నవ్వింది రాగిణి. ఆలోచించుకుంటూ నవ్వుకున్నాడు బాపినీడు.

15

రాగిణి మాధవరావుకు రెండు మూడుసార్లు ఫోన్ చేసింది. తన ఇంటికి రమ్మని. తనదే అయిన ఆ ఇల్లు, తన చీరలు, నగలు, బాపినీడు భార్యగా తనహోదా, అవన్నీ మాధవరావుకు చూపించాలని తహతహ.

మొదట కొంచెం సందేహించిన మాధవరావు రాగిణి ఆహ్వానాన్ని అంగీకరించాడు. అతనికి బాపినీడు బాగా తెలుసు. అలాంటి వ్యక్తి రాగిణిని పెళ్ళి చేసుకోవటం ఆశ్చర్యంగా ఉంది. బాపినీడు గురించిన వివరాలు తెలుసుకోవాలనీ ఉంది.

మాధవరావు తన ఇంటికి వస్తానని అనగానే రాగిణి సంతోషానికి

హద్దులులేవు. తనకున్న చీరల్లో మంచి చీరకట్టుకుంది. బోలెడు నగలుపెట్టుకుంది. సన్నని నడుముమీద మువ్వల వడ్డాణంపెట్టుకుంది. కాళ్ళకు గజ్జెల పట్టీలుపెట్టుకుంది. ఫలహారాలు సిద్ధంచేసింది. ఒక విధమైన ఆరాటంతో మాధవరావు రాకకోసం ఎదురుచూస్తూ కూచుంది.

సరిగ్గా వస్తానన్న టైంకే వచ్చాడు మాధవరావు. విశాలమైన ఆ ఇంటినీ, ఇంట్లోఉన్న ఖరీదైన ఫర్నిచర్‌నీ మాధవరావు. పరిశీలనగా చూస్తుంటే గర్వంతో పొంగింది రాగిణి మనసు.

“కంగ్రాచ్యులేషన్స్, మిసెస్ బాపినీడుగారు!” చిరునవ్వుతో అన్నాడు మాధవరావు.

బాపినీడు భార్యగా తన గొప్ప ప్రకటించుకోవాలనే రాగిణి తాపత్రయమూను. అయినా మాధవరావు నోట ఆ కంగ్రాచ్యులేషన్స్ ఎందుకో వెక్కిరించినట్లు వినిపించాయి.

“ఇన్నాళ్ళు పెళ్ళిమీదకు మనసుపోలేదు. ఎందరెందరో చేసుకుంటామని వచ్చినా, చేసుకోనని అన్నాను. కానీ, ఎన్నాళ్ళని ఒంటరిగా ఉండగలను? బాపినీడుగారు చాలా మంచివారు. నన్ను బాగా అర్థం చేసుకుని పెళ్ళి చేసుకుంటానని అన్నారు. కాదన లేకపోయాను. ఎప్పటికైనా పెళ్ళి చేసుకుని స్థిరపడటమే మంచిదని అనుకున్నాను.”

“గుడ్ చాలా మంచిపని చేసారు. బాపినీడుగా రెక్కడ?”

“బాపినీడుగారికి లక్షపనులు. ఎప్పుడూ ఏ ఇంట్లోనూ స్థిరంగా ఉండరు. ఈ క్షణం ఇక్కడ, మరోక్షణం ఎక్కడో! కానీ ఒక్కరోజైనా నన్ను విడిచిపెట్టిఉండరు. ఏదో ఒక టైంలో తప్పకుండా వస్తారు.”

“అంటే, ఇప్పుడు రావచ్చా?”

“అహ! ఇప్పుడురారు. రేపటివరకూ రారు. ఏదో పనిమీద తిరుగుతున్నారు.”

“ఆయన లేనప్పుడెందు కాహ్వానించారు నన్ను?”

కావాలని చిలిపిగా అడిగాడు మాధవరావు. అతనికి రాగిణి ఏకాంతంలోనే తనను ఆహ్వానించిందని తెలుసు. అతడు కూడా బాపినీడు లేని సమయంలోనే రాగిణితో మాట్లాడాలనుకున్నాడు. అయినా రాగిణి లోతులు కనుక్కోవాలని అలా మాట్లాడాడు.

“భలేవారు! కావాలని ఆయన లేనప్పుడు పిలవలేదు. ఏవిటో అలా కుదిరింది. అసలు ఆయన కూడా ఉంటేనే బాగుండేది.”

రోషంగా అంది రాగిణి. సరిగా ఆ సమయానికే “ఎవరాయన? ఏం బాగుండేది?” అంటూ నవ్వుతూ ప్రవేశించాడు బాపినీడు.

గతుక్కుమంది రాగిణి. కొన్ని నిముషాలు ఆవిడ ముఖం రక్తం బొట్టు లేనంత తెల్లగా పాలిపోయింది. ఎంతో చతురురాలైన రాగిణి తనను

తాను కూడ దీసుకుని మామూలుగా ఉండటానికి విశ్వప్రయత్నం చెయ్యా వలసివచ్చింది.

తన మనోభావాలు దాచుకోవటానికి అలవాటుపడిన మాధవరావు మాత్రం తన ఆశ్చర్యాన్ని బయటపడనీయలేదు. చిరునవ్వుతో బాపినీడుని విష్ చేసాడు.

"మీ మాటే అనుకుంటున్నాం. మీకు నిండా నూరేళ్ళు ఆయుర్దాయం. మీరు కూడా ఉంటే బాగుండేదని."

'అహహ్హా' అని నవ్వాడు బాపినీడు. "నాకు నూరేళ్లు ఆయుర్దాయం ఎందుకండీ! బ్రతికి ఏం చెయ్యాలి?" అన్నాడు.

"అహ! అలా అనకండి. మీలాంటివాళ్ళు దేశానికి ఎంతో సేవ చేస్తున్నారు. ఇంకా చెయ్యాలి."

"మా దేముంది లెండి. చేస్తున్నది మీరు."

"ముందు మీరు చేస్తోంటే మీ వెనకాల మేమూ, మేం చెయ్యవలసింది చేస్తున్నాం."

కళ్ళు చిట్లించి చూడబోయిన బాపినీడు చేతికి చిరునవ్వుతో ఫలహారం పళ్లెం అందించి "తీసుకోండి!" అన్నాడు.

బాపినీడు చిరునవ్వుతో అందుకుని "మీరు కానీయండి!" అన్నాడు.

బాపినీడు, మాధవరావు ఇద్దరూ నామ మాత్రంగానే తిన్నారు. అప్పటికి రాగిణి కొంచెం కోలుకుంది. మామూలు వయ్యారాలు కురిపిస్తూ మాట కలిపింది.

"మాసారా! ప్రేమ ఉన్నచోట పిల్కిస్తే పలుకుతారు అని అంటారు. నేను మిమ్మల్ని తలుచుకున్నాను. మీరు వచ్చారు."

"ఇలా తలుచుకున్నప్పుడల్లా వస్తూనే ఉంటాను." గట్టిగా నవ్వుతూ అన్నాడు బాపినీడు. అందులో వెటకారం ఎవరికైనా స్పష్టంగా అర్ధమవుతుంది. ఎంత ప్రయత్నించినా నవ్వలేక పోయింది రాగిణి.

బాపినీడు మాధవరావుతో మాటలు మొదలుపెట్టాడు. "శ్యామలాంబగారు రాగిణికి పెళ్ళి చేసుకోవాలని ఉంది అని నాకు చెప్పారు. మొదట కొంచెం సందేహించినా చివరకు నేనే చేసుకుంటానని అన్నాను. స్త్రీకోసం కాదు. స్త్రీలు, అందాలు బోలెడు బజార్లో దొరుకుతాయి కుప్పలు తిప్పలుగా. ఇల్లు దిద్దుకోవటానికి ఒక ఆడదాని అవసరమూ లేదు నాకు. మా ఆవిడకే ఏమీ పని లేదు. ఎందరో పనిమనుష్యులున్నారు. కానీ, రాగిణి లాంటి యువతిని ఒక్కతెను కాపాడినా, ఒక మంచి పని చేసినట్లే ననిపించింది. ఏ ముందండీ, ఇలాంటి వాళ్ళ జీవితాలు. ఈనాడు సొగసు వయ్యారాలు గుమ్మరిస్తోంటే ఆనందించి ఏదో ఇంత ముఖాన్న పారేస్తారు. రేపు వయసు మళ్ళాక వీళ్ళకు విలువేమిటి? రూపం ఆధా

రంగా బ్రతికేవాళ్ళకు ఆ రూపం నశించగానే ఏం రక్షణ? ఈనాడు అవసరమయి ఉపయోగించుకున్నవాళ్ళే ఆనాడు ఛీ కొడతారు. అనాటిదాకా ఎందుకూ, ఇప్పుడే ఛీ కొడతారు పబ్లిక్‌లో ఎదురయితే! రాగిణిని పెళ్ళి చేసుకోవటంవల్ల నేను ఎంతో అవమానం ఎదుర్కోవాలి అని నాకు తెలుసు! అందరూ "నీ కిదేం కర్మ!" అని జాలిపడుతున్నారు. అంతే మరి, ఒక మంచి పని చెయ్యాలంటే కొన్ని అవస్థలు ఎదుర్కోక తప్పదు. నావల్ల ఒక అభాగ్యురాలి మనసుకి కొంత ఆనందం కలిగితే పరవాలేదు. నేను ఏమైనా తట్టుకుంటాను."

తలపైకెత్తి అలవాటైన ధోరణిలో అహంకారంతో గర్వంగా నవ్వాడు బాపినీడు.

ఆ ఇంట్లో అడుగుపెట్టాక అంత సేపటికి అప్పటికి రాగిణి ముఖం లోకి పరిశీలించి చూసాడు మాధవరావు.

రాగిణి కూర్చుంది అక్కడే. ఎక్కడికి కదలగలదు? వింది మాధవ రావు మాటలన్నీ. వినక? నవ్వింది! అంతే! అదొక్కటే చెయ్యగలదు మరి!

రాగిణి ముఖానికి క్రీం పూసుకుంది. ఆపైన ఫారిన్ పౌడరు అద్దు కుంది. కనుబొమలు దిద్దుకుంది. పెదవులకు లేత ఎరుపు లిప్‌స్టిక్ ఖరీదైనది పెట్టుకుంది. వీటన్నిటినీ కరిగిస్తూ బిందెలతో బాపినీడు మాటలు గుమ్మరించిన కళ్ళ నీటి చారలు ఆ ముఖంమీద, ఆ నవ్వులో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అక్కడే ఉండి ఆ చిత్రహింస చూడలేక పోయాడు మాధవరావు.

"ఇంక వెళ్తాను." అని లేచాడు.

16

బాపినీడు సగర్వంగా అట్టహాసంతో తను చేసిన 'త్యాగాన్ని' వివరిస్తోంటే, నిస్పృహాయంగా కూర్చున్న రాగిణి ముఖం మాధవరావుకు మరపు రావటంలేదు. అంతకంటె కూడా మరొక విషయం అతణ్ని ఆకర్షించింది. బాపినీడు మరునాటి వరకు రాడని చెప్పింది రాగిణి. అలాంటి వాడు ఆ సమయంలో రావటం కాకతాళీయమేనా? ఎందుకో అలా అనిపించలేదు మాధవరావుకి. ఆ విషయం నిర్ధారించుకోవాలనిపించింది.

వెంటనే రాగిణికి ఫోన్ చేసాడు.

మాధవరావు కంఠం విన్న రాగిణికి ఆనందంతో పిచ్చెక్కినట్లయింది. "మీరేనా? నిజంగా మీరేనా?" అంది.

కలుక్కుమంది మాధవరావు మనసు. రాగిణి తన ఎదురుగ నిలబడి విలాసాలు గుమ్మరిస్తూ "మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." అన్నప్పుడు ఏ వికారమూ కలగలేదు కాని ఈనాడు ఈ మాటలు వింటుంటే ఎలాగో అనిపించింది.

"అవును. నేనే! నువ్వొకసారి మా ఇంటికిరా? రాగలవా?"

"ఎందుకు రాలేను? తప్పకుండా వస్తాను. ఇప్పుడే వస్తాను."

ఫోన్ పెట్టేసి క్షణాలలో తయారయింది. గాలిలో తేలిపోతున్నట్లు ఇల్లు దాటగలిగింది. కాంపౌండ్ గేట్ దాటలేక పోయింది. గేటు దగ్గర చౌకీదార్ "ఎక్కడికి?" అన్నాడు.

నిర్ఘాంతపోయింది రాగిణి.

"ఎక్కడికో నీకు చెప్పాలా! గేటు తెరు!" అంది కోపంగా. వాడు నిర్లక్ష్యంగా, నిరసనగా నవ్వాడు.

"మీరు బయటకు వెళ్ళటానికి వీల్లేదు. అయ్యగారు మిమ్మల్ని ఎక్కడికీ కదలనియ్యద్దని అన్నారు." తల గిర్రున తిరిగింది రాగిణికి.

ఎదురుగా రాక్షసుడిలా నవ్వుతూ చౌకీదార్.

తిరిగి ఇంట్లో కొచ్చేసింది. కోపంగా బాపినీడుకి ఫోన్ చేసింది.

రాగిణి కంఠం వినగానే బాపినీడు చికాకు పడ్డాడు.

"ఏం భార్యామణీ! నీ మాయప్రేమ కాస్త తగ్గించు తల్లీ! నాకు పనులున్నాయి."

"నన్ను బయటకు వెళ్ళనీయొద్దని చౌకీదార్ కి చెప్పారా?"

ఈ మాటలు వింటూనే విరగబడి నవ్వాడు బాపినీడు. "మహాతల్లివి ఎక్కడకు బయలుదేరావ్?"

"నేనడిగినదానికి సమాధానం చెప్పండి."

"అవును. నేనే చెప్పాను. నువ్విప్పుడు బాపినీడు భార్యవి. ఊరి మీద పడి తిరగటానికి వీల్లేదు. నా మర్యాద నేను నిలుపుకోవాలి!"

"ఆ సంగతి నాకు చెప్పచ్చుగా! ఆ చౌకీదారుతో చెప్పించటం దేనికి?"

"నీకు చెప్తాను, నువ్వు వింటావు!? అహ్హహ్హ! కనకపు సింహాసన మున కూర్చొబెట్టినా వెనుకటి గుణాలు పోవని నాకు బాగా తెలుసు. ఎటు తిరిగింది గాలి?"

ఫోన్ పెట్టేసింది రాగిణి.

శ్యామలాంబ సేవాసదనంలో చేరాక రాగిణి ఎప్పుడూ ఏడవలేదు. ఆనాడు కుమిలి కుమిలి ఏడ్చింది.

మాధవరావు తనంతట తను ఫోన్ చేసాడు. ఎన్నడూ ఎరగనంత ఆర్ద్రంగా మాట్లాడాడు. ఆ మాటలు వింటుంటే కేవలం ఆ పొడి మాటలు...ఏమి విశేషం లేని మాటలు కొద్దిపాటి ఆర్ద్రతతో వినిపించిన మాటలు వింటోంటే మనసుకు కలిగినంత హాయి ఏనాడు కలగలేదు. మాధవరావు తనను రమ్మన్నాడు. కానీ తను వెళ్ళలేక పోయింది. ఏదో భరింపరాని అశాంతితో రేగిపోసాగింది మనసు. తనను ప్రేమగా పలక

రించే ఒక స్నేహ స్వరం వినాలనిపించింది. వెంటనే గుర్తొచ్చిన వ్యక్తి లలిత.

సేవాసదనంలో స్నేహితులు ఎందరో ఉన్నారు. కానీ వాళ్ళలో ఏ ఒక్కరినీ కలుసుకోవాలని లేదు, లలిత నే చూడాల్సినిపిస్తోంది. లలితకి ఫోన్ చేసింది.

"నేను లలితా! రాగిణిని ఒకసారి మా ఇంటికిరావూ!"

అటువైపునుండి నిశ్శబ్దం.

"రావూ?" మళ్ళీ అడిగింది రాగిణి.

"వస్తాను."

17

తను స్వయంగా ఫోన్ చేసినా రాగిణి వస్తానని రాకపోవటం మాధవరావుకి చాలా ఆశ్చర్యం కలిగించింది. మళ్ళీ ఫోన్ చేసాడు.

"మాధవరావుగారేనా? అయామ్! సారీ! నేను రాలేకపోయానండీ! ఇంకెప్పుడు రాలేను బహుశా."

రాగిణి కంఠం ఎలానో ఉంది.

"అదేం? ఎందుకు రాలేరు?"

"ఇప్పుడు నేను మిస్. రాగిణిని కాదుగా! మిసెస్ బాపినీడుని! ఎక్కడికైనా ఆయనతో కలిసి వెళ్ళటమే బాగుంటుంది. ఒంటరిగా వెళితే మర్యాదగా ఉండదు!"

"ఐసీ! మరి. నిన్న వస్తానన్నారు .."

"అప్పుడు అప్పుడింత ఆలోచించలేదు..."

"ఈ ఆలోచనలన్నీ తర్వాత వచ్చినవన్నమాట! మీకే వచ్చాయా? ఎవరైనా చెప్పిపెట్టారా?"

"భలేవారు! నాకామాత్రం తెలియదనుకున్నారా?"

"ఆల్ రైట్! ఎప్పుడైనా నేనే మీ ఇంటికి వస్తాను."

అటువైపునుండి ఏ సమాధానమూ రాలేదు. న్యాయంగా ఉత్సాహంతో "రండి!" అనవలసింది. ఫోన్ పెట్టేసి ఆలోచనలోపడ్డాడు మాధవరావు.

అప్పుడే వచ్చిన లలిత చనువుగా "ఏమిటాలోచిస్తున్నారు?" అంది.

లలితకు మణిమాలా మాధవరావులతో బాగా చనువు ఏర్పడి పోయింది_ ఇద్దరితోనూ కొంచెం స్వతంత్రించి మాట్లాడగలుగుతోంది.

"రాగిణి గురించి..."

"తను చాలా సుఖపడుతున్నట్లు మనలనందరినీ నమ్మించడానికి ఎంతో తాపత్రయపడుతుంది. ఆ ఆరాటంలోనే పాపం. ఆ మనసులో

వెలితి అర్థమవుతుంది. నిన్న వెళ్ళాను. ఎందుకో రాగిణిని చూస్తే నాకు కలిగేది జాలిమాత్రమే!''

''నిన్న వెళ్ళారా మీరు?'' ''అవును!''

''మీరు వెళ్ళాక బాపినీడుగారు రావటం జరిగిందా?'' ''లేదు.''

''మీరు రాగిణితో ఫ్రీగా మాట్లాడగలిగేరా?''

''ఆ. ఎందుకిలా అడుగుతున్నారు?''

''ఏం లేదు. బాపినీడు ఇంట్లో ఉండని సమయం చూసుకుని రాగిణి నన్ను రమ్మంది. కానీ నేను వెళ్ళిన కొంచెం సేపట్లోనే బాపినీడు వచ్చాడు. రాగిణి ఇక్కడికి రావటానికి కూడా ఏవో ఆటంకాలున్నట్లే అనిపిస్తోంది. ఇదంతా చూస్తోంటే నా అనుమానం మరింత ఎక్కువవుతోంది. లలితా! నువ్వే నాకు సహాయం చెయ్యాలి! రాగిణి ద్వారా బాపినీడుకు సంబంధించిన రహస్యాలు తెలుసుకోవాలి!''

''రాగిణి ఇప్పుడు బాపినీడు భార్య!''

''అందుకే మన పని సులువవుతుంది!''

''రాగిణి ఈ సహాయం చేస్తుందా?''

''చెయ్యదలచుకుంటే చెయ్యగలదు!''

''బాపినీడుకు ఎందుకు ద్రోహం చేస్తుంది?''

''ఎందుకు చెయ్యదు? రాగిణికి బాపినీడు ఎవరు?'' చిత్రంగా నవ్వాడు మాధవరావు ఆ నవ్వు చూస్తూ నిలబడిపోయింది లలిత.

''ఏమైనా, ఇలాంటి సహాయం చెయ్యమని రాగిణిని నేనెలా అడగగలను?''

''ప్లీజ్ లలితా! ఇదంతా నీ కోసమే...''

''నా కోసమా?''

మాధవరావు అల్లరిగా నవ్వాడు.

''అవును. నీ కోసమే! ఈ రకంగా రాజు నిర్దోషి అని రుజువు చెయ్యటానికి వీలవుతుందేమోనని ..''

లలిత ముఖం పాలిపోయింది. మాధవరావు వంక దీనంగా చూసింది. కలవరపడ్డాడు మాధవరావు. ''ఏమిటి లలితా!''

లలిత ఏం మాట్లాడలేదు.

''నీకు అపాయం జరుగుతుందని భయపడకు, నేనుండగా నీకు ..''

''అది కాదు. ఈ విషయం ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను...''

''చెప్పు! నాతో నువ్వేది ఎలా చెప్పినా ఫరవాలేదు.''

''ఆ మాత్రం అభయమిచ్చారు గనుక చెప్తున్నాను. రాజుకోసమని నేనేదీ చెయ్యలేను. మీ కోసం ఏం చెయ్యమంటారో చెప్పండి. ప్రపంచంలో దేన్నీ లక్ష్యపెట్టకుండా చేస్తాను.''

ఈ మాటలు వింటూ బొమ్మలా నిలబడిపోయాడు మాధవరావు.

లలిత వెళ్ళేసరికి రాగిణి మంచంమీద బోర్లా పడుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది! రాగిణి అలా ఏడవటం లలిత ఎన్నడూ చూడలేదు. చిన్నతనంలో పినతల్లి చేతిలో అష్టకష్టాలూ పడే రోజుల్లో కూడా అలా ఏడవలేదు. చూడలేకపోయింది లలిత. రాగిణి దగ్గరగా కూచుని తలమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరింది.

దిగ్గున తలెత్తింది రాగిణి. "నువ్వా?" అంది.

"దుఃఖంలో ఉన్న నన్ను ఇంత ఆత్మీయంగా ఓదార్చే వారెవరున్నారా, అని ఆశ్చర్యపోతున్నాను. నువ్వింకా నాకున్నావని ఆశ మిగల్లేదు." కళ్ళు తుడుచుకుంటూ అంది రాగిణి.

"ఎందు కేడుస్తున్నావ్, ఇంతగా .."

"ఇంక నాకు మిగిలింది ఆ ఏడుపే! నేను ఈ ఇల్లు కదిలి బయటకు అడుగుపెట్టడానికి వీల్లేదు. స్నేహితులను కలుసుకోడానికి వీల్లేదు. ఎవరిళ్ళకు వెళ్ళడానికీ వీల్లేదు. చివరికి సినిమాలకూ, షికార్లకూ, వెళ్ళడానికి కూడా వీల్లేదు. ఇది నాకొక ఖైదులాగానే ఉంది."

"ఇందుకేనా, ఏడుపు?"

"అంటే, ఇది నీకు మామూలుగానే అనిపిస్తోందా?"

"మొదటినుండీ నువ్వేం కావాలని కోరుకున్నావ్? ఏం కావాలనుకుని శ్యామలాంబగారి దగ్గరచేరావ్? చీరలూ, నగలూ, ఐశ్వర్యమేగా! అవన్నీ ఇప్పుడూ నీకున్నాయిగా! మరెందుకు ఏడుపు?"

రాగిణి లలితను విస్తుపోయి చూసింది.

"లలితా! నన్ను వెక్కిరిస్తున్నావా?"

"లేదు! లేదు! ఒకప్పుడు నే నను కున్న మాటను పైతో అంటున్నాను. నిజంగా మనకేం కావాలో మనకు తెలుసా? ఏ దేవతలో మనకు వరాలియ్యటానికి సిద్ధపడితే నిజంగా మనకు సౌఖ్యం కలిగించేవి కోరుకోవటం మనకు చేతనవుతుందా? మనం కోరినవి మనకు దక్కినంత మాత్రాన సుఖపడగలమా? నీ సంగతే చూడు. నువ్వు కోరిన చీరలూ, నగలూ, దక్కాయి కాని . ."

"నేను చీరలూ, నగలూ. కావాలనుకున్నాను. కాని, ఇలాగా?"

"ఆత్మవంచన చేసుకోకు లలితా! అప్పుడైనా నువ్వు వీటికోసం కొంత వదులుకున్నావు. ఇప్పుడు వాటికొంత నాలుక విధంగా వదులుకుంటున్నావు."

"ఆ మాటకొస్తే లోకంలో మిగిలిన అందరూ మాత్రం కొన్నికొన్ని వదులుకోవటం లేదా?"

"అవును. ఒకటి పొందాలంటే మరొకటి వదులుకోవాలి. ఏది

పొందాలో, ఏది వదులుకోవాలో, నిర్ణయించుకోవటంలోనే జీవితపు విలువలు ఆధారపడి ఉన్నాయి.''

రాగిణి మాట్లాడలేదు. అసలే బాధపడుతున్న రాగిణిని తను మరింత బాధ పెడుతున్నానా అనుకుంది సంభాషణ మార్చాలని "రాగిణీ! నువ్వు నాకొక్క సహాయం చెయ్యగలవా?'' అంది.

రాగిణి ఉత్సాహంతో ముఖమంతా వెలిగిపోతుండగా పట్టరాని సంతోషంతో "నేను నీకు సహాయం చెయ్యగలనా? తప్పకుండా చేస్తాను. చెప్పు'' అంది.

తనకు సహాయం చెయ్యటానికి రాగిణి ఇంత ఉత్సాహపడుతుందని లలిత ఏనాడూ అనుకోలేదు. అంతకు ముందువరకు ఏడవటంవలన ఉబ్బిన ఆ ముఖంలో కొత్తగా వచ్చిన వికాసాన్ని చూస్తూ, "నేను ఎప్పుడు నా ఆనందమే చూసుకుంటాను. మరొకరి ఆనందం కోసం నా ఆనందం త్యాగం చెయ్యను. అయినా నేను వచ్చిన పని చెప్తున్నాను. ఆలోచించుకుని చెయ్యగలిగితే చెయ్యి. నాకోసం కాదు. మాధవరావుగారి కోసం'' అంది లలిత.

"ఆయన కోసమయితే మరింత సంతోషంగా చేస్తాను చెప్పు.''

"బాపినీడుగారికి సంబంధించిన రహస్యాలు తెలుసుకుని చెప్పమన్నారు.''

"అదా...... ..''

"ఏం? ఇష్టంలేదా?''

"ఇష్టం లేకపోవటం కాదు. నాకు కూడా ఏదీ సరిగ్గా తెలియదు. వాళ్ళు తెలియనివ్వరు. అన్ని విధాలా జాగ్రత్తలో ఉంటారు. శ్యామలాంబగారు నన్ను ఎవరెవరి దగ్గరకు పంపించారో ఆ వ్యక్తుల పేర్లు చెప్పగలను. ప్రస్తుతానికి నేను చెయ్యగలిగినదింతే!''

రాగిణి చెప్పిన పేర్లన్నీ ఒక కాగితంమీద రాసుకుంది లలిత

"లలితా! నిన్నొక్కటి అడగనా?'' సంకోచిస్తూ అంది రాగిణి.

"అడుగు.''

"ఈ ప్రయత్నమంతా రాజు నిర్దోషి అని రుజువుచెయ్యటానికేనా? రాజును పెళ్ళిచేసుకోవాలనేనా ఈ తాపత్రయమంతా''

కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయిన లలిత చివరకు సమాధానం చెప్పింది.

"కాదు. రాజు గురించి నేనేమీ ఆలోచించటంలేదు.''

"మరి ..?'' రాగిణి ప్రశ్నార్థకాన్ని అలాగే వదిలేసి "వెళ్ళొస్తాను.'' అని అక్కడ్నుంచి వచ్చేసింది లలిత.

18

మోహన్ విడుదలయ్యాడు. మాధవరావు ప్రయత్నంవల్ల మోహన్‌కి ఉద్యోగంకూడా దొరికింది. జానకమ్మ కోలుకుంది. లేచి తిరుగుతోంది.

రాజు వచ్చాడు. వస్తూ వెంకట్రావుకోసం పళ్ళూ, మిఠాయిలూ తీసుకొచ్చాడు. వెంకట్రావు ఆనందంగా వాటి నందుకున్నాడు. జానకమ్మకి చక్కని లక్ష్మి విగ్రహం తీసుకొచ్చాడు. "ఎందుకు బాబూ!" అంటూ కాదనలేక తీసుకుంది జానకమ్మ. మోహన్‌కి మంచి పర్స్ ఇచ్చాడు. లలితకు చక్కని రాధాకృష్ణుల విగ్రహం కానుకగా తెచ్చాడు. లలిత మాత్రం అది తీసుకోలేదు.

"ప్లీజ్! తీసుకో లలితా! నీకోసం షాపులన్నీ గాలించి తెచ్చాను." అన్నాడు రాజు.

"అయామ్ సారీ రాజూ! పరాయివాళ్ళనుండి బహుమతులు తీసుకోవటం నాకు అలవాటులేదు."

రాజు ముఖం చిన్నబోయింది.

"ఈనాడు నేను కొంచెం కష్టదశలో ఉన్నానని చిన్న చూపు చూడకు లలితా! మళ్ళీ నాకు మంచి రోజులు రాకపోవు." నిష్ఠూరంగా అన్నాడు.

నిర్ఘాంతపోయింది లలిత!

నెపం తనమీద వేస్తున్నాడు రాజు. భరింపరాని కోపం వచ్చినా నిగ్రహించుకుంది. శాంతంగా సమాధానం చెప్పింది.

"మారుతున్న దశలనుబట్టి మనసు మార్చుకోవటం నాకు అలవాటు లేదు రాజూ! ఎదుటి మనుష్యులను అర్థంచేసుకున్నప్పుడు మాత్రం దానికి అనుగుణంగా నా మనసు మార్చుకుంటాను."

రాజు సమాధానం చెప్పలేకపోయాడు.

ఇదెక్కడి రాజు! ఇలాంటి రాజునా తను ప్రేమించింది! ఆ రోజుల్లో రాజులోని ఈ మూర్తి తనకు కనపడకుండా ఎక్కడ దాక్కుంది? ఆలోచిస్తోంది లలిత.

"మోహన్‌కి మాధవరావుగారి ప్రయత్నంవల్లే ఉద్యోగం దొరికిందటగా!" ఉన్నట్లుండి అడిగాడు రాజు.

"అవును. ఎవరో ఒకరి ప్రయత్నం లేకుండా ఉద్యోగాలు దొరికే రోజులు కావు గదా, ఇవి!"

"అంతే! అంతే! లలితా! దయచేసి కొంచెం నా విషయం కూడా మాధవరావుగారికి చెప్పవూ?"

లలిత మనసులో చీదర తారాస్థాయి నందుకుంది. రాజుని ఏడిపించాలనిపించింది.

"నేను చెప్తే ఆయన చేస్తారని నమ్మకమేనా రాజూ?"

"తప్పకుండా చేస్తారు. ఆయనకు నువ్వంటే చాలా అభిమానం!"

"ఎంత అభిమానం ఉంటే మాత్రం? మొగవాళ్ళు తాము అభిమానించే వ్యక్తులకి ఊరికే సాయం చెయ్యరు. ఆ అభిమానం తిరిగి పొందగలిగినపుడే చేస్తారు!"

"నీకూ ఆయనంటే అభిమానమేగా లలితా!"

"ఆ సంగతి నీకు తెలుసా రాజూ!"

"ఎందుకు తెలియదు? అందరికీ తెలుసు!"

"ఓహో! అందరికీ తెలుసన్నమాట! అయితే నువ్వు నన్నెలా పెళ్ళిచేసుకుంటావ్!"

"అదేమిటి లలితా!"

"ఛీ! ఛీ! సిగ్గులేదూ?"

అప్పటికి లలిత తన నెక్కడికి లాక్కుపోతోందో రాజుకి అర్థమయింది. అవమానంతో లోలోపల ఉడికిపోయాడు. రాజు అవస్థ అర్థం చేసుకున్న లలిత హాయిగా నవ్వింది.

దిగ్గున లేచి వెళ్ళిపోయాడు రాజు.

'పరవాలేదు!' అనుకుంది లలిత.

రాగిణి దగ్గరనుండి లలిత తెచ్చిఇచ్చిన పేర్లు చూసిన మాధవరావుకు మతిపోయినట్లయింది. వాళ్ళందరు పెద్దపెద్ద ఆఫీసర్లు. ఎంతో పరపతి గలవాళ్లు. అలాంటి వ్యక్తుల విషయంలో అనుమానించి విచారణ సాగించటం మాటలుకాదు. అయినా మాధవరావు సాహసించాడు. విచారణలో అనేక విషయాలు బయటపడ్డాయి. శ్యామలాంబగారు రాగిణిని, ఇంకా రాగిణిలాంటి వాళ్ళనూ ఉపయోగించి, ఆయా ఆఫీసర్ల చేత అనేక రకాల గ్రాంటులు సేంక్షన్ చేయించుకుంది. వీటిల్లో చాలా సంస్థలు కేవలం కాగితాలమీదనే ఉన్నాయి. మరికొన్ని నామమాత్రంగా ఉన్నాయి.

ఈ విషయాలన్నీ అన్ని వివరాలతో పత్రికలలో వచ్చాయి. ఆ ఆఫీసర్లమీద ఏక్షన్ తీసుకున్నారు బాపినీడుకు రగిలిపోయింది. కోపంగా రాగిణి దగ్గర కొచ్చి బెల్టుతో గొడ్డును బాదినట్లు బాదాడు.

"నాకేం తెలియదు." అని గోలపెట్టింది రాగిణి.

"తెలీదూ! నువ్వు కాకపోతే, ఆ మాధవరావుగాడికీ సమాచారం అందజేసింది ఎవరు? దొంగ రాస్కెల్! ఎంత గుండెలు తీసిన బంటువే! ఇంటిముందు కాపలా పెట్టాను. ఫోన్ కాల్స్ చెక్ చేయిస్తున్నాను. అయినా ఎలాగో ఒకలాగ సాధించావు. చెప్పు వాడికీ సమాచారం ఎలా అందించావో చెప్పు..."

మళ్ళీ బాదాడు బాపినీడు.

బాపినీడు మాటలు తనకు కలిగించిన బాధ ముందు ఆ దెబ్బల బాధ మరిచి పోయింది రాగిణి.

“దురాత్ముడా! ఇదా, నువ్వు చేస్తున్న పని? ఇందుకా నువ్వు నన్ను పెళ్ళిచేసుకున్నది?”

“ఓహో! మరి తమ రెందుకండీ నన్ను పెళ్ళిచేసుకున్నది? నన్ను అలా వీపు తిప్పనిచ్చి అడ్డమైన గాడిదలనీ రప్పించుకుని నా డబ్బుతో కులకటానికా? పదిమందిలో ఇష్టంవచ్చినట్లు ఊరేగి నా పరువు బజారుపాలు చేయటానికా? రోగ్! పెళ్ళట, పెళ్ళి...ఎన్ని జన్మలకు తెలుస్తుందే పెళ్ళికి అర్థం నీకు?”

కసిగా మాట్లాడుతున్న బాపినీడు ఫోన్ మ్రోగటంతో రాగిణిని వదిలేసి వెళ్ళిపోయాడు. ఫోన్‌లో మాట్లాడుతూ జేబులోంచి నీలం అట్ట ఉన్న చిన్న డైరీతీసి దానిలో ఏదో వ్రాసుకోటం గమనించింది రాగిణి. అతడు ఇదివరలో కూడా అలానే కొన్ని ముఖ్య విషయాలు నోట్ చేసుకునేవాడని గుర్తు కొచ్చింది.

19

“లలితా! ఇవాళ సాయంత్రం మనం సినిమా కెళ్దాం!” అంది మణిమాల.

లలిత ఎప్పటిలా తల ఊపలేదు. ముఖం చిట్లించుకుని “ఇంక ఈ కపట నాటకాలు సాగవు మణిమాలా!” అనేసింది.

మణిమాల తరచుగా లలితను ఏదో ఒక ప్రోగ్రాం అంటూ బయలుదేర తియ్యటమూ. చివరి క్షణంలో ఏదో వంకతో తను తప్పించుకుని, మాధవరావునూ, లలితనూ మాత్రమే పంపాలని చూడటమూ, మాధవరావు తెలివిగా ఆ సమయానికి ఏదో ఒక పని ఉందని తప్పుకోవటమూ మామూలైపోయింది. ఎప్పటికప్పుడు మాధవరావుతో కలిసి బయలుదేరటానికి తను సిద్ధమైనట్లు కనపడటమూ, అతడు తప్పుకోవటమూ, లలితకు చాలా అవమానంగా ఉంది. నిజానికి లలిత ఒప్పుకుంటున్నది మణిమాల మాటలు కాదనలేని మొహమాటంతో .. మాధవరావు కూడా తనతో కలిసి రావటానికి సిద్ధపడితే, అప్పుడు తన మనసెలా ఉండేదో, దానికి లలిత దగ్గర సమాధానం లేదు.

ఒకపక్క ఈ అవమానమే భరించలేకుండా ఉంటే అంతకంటే ఎక్కువగా బాధిస్తోంది నిరాశతో. “నేనేమయిపోయినా పరవాలేద”ని క్రుంగిపోతున్న మాధవరావు ముఖం.

అందుకే ఏమయితే అయిందని ధైర్యంగా ఎదుర్కొంది మణిమాలని.

“కపట నాటకాలా?” ఆశ్చర్యం నటిస్తూ అంది మణిమాల.

లలితకి మరింత మండిపోయింది.

"నువ్వు డాక్టర్ వినోద్‌తో ఇష్టం వచ్చినట్లు తిరగటంకోసం మాధవరావుగారి కొక జతను చూసి పెట్టక్కర్లేదు. అందుకు నన్ను ఉపయోగించుకుంటానంటే నేను ఒప్పుకోను."

లలిత మాటలకు మణిమాల కోపం తెచ్చుకోలేదు సరికదా, తనకు అలవాటైన ధోరణిలో నిర్లక్ష్యంగా నవ్వింది.

"పూర్ లలితా! నేను డాక్టర్ వినోద్‌తో కలిసి తిరగాలనుకుంటే అడ్డు చెప్పేదెవడు? అందుకోసం మాధవ్ కొక జతను చూడక్కర్లేదు నేను..."

లలితలో కసి పెరిగిపోతోంది.

"అయితే ఇంకేం? ఊరేగు! మధ్యలో నన్నెందుకు చంపుతావ్?

"మాధవ్‌ని కూడా సుఖపడేలా చేద్దామని..."

"ఆహా! ఎంత ప్రేమ! ఆదర్శ పత్నీవంటే నువ్వే! కానీ ఇంత కాలమయినా ఆయన్ని నువ్వు అర్థం చేసుకోలేదా? ఒక ధర్మానికీ, ఒక నీతికీ కట్టుబడి ప్రవర్తించే మనిషి ఆయన. ఏ సుఖాలకోసమూ, తను అధర్మమని అనుకున్న మార్గంలో అడుగుపెట్టరు. భార్య చచ్చిపోతే. మరొక పెళ్ళి చేసుకుంటారేమో! ధైర్యంగా విడాకులిచ్చి విడిపోతే మరొకరిని ప్రేమించగలరేమో! కానీ, తాళికట్టిన భార్య ఉండగా ఏ పరిస్థితుల్లోనూ ఆయన మరొక జంటను వెతుక్కోరు. ఇంక ఈ వృథా ప్రయత్నాలు మానెయ్యి..."

మణిమాల మాట్లాడలేదు. లలితకు మరింత ధైర్యం వచ్చింది.

"మణిమాలా! నా మాట విను. ఊబిగుంటలో ఉన్న నిర్గంధ కుసుమంకోసం పరుగులు పెట్టకు .."

"షటప్! గెటవుట్!" గట్టిగా అరిచింది మణిమాల.

"వెళ్తున్నాను. కానీ నువ్వు మళ్ళీ కబురు పంపగానే వస్తాను. మళ్ళీ చెప్తున్నాను. అదృష్టవంతు లందరిలో అదృష్టవంతురాలివి జీవితాన్ని చేతులారా నరకం చేసుకోకు!"

లలిత వెళ్ళిపోయినా, మణిమాల చాలాసేపు ఆలోచిస్తూ కూచుండి పోయింది. చివరకు లేచి డాక్టర్ వినోద్ దగ్గరకే బయలుదేరింది. ఎప్పటి లాగే మాధవ్‌కు స్లిప్ రాసిపెట్టింది.

రాత్రి పదిగంటల సమయంలో కాలింగ్ బెల్ విని తలుపు తెరిచిన మాధవరావు రాగిణిని చూసి తెల్లబోయాడు.

గడగడ వణికిపోతోంది రాగిణి. "నన్ను లోపలకు రానియ్యరూ? లేకపోతే తిన్నగా ఏ రైలుకిందకో పోయి ఆత్మహత్య చేసుకోవలసిందే!"

"రండి! రండి!" అన్నాడు మాధవరావు.

ఆ రోజు బాపినీడు రాగిణి దగ్గరే ఉన్నాడు. బాపినీడు ఉండటం

వల్ల చాకీదారు నిర్లక్ష్యంగా నిద్రపోతున్నాడు. రాగిణి ఇంతకు తెగిస్తుందని ఊహించలేని బాపినీడు బాగా తాగి మత్తుగా నిద్రపోతున్నాడు. అలాంటి సమయంలో ప్రాణాలకు తెగించి వచ్చేసింది రాగిణి.

రాగిణి సాహసానికి మాధవరావు కూడా ఆశ్చర్యపోయాడు. అభిమానంగా రాగిణి చెయ్యి పట్టుకుని "ఎంత పని చేసావు రాగిణీ! ఎంత ప్రమాదం?" అన్నాడు. "మీరీమాత్రం ఆదరంగా మాట్లాడతానంటే ఇంకా ఎంత సాహసమైనా చేస్తాను." అంది రాగిణి చిరునవ్వుతో. మాధవరావు గతుక్కుమని రాగిణి చెయ్యివదిలి దూరంగా కూచున్నాడు. పకపక నవ్వింది రాగిణి మెరుస్తున్న కళ్ళతో .. మాధవరావు తేరుకుని "ఎందుకొచ్చారు?" అన్నాడు.

"మీకు సహాయం చెయ్యటానికే వచ్చాను. బాపినీడు తను ఎవరికి సహాయం చేసినా, ఏం చేసినా, ఆ వివరాలు డైరీలాంటి చిన్న నీలి అట్ట బౌండు బుక్స్‌లో రాసుకుంటాడు. అలాంటివి సాధారణంగా అతని బట్టల బీరువాలో ఒక షెల్ఫ్‌లో ఉంటాయి. ఇంకా ఏవేవో కాగితాలు కూడా చూసినట్లు గుర్తు. ఇంతకంటే నాకేం తెలియదు."

మాధవరావు ఆలోచనలో పడ్డాడు. బాపినీడులాంటి ప్రముఖ వ్యక్తి ఇంటిమీద రైడ్ చెయ్యటం మాటలుకాదు. ఒక వేళ ఏ ఆధారాలూ దొరక్కపోతే తన పని చాలా ఇరుకున పడుతుంది. కానీ, రాగిణి మాటలను బట్టి బాపినీడు ఏదో కుంభకోణం నడిపిస్తున్నట్లే ఉంది.

"మీరు నాకొక్క ఉపకారం చెయ్యాలి."

మళ్ళీ వణికిపోతూ అంది రాగిణి.

"ఏమిటది?" అనుమానంగా అడిగాడు మాధవరావు.

"దయచేసి నన్ను జైల్లో పెట్టించాలి!"

"నీకు మతిపోయిందా? ఇదా, ఉపకారం?"

"అవును. ఇదే పెద్ద ఉపకారం జైల్లో పోలీసు కాపలా మధ్య గాక, ఎక్కడున్నా నన్ను బాపినీడు బ్రతకనివ్వడు. నాకు బ్రతకాలని ఉంది. బాపినీడు అరెస్టు కావటం చూడటానికి బ్రతకాలని ఉంది. చెప్పండి. నన్ను జైల్లో పెడతారా? లేదా?"

మాధవరావు జాలిగా చూసాడు రాగిణిని.

చివరకు తనకు తానై జైలు కోరుకునే పరిస్థితికి వచ్చింది రాగిణి!

మాధవరావు అతి సాహసంతో బాపినీడు ఇంటిమీద రైడ్ చేసాడు. బాపినీడుకి వ్యవధి ఇయ్యకుండా రాగిణి తన దగ్గరకు వచ్చిన వెంటనే రైడ్ చేసాడు. బాపినీడు ఇంట్లో బయటపడిన రకరకాల డాక్యుమెంట్స్‌నిబట్టీ డైరీలనుబట్టీ చాలా విషయాలు బయటపడ్డాయి.

బాపినీడుకి రెండుమూడు అక్రమ వ్యాపార సంస్థలతో లావాదేవీ

లున్నాయి. డబ్బు పెట్టుబడిగా పెట్టి అతడు అయిదారుగురిని అధికారంలోకి తీసుకొచ్చాడు. ఆ అధికారాన్ని వినియోగించుకుని మళ్ళీ డబ్బు చేసుకుంటు న్నాడు. అతనికి ఇదీ ఒక రకమైన వ్యాపారమయిపోయింది. శ్యామలాంబ అతనికి కుడిచెయ్యిలా పనిచేస్తోంది. సేవాసదనంలో ఉన్న స్త్రీలనందరినీ వాళ్ళు సమయానుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. పెద్దపెద్ద పోలీస్ ఆఫీసర్లలో కూడా కొందరు బాపినీడుతో చేతులు కలిపినవారున్నారు. అందుకే బాపినీడుకి మరీ అడ్డులేకుండా పోయింది. గవర్నమెంట్ డబ్బు స్వాహా చేస్తున్నప్పుడు కొన్ని సందర్భాలలో అయినా ఆ విషయం బయట పడక మానదు. అప్పుడెవరో ఒకరిని సంఘానికీ, ప్రభుత్వానికీ, దోషిగా చూపించాలి. ఆ సమయానికి ఎవరో ఒకరిని పావుగా వినియోగించు కుంటారు. రాజుని అలాగే ఉపయోగించుకున్నారు.

రాజు నిర్దోషి అని రుజువయింది. బాపినీడు అరెస్టయ్యాడు.

బాపినీడుని చూసి పకపక నవ్వింది రాగిణి. "ఇన్నాళ్ళకు మిసెస్ బాపినీడుగా నా బ్రతుకు పండింది, నీతో సరిసమానమయిన సాంఘిక హోదా అనుభవిస్తున్నాను. ఇవాళనుంచీ నీకు నాకు పరువు ప్రతిష్టలు సమానమే! ఇద్దరం కటకటాల వెనక కలిసిమెలిసి కాపురం చెయ్యొచ్చు!"

రాగిణి మాటలకు బాపినీడు కసిగా పళ్ళు నూరు కొంటుంటే మరింత నవ్వింది రాగిణి.

20

రాష్ట్రమంతా మాధవరావుకు జేజేలు పలికింది. వార్తా పత్రికలన్నీ మాధవరావును ప్రశంసించాయి.

ఇంతటి జయ జయ ధ్వానాల మధ్య బయటికి రాకుండా ఇంట్లో పడు కున్నాడు మాధవరావు.

ఎంతో సంతోషంతో అభినందించటానికి వచ్చిన లలిత మాధవ రావును ఆ స్థితిలో చూసి విస్తుపోయింది.

"అలా ఉన్నారేం?" అంది ఆందోళనగా.

"మణిమాల డాక్టర్ వినోద్ దగ్గరకు వెళ్ళిపోయింది. ఇక్కడకు రానని ఉత్తరం రాసేసింది!"

బొమ్మలా నిలబడిపోయింది లలిత.

వృత్తిలో మాధవరావు సాధించిన విజయం సామాన్యమైనది కాదు. ఈనాడు అతను ఆనందంతో పొంగి పోవలసిన మాట, కానీ...

లలితకు ఎన్నెన్నో మాటలు నోటి చివరివరకు వచ్చి ఆగిపోతున్నాయి. ఏ ఒక్క భావాన్నీ మాటల్లో పెట్టలేక పోతోంది...

"సమాజం చిత్రమైనది లలితా! భార్య లేచిపోతే భర్తనే చులక నగా చూస్తుంది. ఫలానివాడి భార్య లేచిపోయింది. అని చెప్పుకుంటుంది.

అది ఆ భర్త లోపంగా భావించి నవ్వుతుంది. సంఘంలో ఇలా నవ్వుల పాలు కావటం నా కిష్టంలేదు. అందుకే ఇంతవరకూ ఎంతో సహించాను. కానీ చివరికి నేనిది ఎదుర్కోక తప్పలేదు! నా అపరాధమేమీ లేకుండానే నా కింత పెద్ద శిక్ష."

"మీరు...మీరు ..సంఘం కోసమే ఇంతగా భయపడుతున్నారా? అందుకే బాధ పడుతున్నారా?"

"పూర్తిగా అదొక్కటే కాదు. మణిమాలను నేనెంతో ప్రేమించాను. అన్నీ తెలిసి కూడా మణిమాలను వదులుకోలేక పోయాను. మణి నా కళ్ళముందు. నా ఇంట్లో ఉంటే చాలనుకున్నాను. ఎందుకో ఇప్పటికీ మణిమాల డాక్టర్ వినోద్‌ని ప్రేమించిందని నమ్మలేక పోతున్నాను. తనిలా వెళ్ళిపోతే నేను భరించలేనని తెలుసు. ఎందుకు వెళ్ళిపోయిందో?"

నిలువునా వణికిపోయింది లలిత. మణిమాల ఎందుకు వెళ్ళిపోయిందో మాధవరావుకు తెలియక పోయినా లలితకు తెలుసు.

"నన్ను క్షమించండి? ఈ దారుణానికి నేనే కారకురాలి నేమో!"

"ఛ! నిన్ను అనుమానించి వెళ్ళిపోయిం దనుకుంటున్నావా, మణిమాల?"

"అది కాదు. ఆవిడ ఇక్కడున్నంతవరకూ మీరు మరొకరిని ప్రేమించరని అన్నాను..."

నిర్ఘాంతపోయి చూసాడు మాధవరావు. లలిత తడబడి పోయింది.

"నన్ను అర్థంచేసుకోండి. ఆవిడ వెళ్ళిపోవాలని నేనా మాటలనలేదు. మీరు మరొకరిని ప్రేమించరనీ, ఆవిడ మిమ్మల్ని బాధపెట్టటం న్యాయంకాదనీ..."

మాధవరావు ముఖం చూస్తోన్న లలితకు మాటలు పెగల్లేదు. అక్కడినుండి వెళ్ళిపోయింది. అక్కడే ఉండి అతన్ని ఓదార్చి ధైర్యం చెప్పాలనుకుంది. ఎలాగైనా ఆ ముఖంలో దిగులును మరిపించి చిరునవ్వు తెప్పించాలనుకుంది. కానీ ఈ పరిస్థితుల్లో తన ప్రవర్తన ఎలా అర్థంచేసుకుంటాడో మాధవరావు? తను కావాలని మణిమాలను పంపించేసి ఇలా దగ్గర కావటానికి ప్రయత్నిస్తోందనుకుంటే ..అనుకుని చీదరించుకుంటే.

ఆ రాత్రే దారుణం జరిగిపోయింది. మాధవరావును ఉత్తరాలతో బెదిరించిన దుండగులు కేవలం బెదిరింపులతో ఆగిపోలేదు. అక్షరాలా తమ మాటలు అమలు జరిపారు. పదిమంది గూండాలు మాధవరావు ఇంటిమీదకొచ్చి పడ్డారు. మాధవరావు నిద్రలో ఉండడంవల్ల వెంటనే

ప్రతిఘటించలేక పోయాడు. అతనికి తీవ్రంగా గాయాలు తగిలాయి. రక్తం అపరిమితంగా స్రవించింది. ఆ మరునాటికి కాని ఎవ్వరికీ ఏ విషయము తెలియలేదు. వంటిమీద స్పృహలేని దశలో అతణ్ని డాక్టర్ వినోద్ హాస్పిటల్లోనే చేర్పించారు. మాధవరావును హాస్పిటలో చూసి పిచ్చిదయి పోయింది మణిమాల. అతని బెడ్ దగ్గరే ఉండిపోయింది.

తెలివి రాగానే మణిమాలను చూసిన మాధవ్ ఆప్యాయంగా "మణీ!" అన్నాడు _ ఏదో మాట్లాడబోయిన అతనికి అంతలోనే ఆయాసం వచ్చింది.

"మాధవ్! నువ్విక్కడ ఉండటానికి వీల్లేదు. వెంటనే వేరే హాస్పిటల్ లో చేరాలి. టాక్సీ పిలిపిస్తాను" ఆరాట పడుతూ అంది.

మాధవరావు మాట్లాడలేక ఆయాస పడుతున్నాడు. అతి ప్రయాసతో అన్నాడు_"మణీ! నేనింక ఎంతకాలం బ్రతుకుతానో తెలియదు. ఈ కొంచెం రోజులయినా నన్ను భరించలేవా?"

మణిమాలకు దుఃఖం పొంగి వస్తోంది. అయినా ఏడవలేదు. క్రింది పెదవిని మాత్రం రక్తం చిమ్మేలా కొరుక్కుంది

"మాధవ్! నా మాట విను. ఇక్కడెవరూ వినిపించుకోవటం లేదు, టాక్సీ తీసుకొస్తాను. మనం ఇంకో హాస్పిటల్ కు వెళ్ళిపోదాం."

"మనం?..." "అవును! నేనూ నీతో ఉంటాను."

"మరి, వినోద్?" "అతడి కర్మ?"

"అంటే? మళ్ళీ నాతో ఉందామనా?"

"ఉండను? నన్ను క్షమించగలిగే శక్తి నీకుంది. కానీ ఆ క్షమను భరించే శక్తి నాకు లేదు."

"క్షమించటం కాదు మణీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

"మాధవ్! నీకు తెలుసు. నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను. అందుకే ఆ ప్రేమను ఉపయోగించుకోను. మాధవ్ మనం ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. నీ ఫ్రెండ్స్ తో చెప్పు. టాక్సీ తెప్పించు."

"ఎందుకంత ఆరాటం మణీ? డాక్టర్ వినోద్ నామీద పగ తీర్చుకుంటాడనా? ఈ స్థితిలో అతనికి నామీద పగ ఏం ఉంటుంది? నేను బ్రతికి బయట పడతానా? బ్రతికినా మళ్ళీ మామూలుగా ఉంటానా?"

"అది కాదు మాధవ్! నా మాట విను ..?"

"పరవాలేదు మణీ! అతనిమీద నాకు పగ ఉండాలికాని, అతనికి నామీద పగ ఎందుకుంటుంది? ఈ మూన్నాళ్ళ ముచ్చటకోసం మీ ఇద్దరి మధ్య మనస్పర్థ ఎందుకు కలిగిస్తాను నేను? ఇక్కడే ఉంటాను. నా చివరి క్షణాల్లో నా కంటికి కనపడు చాలు!"

మణిమాల ఇంక నిగ్రహించుకోలేక పోయింది. మాధవరావు గుండెలమీద వ్రాలి వెక్కి వెక్కి ఏడ్చేసింది. మణిమాల తనమీద వ్రాలి పోవటం శారీరకంగా ఆ పరిస్థితిలో బాధనే కలిగించినా మనసుకు కలుగుతున్న హాయికోసం ఆ బాధను భరించాడు మాధవ్.

మణిమాల పరిస్థితి అర్థం చేసుకుని వెంటనే లేచి "సారీ!" అంది.

నువ్వు "సారీ!" అంటున్నావు. నేను "థేంక్స్" చెపుతున్నాను.

"మాధవ్! ఇంక నిజం చెప్పకుండా ఉండలేను. ఏదెలా జరిగినా సరే! డాక్టర్ వినోద్ డాక్టర్ కాదు. అబద్ధాల డాక్టర్! అతని డిగ్రీ అబద్ధపు డిగ్రీ...అతను నీకు వైద్యం చెయ్యటం భరించలేను నేను."

తన చెవులను తనే నమ్మలేక పోయాడు మాధవరావు.

డాక్టర్ వినోద్, డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతు లార్జించుకొని కొన్ని సంవత్సరాలుగా పెద్ద ప్రాక్టీస్ చేస్తూ ఎన్నో బ్రాంచీలు, ఎందరో అసిస్టెంట్‌లు ఉన్న డాక్టర్ వినోద్, అబద్ధాల డాక్టరా?

జనం ఇంత వెర్రివాళ్ళా? అంతే అమాయకులు మోసపోక ఏం చేస్తారు? తనుమాత్రం, తన స్నేహితులు ప్రత్యేకించి ఇక్కడికే తీసుకు రాలేదా? అలానే అందరూ వచ్చి ఉంటారు. అదృష్టం బాగుండి రోగాలు తగ్గితే అదంతా డాక్టర్ ప్రతిభగా చెలామణీ అయిపోతుంది ప్రాణాలు పోయినా అది డాక్టర్ పొరపాటని ఎవరూ అనుకోరు. ఒకసారి పేరుప్రఖ్యాతు లొచ్చాక, అదేదో నయంకావడానికి పీల్లేని రోగ మనుకుంటారు.

"ఈ విషయం నాకెందుకు చెప్పావు మణీ?" బాధగా అన్నాడు మాధవరావు.

"చెప్పాలని చెప్పలేదు. నిన్ను మరో హాస్పిటల్‌కి తీసుకుపోవాలి. నా మాట ఎవరూ వినిపించుకోవటం లేదు. ఏం చెయ్యను?"

"ఈ సంగతి తెలిసాక నేనేం చేస్తానో తెలుసా?"

"తెలుసు వెంటనే ఈ సంగతి రిపోర్టు చేస్తావు."

"మరోలా ప్రవర్తించటం నా సాధ్యం కాదు. అదే చేతనయితే ఈనాడు ఈదశలో ఉండేవాడిని కాదు."

"నాకెందుకు చెప్తున్నావు? నేను నీకు కొత్తదాన్ని గాదు."

"నీమీద కసితో ఈ రిపోర్టు చేస్తున్నానని అనుకోవుగా!"

"అలా అనుకోగలిగితే నా ప్రాణానికి హాయిగానే ఉంటుంది. కానీ, నామీద నీకేమీ కసిలేదని నాకు తెలుసు. అదీగాక వ్యక్తికీ వ్యక్తిగత మయిన కక్షలకు నువ్వు ముడిపెట్టవని కూడా నాకు తెలుసు. ఏమైనా చెయ్యి. ముందిక్కడ్నుంచి కదలాలి."

మాధవరావు స్నేహితుల ద్వారా వెంటనే డాక్టర్ వినోద్ మీద రిపోర్ట్ డిపార్టుమెంట్ కు చేరిపోయింది.

మాధవరావును మరొక హాస్పిటల్ లో జాయిన్ చేసారు. అప్పటి వరకు మాధవరావుతోనే ఉన్న మణిమాల "నేనొక్కసారి ఇంటికి వెళ్ళొస్తాను మాధవ్!" అంది.

"ఎక్కడికి? డాక్టర్ వినోద్ దగ్గరకా?"

"ఇంకెక్కడికి వెళ్తాను?"

"ఇప్పుడొద్దు మణీ! బహుశః మరో రెండు మూడు గంటల్లో అతను అరెస్ట్ అవుతాడు.

"అందుకే! ఆ సమయానికి ముందు అతనితో ఉండాలని."

"ఎందుకు? హెచ్చరిద్దామనా? లాభంలేదు. ఇప్పుడతను ఎటూ తప్పించుకోలేడు."

"తప్పించడానికీ కాదు, తప్పుకోవడానికీ కాదు. ఇంతవరకు అతనితో కలిసి చాలా చాలా అనుభవించాను. ఇదికూడా అతనితో కలిసి అనుభవించాలని..."

మాధవ్ మాట్లాడలేదు. అతనికి ఆయాసంగా ఉంది. మాట్లాడలేకపోతున్నాడు. అతనికి మణిమాలను ఆపాలని ఉంది. కానీ ఆవిడ ఆగదని తెలుసు.

మాధవ్ విషయం తెలిసి ఆదుర్దాగా హాస్పిటల్ లో కొస్తున్న లలిత, మాధవరావున్న గదిముందే మణిమాలకు ఎదురుపడింది. మణిమాల లలిత వంక దిగులుగా చూసి 'లలితా ఆయన లోపలున్నారు జాగ్రత్తగా చూడు' అని చెప్పి వెళ్ళిపోయింది.

మణిమాల ఇంటికి చేరుకునేసరికి డాక్టర్ వినోద్ కోపంగా పచార్లు చేస్తున్నాడు.

"మాధవరావును పట్టుబట్టి నువ్వే మరొక హాస్పిటల్లో చేర్పించావుటగా!" అని అడిగాడు.

"అవును!"

"ఏం?"

"మాధవ్ కి నువ్వు వైద్యంచెయ్యటం నేను భరించలేను గనుక."

వినోద్ ముఖం తెల్లగా పాలిపోయింది.

"కొంపతీసి అన్ని విషయాలూ చెప్పావా, నీ మొగుడితో..."

"మాధవ్ కి అన్ని విషయాలూ చెప్పాను."

"అతడు ఊరుకోడు!"

"అవును, అప్పుడే రిపోర్టు వెళ్ళిపోయింది."

"రాక్షసీ..." అంటూ పట్టరాని కోపంతో వినోద్ మణిమాల కంఠం నులమసాగాడు.

మణిమాల ఒక్క కేక పెట్టలేదు. వదిలించుకోవటానికి ప్రయత్నించలేదు. ఆ హింసనంతా భరిస్తూ అలాగే కూచుంది.

డాక్టర్ వినోద్‌ని అరెస్ట్ చెయ్యటానికి పోలీసులు వచ్చేసరికి మణిమాల శరీరం అతని చేతుల్లో వేలాడుతోంది.

కొన ఊపిరితో ఉన్న మణిమాల అస్పష్టంగా "మాధవ్" అనగలిగింది.

క్షణాలలో మణిమాలను మాధవ్ ఉన్న హాస్పిటల్‌కే తీసికెళ్ళారు. మణిమాలను ఆసితిలో చూసి మాధవ్‌కు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పాపం! అతనిది లేవలేని పరిసితి.

మాధవ్‌ని చూస్తూ మాట్లాడటానికి విశ్వప్రయత్నం చేసింది మణిమాల.

"మాధవ్! అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు."

కష్టంమీద ఆ మాత్రం అనగలిగింది. అవే మణిమాల చివరి మాటలు. ఆ తరువాత రెండు మూడు గంటల్లోనే మణిమాల ఆత్మ విశ్వంలో లీనమయిపోయింది.

21

పూలూ, పళ్ళూ స్వీట్స్ తీసుకుని సంబరంగా వచ్చాడు రాజు లలిత ఇంటికి. రాజు ముఖంలో అంత వికాసం ఇటీవలి కాలంలో చూడలేదు లలిత.

"కంగ్రాచ్యులేషన్స్ రాజూ!" అంది చిరునవ్వుతో.

"థేంక్యూ లలితా! నిజంగా మళ్ళీ నా డ్యూటీలో నేను చేరగలిగానంటే అది నీ చలవే! మెనీ మెనీ థేంక్స్."

లలిత ముఖం చిట్లించుకుంది.

"అలా మాట్లాడకు రాజూ. నేను నీకోసం చేసింది ఏంలేదు. రాగిణి చేసింది. నీకోసమని చెప్పలేననుకో! కానీ పాపం, ఇదంతా రాగిణి చలవ. మిగిలినదేమైనా ఉంటే మాధవరావుగారి సహాయం. అంతే! నాదేం లేదు."

"పోనీలే! ఎలా అయితేనేం? శనిరోజులు పోయాయి. ఎప్పటి నుండో నీతో చెప్పాలనుకుంటున్న సంగతి ఇప్పుడు నిస్సంకోచంగా చెపుతున్నాను లలితా! ఇదివరకే చెప్పాలనుకొన్నాను. కానీ, అప్పుడు నేనున్న దశలో ఆ మాటలకు విలువ ఉండదేమోనని చెప్పలేదు."

"ఏమిటది రాజూ?"

"నేను నిజంగా నిన్ను ప్రేమించాను లలితా! నిజం ఒప్పుకుంటున్నాను. నాలో చాంచల్యం ఉంది. రాగిణితో ఇంకా రాగిణిలాంటి మరి కొందరితో సంబంధాలు పెట్టుకున్నాను. కానీ నా మనసు ఎప్పుడూ నీకోసమే అలమటించేది. ఏదో గొప్ప సంబంధం చేసుకోవాలని అనుకున్నాను. కానీ ఎవరిని చూసినా నా మనసులో నువ్వు మెదిలి ఎవరినీ

చేసుకోలేకపోయాను. ఇప్పటికయినా మనం పెళ్ళి చేసుకుందాం లలితా!''

రాజు ముఖంలో సిన్సియారిటీ చూసి లలిత తడబడింది.

రాజు ఎప్పటిలా సెల్ఫిష్‌గా మాట్లాడితేనే బాగుండేది. ''వద్దు రాజూ! నా మాట విని హాయిగా ఎవరైనా గొప్పింటి అమ్మాయిని చేసుకో! సుఖపడు!''

''ఇంకా నామీద కోపం పోలేదా లలితా! చెప్పవేమున్నావా?''

''నో! నో! నిజం! నీమీద నాకే కోపమూ లేదు. నువ్వు సుఖపడాలనే చెప్తున్నాను నాకు తెలుసు. నువ్వు సుఖపడగలవు...''

''సరేలే! నీకంత అహంకారమయితే, నేనేం చెయ్యగలను?''

కోపంగా వెళ్ళిపోయాడు రాజు. ఆ కోపం చూసి 'హమ్మయ్య.' అనుకుంది లలిత పరవాలేదు. రాజు తప్పకుండా త్వరలోనే ఏదో ''మంచి'' సంబంధం చూసి పెళ్ళి చేసుకుంటాడు.

ప్రతిరోజూ సాయంత్రం నాలుగింటికి మాధవరావు ఇంటికెళ్ళి వీలయినంతసేపు కూచుని వస్తోంది లలిత మాధవరావుకి ఎడంకాలు మోకాలివరకు తీసెయ్యవలసి వచ్చింది ఎడంచెయ్యి పూర్తిగా విరిగిపోయింది. పోలీస్ ఆఫీసర్‌గా పనిచెయ్యగలిగే అవకాశం లేక ఇంట్లోనే ఉండిపోవలసి వచ్చింది. పెద్ద లైబ్రరీ ఏర్పాటు చేసుకున్నాడు. ఎప్పుడూ చదువుతూ ఉంటాడు. ''బిజీగా పనిచెయ్యటానికి అలవాటు పడినవాణ్ణి ఊరికే కూచుంటే ఎలా తోస్తుందా అనుకునేవాణ్ణి. ఈ పుస్తకాలు చదువుతోంటే చాలా హాయిగా ఉంది లలితా!'' అన్నాడు. అతని ముఖంలో చిరునవ్వు చూసి లోలోపల మెచ్చుకుంది లలిత.

సాయంత్రం అయ్యేసరికల్లా అతని స్నేహితులు చాలామంది వచ్చేవారు. డిపార్ట్‌మెంట్ విషయాలు చెప్పేవారు, అతని సలహాలు తీసుకునేవారు ''చూసావా! నా స్థితి ఇలా మారకపోతే, నా కింత మంచి మంచి స్నేహితులున్నారని తెలిసేదేకాదు.'' అనేవాడు హుషారుగా.

వాళ్ళతో ఏ కోశానా ఈర్ష్య లేకుండా ఆప్యాయంగా మాట్లాడే మాధవరావును ఆశ్చర్యంగా చూస్తూ కూచునేది లలిత. మాధవరావు స్నేహితులందరికీ కూడా లలితను మాధవరావు ఇంట్లో చూడటం అలవాటైపోయింది. వాళ్ళందరికీ కాఫీలు లలితే అందించేది.

అతని గదిలో బల్లమీద మణిమాల ఫోటో ఉంది. అది చూసినప్పుడు మాత్రమే అతని ముఖాన్న మబ్బులు క్రమ్మేవి. అప్రయత్నంగా ఒక్క నిట్టూర్పు వెలువడేది.

ఆరోజు లలితను చూడగానే ఆనందంతో ''కంగ్రాచ్యులేషన్స్!'' అన్నాడు మాధవరావు.

''దేనికి?''

"నిన్న రాజు నా దగ్గరకు వచ్చాడు త్వరలోనే నిన్ను పెళ్ళి చేసుకోబోతున్నానని చెప్పాడు"

"ఇందాకే రాజుతో చెప్పేసాను అతణ్ని చేసుకోలేనని"

"లలితా" నిజంగా ఆశ్చర్యపోయాడు మాధవరావు

"రాజు మంచి ఉద్యోగంలో ఉన్నవాడు అందగాడు నిన్ను కోరి చేసుకుంటానంటున్నాడు ఇంతకంటే ఏం కావాలి?"

"మానవ జీవితాల్లో విషాదాల కన్నింటికీ మూలం ఏమిటో తెలుసా? మనకేం కావాలో మనకు తెలియకపోవటం ఏదో ఏదో కావాలని దేనివెనకో పరుగులు పెడతాం చివరికెప్పుడో అర్థమవుతుంది, మనకు కావలసింది అదికాదని"

"ఓహ్! అయితే ఇంతకూ నీకు కావలసిందేమిటో నీకు తెలుసా?"

"తెలుసుకున్నాను ఎవరిదగ్గిరనుండో తెలుసా? మీ దగ్గిరనుండే!"

"నా దగ్గిరనుండా? నీకు కావలసింది నేను చెప్పానా? ఏమిటది?"

"మానవత్వం! నాకేకాదు ఏ మనిషికైనా కావలసింది మానవత్వం అదొక్కటే అతనికి సుఖాన్నీ, సంతృప్తినీ, ఆనందాన్ని ఇవ్వగలిగింది ఈ విషయం తెలుసుకున్నాను మీదగ్గిరనుండి"

"అనవసరంగా నన్ను గొప్పచేసి మాట్లాడుతున్నావు లలితా! మనందరికీ ఏం నేర్పినా ఈ జీవితమే నేర్పుతుంది ఏమయినా నువ్వు చేసింది మంచి పనికాదు ఎంతకాలం పెళ్ళి చేసుకోకుండా ఉంటావ్?"

"పెళ్ళి చేసుకోకుండా ఉండాలని నాకేం లేదు మీరు ఒప్పుకుంటే ఈ క్షణంలో మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను" గబగబ అనేసింది లలిత

"లలితా" ఆశ్చర్యంతో ఇంక మాట్లాడలేకపోయాడు

"నన్ను క్షమించండి! నాకా అర్హత లేకపోవచ్చు నా మనసులో ఆశ బయట పడేసుకున్నాను"

"పిచ్చిగా మాట్లాడకు" తనకున్న ఒక్క చేతినీ జాపి లలితను దగ్గిరగా తీసుకున్నాడు మాధవరావు

"ఈ సృష్టిలో ఎప్పుడు ఏ విధంగా సమన్వయం సిద్ధిసుందో మనం నిర్ణయించుకోలేం! ఒక దురదృష్టం నన్ను బాధించిందనుకున్నాను అదే దురదృష్టం, మరొక అదృష్టం నన్ను వరించడానికి కారణమయింది"

"ఇది నిజంగా అదృష్టమనే అనుకుంటున్నారా?"

మాధవరావు సమాధానం చెప్పలేదు లలితను మరింత దగ్గిరకు తీసుకున్నాడు ★

Edited and Published by V Leelavathy Raghavaiah, 40/1 Moosasait Street, Madras-600 017 and Printed by D Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001